'పౌరసత్వం' ఆశలపై ట్రంప్ నీళ్లు

- భారతీయ తల్లిదండ్రుల్లో ఆందోళన
- 'సీ-సెక్షన్' కోసం పరుగులు
- గ్రీన్ కార్డులు ఇక గగనమేనంటున్న నిపుణులు

7

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 192 | విజయవాడ, గురువారం 13 ఫిబ్రవరి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 13 February 2025 | Rs



సిరీస్ క్లీన్ స్వీప్

చివరి వన్డేలో ఇంగ్లండ్‌పై 142 పరుగుల తేడాతో టీమిండియా గెలుపు

గిల్ సెంచరీ.. కోహ్లి, శ్రేయస్ అర్ధసెంచరీలు

8

వృద్ధికే పెద్దపీట

సమపాళ్లలో సంక్షేమం, అభివృద్ధి • బడ్జెట్ కూర్పుపై ముఖ్యమంత్రి ఆదేశం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి


రానున్న బడ్జెట్‌లో వృద్ధి సాధనకే పెద్దపీట వేయాలని ఆర్థికశాఖ అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. బడ్జెట్ కూర్పుపై బుధవారం ఉండవల్లిలోని తన నివాసంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధికి సమపాళ్లలో ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 16 శాతం వృద్ధిని సాధించాలన్న లక్ష్యానికి అనుగుణంగా బడ్జెట్ రూపకల్పన చేయాలన్నారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాలతో ఆర్థిక వ్యవస్థ నిర్వీర్యమైందని, దానిని గాడిలో పెట్టేలా కొత్త బడ్జెట్ ఉండాలని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన వ్యయం కన్నా ఇప్పుడు సంక్షేమానికి చేయాల్సిన, చేస్తున్న వ్యయం అధికంగా ఉందని, అందుకే ఆ దిశగా ఎక్కువ నిధులు కేటాయించాల్సి ఉందని ఈ సమావేశంలో చంద్రబాబు అభిప్రాయపడినట్లు తెలిసింది. గతంలో ఇచ్చిన పింఛన్ల కన్నా తమ ప్రభుత్వం ఎక్కువ మొత్తాన్ని చెల్లిస్తుండడం, అది కూడా ఏరియర్స్‌తో



బడ్జెట్ కూర్పుపై ఆర్థిక శాఖ అధికారులతో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ఇవ్వడం వల్ల కొంతవరకు భారం పెరిగిందని ఈఆయన చెప్పారు. ప్రస్తుతం నెలకు 2,700 కోట్ల రూపాయల వరకు పింఛన్ల కోసం ఖర్చు చేయాల్సివస్తోందని అధికారులు ఈ సందర్భంగా ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఏప్రిల్ తరువాత సూపర్ సిక్స్‌లో మిగిలిన మూడు హామీలను అమలు చేయాల్సి ఉంటుందని, అందుకు కూడా బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు చేయాలని సూచించారు. ప్రధానంగా తల్లికి వందనం, ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ వంటి వాటికి స్పష్టమైన అంచనాలు సిద్ధం చేసి, నిధుల కేటాయింపుపై దృష్టి సారించాలని అన్నారు. అన్న క్యాంటీన్లు, దీపం రెండో దశ పథకాలకు కూడా అవసరమైన నిధులపై స్పష్టత ఉండాలని మిగతా 7లో

'ఉక్కు' దీక్షలకు నాలుగేళ్లు



2

నేటి నుంచి వెబ్‌సైట్‌లో గ్రూప్-2 హాల్ టిక్కెట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రూప్-2 పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రధాన పరీక్ష హాల్ టిక్కెట్లు గురువారం నుంచి అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) వెల్లడించింది. కమిషన్ వెబ్‌సైట్ psc.ap.gov.in నుంచి అభ్యర్థులు హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని కమిషన్ కార్యదర్శి ఐ నరసింహమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న రెండు పూటలా పరీక్ష జరగనుందని వివరించారు. పేపర్-1 పరీక్ష ఉదయం 10 నుంచి 12:30 గంటల వరకు మొదటి సెషన్, పేపర్-2 పరీక్ష మధ్యాహ్నం 3 నుంచి 5:30 గంటల వరకు రెండో సెషన్ జరగనుందని పేర్కొన్నారు. అభ్యర్థులు ముందుగానే హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకుని పరీక్ష కేంద్రాన్ని తెలుసుకోవడంతోపాటు మార్గదర్శకాలు అనుసరించాలన్నారు.

అడవులపై అదాని పడగ!

- ఒడిశాలో రూ.2.60లక్షల కోట్ల విలువైన బాక్సైట్ ఖనిజ కొండ
- బలంగీర్‌లోని 'గంధమదన' పర్వతం లూటీకి కేంద్రం గ్రీన్ సిగ్నల్
- విశాఖపట్నం-రాయపూర్ 6 లేన్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం వెనక కారణమిదేనా!
- మూలపేట పోర్టుకు ఈ బాక్సైట్ తేవడానికి మరో హైవే రోడ్డు ఏర్పాటు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

అటవీ గ్రామాలు, ప్రాంతాలే కాదు... ఏజెన్సీ రాష్ట్రాలన్నిటినీ దేశ పారిశ్రామిక దిగ్గజం అదాని పరం చేసేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కంకణం కట్టుకుంది. తాను చేసిందే 'ధర్మ సంస్థాపనం' అనే సూక్తులు వల్లెవేస్తూ ప్రకృతి సిద్ధమైన కొండలను కొల్లగొడుతూ గిరిజన సంపదలను దోచిపెట్టేందుకు సిద్ధమైంది. అడవుల్లో అడిగేవారెవ్వరూ ఉండరని ఇష్టారాజ్య పాలన సాగిస్తోంది. మావోయిస్టుల ఏరివేత వెనుక మర్మం కూడా కార్పొరేట్లకు సేవ చేయడానికేనని వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. అదాని గ్రూప్ సంస్థకు అన్ని మార్గాలనూ సుగమం చేస్తూ కేంద్రంలోని బిజెపి సర్కారు గిరిజన హక్కులను కాలరాస్తోంది. ఒడిశా జియలాజికల్ సర్వే అథారిటీ సంస్థ నిర్వహించిన సర్వే ప్రకారం బలంగీర్ కొండ (గంధమదన పర్వతం)పై బాక్సైట్, ఇతర ఖనిజ నిక్షేపాలు ఉన్నాయని గతంలోనే నివేదిక ఇచ్చింది. దీంతో, అదాని గ్రూపు ఈ పర్వతంపైగల రూ.2.60 లక్షల కోట్ల విలువైన బాక్సైట్ ఖనిజ సంపద దోపిడీకి సిద్ధమయ్యారు. ఈ చర్య ఏకంగా గిరిజనాన్ని ఏజెన్సీ రాష్ట్రాల నుంచి తరిమేసేలా తయారైంది. ఇప్పటికే దేశంలోని పోర్టులు, ఎయిర్ పోర్టులు అదానీ సొంతం అవుతున్నాయి. గ్రీన్ ఎనర్జీ పేరుతో విశాఖ ఉమ్మడి



గంధమదన పర్వతం

జిల్లా పూడిమడక అదానీ హైడ్రోజన్ హబ్‌కు 1200 ఎకరాలు భూమిని రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వ చూడడంతో భూములు, కొండలన్నీ అదాని పాదాక్రాంతం అవుతున్నట్టే లెక్క. అనకాపల్లి వద్ద పరవాడ ఎన్‌టిపిసిలో బొగ్గు కాంట్రాక్టులన్నిటినీ దక్కించుకునేందుకు టిడిపి కూటమి ప్రభుత్వం సహకరించింది. తాజాగా ఎపి మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు నష్టం చేసే నిర్ణయాన్ని చంద్రబాబు ప్రభుత్వం ఈ నెల రెండున తీసుకుంటూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సులియారీ గనిలోని ఎపిఎండిసికి చెందిన బొగ్గును అదానీకి మరో ఏడాది పాటు పొడిగిస్తూ (టెండరు పిలవకుండా) పోటీ లేకుండా అడ్డగోలుగా కొట్టేసే అవకాశం కల్పిస్తూ ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

గంధమదన పర్వతం ప్రత్యేకత బాక్సైట్ గనే...

బాక్సైట్ ఉన్న గంధమదన పర్వతానికి ఆంజనేయుడి సంజీవని పర్వతం అని పేరుంది. సూదిగా ఉండడంతో సూది కొండ అని స్థానికులు పిలుస్తుంటారు. అక్కడ ఆంజనేయుడు ఉంటాడనే నమ్మకంతో ఈ కొండకు దూరం నుంచి మిగతా 7లో

పవన్ కళ్యాణ్ ఆలయాల యాత్ర

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జనసేన పార్టీ అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలయాల బాట పట్టారు. దక్షిణ భారతదేశంలోని వివిధ రాష్ట్రాల్లోని ఆలయాలను ఆయన సందర్శించనున్నారు. దీనిలో భాగంగా బుధవారం కేరళలోని చొట్టనిక్కరలోని అగస్త్య మహర్షి ఆలయం, తిరువల్లంలోని పరశురామర్



కేరళలోని ఓ ఆలయంలో పవన్ కళ్యాణ్

క్షేత్రాన్ని ఆయన దర్శించారు. చొట్టనిక్కరలో పవన్‌కల్యాణ్‌కు అగస్త్య ఆలయం ట్రస్ట్‌బోర్డు అధ్యక్షులు యోగిదాస్, ఇతర సభ్యులు పవన్‌కు కేరళ సంప్రదాయంతో స్వాగతం పలికారు. నడుము నొప్పి, స్పాండిలైటిస్ సమస్యకు ఆయుర్వేదంలో అవలంభించే చికిత్స విధానాలపై అగస్త్య ఆశ్రమంలోని వైద్యులను అడిగి పవన్ తెలుసుకున్నారు. ఈ యాత్ర తన వ్యక్తిగత అంశమని, రాజకీయాలకు సంబంధం లేదని పవన్ కళ్యాణ్ ఈ సందర్భంగా అక్కడ మీడియాతో చెప్పారు. ఈ నెల 6వ తేదిన జరిగిన మంత్రివర్గ సమావేశానికి, 11వ తేదిన జరిగిన మంత్రులు, శాఖ కార్యదర్శుల సమావేశానికి పవన్ కళ్యాణ్ హాజరుకాలేదు. వైరల్ జ్వరంతో బాధపడుతున్నారని, స్పాండిలైటిస్ ఇబ్బంది పెట్టడం వల్ల మంత్రివర్గ సమావేశానికి హాజరుకాలేకపోతున్నారని ఉపముఖ్యమంత్రి కార్యాలయం ముందురోజు వెల్లడించింది. మంత్రులు, కార్యదర్శుల సమావేశానికి ఎటువంటి సమాచారం లేకుండా పవన్ గైర్హాజరయ్యారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ ఆరోగ్యం ఎలా ఉందని నాదెండ్ల మనోహర్‌ను అడగగా నడుంనొప్పితో బాధపడుతున్నారని మనోహర్ సమాధానం చెప్పారు. మంత్రులు, కార్యదర్శుల సమావేశానికి ముఖ్యమంత్రికి చెప్పకుండానే గైర్హాజరు కావడం, నడుం నొప్పితో బాధపడుతున్న పవన్ కళ్యాణ్ ఆలయాల యాత్ర చేపట్టడం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఆదేశాలిచ్చినా లెక్కలేదా?

- పోలీసులపై హైకోర్టు ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి

పౌరులను అక్రమ నిర్బంధ కేసుల్లో బాధితులను తమ ఎదుట హాజరుపర్చాలన్న ఉత్తర్వులను పోలీసులు అమలు చేయకపోవడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పోలీసులు పరిధి దాటి వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించింది. బాధ్యులైన పోలీసులపై చర్యలకు డిజిపిని కోర్టుకు పిలిపిస్తామంది. ఒక వ్యక్తిని అరెస్టు చేశాక మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచకుండానే ఎలా విడుదల చేస్తారని ఆగ్రహించింది. పోలీసుల తీరుపై విస్మయం వ్యక్తం చేసింది. నిర్బంధించిన వ్యక్తిని తమ ముందు హాజరుపరచాలన్న ఆదేశాలను పోలీసులు బేఖాతరు చేయడంపై నిప్పులు చెరిగింది. ఈ వ్యవహారాన్ని డిజిపి, ప్రకాశం జిల్లా ఎస్‌పిలకు నివేదించాలని అభిప్రాయపడింది. రమణ అరెస్ట్‌పై నివేదిక ఇవ్వాలని ప్రకాశం జిల్లా ఎస్‌పి, విశాఖపట్నం పోలీస్ కమిషనర్లను ఆదేశించింది. విచారణను ఈ నెల 18కి వాయిదా వేస్తూ జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ నూనెపల్లి హరినాథ్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. తన భర్త రమణ.. సిఎం, డిప్యూటీ సిఎం మిగతా 7లో

స్విమ్స్ నియామకాల్లో మత వివక్షత చట్ట విరుద్ధం

- సిపిఎం రాష్ట్రకమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తిరుపతి స్విమ్స్ మెడికల్ కళాశాలలో నాలుగు రేడియాలిజిస్టుల టీచింగ్ పోస్టులకు కన్సాలిడేటెడ్ పేమెంట్ మీద వాక్‌ఇన్ ఇంటర్వ్యూ ప్రకటనలో హిందూ మతానికి చెందిన అభ్యర్థులు మాత్రమే అర్హులని పేర్కొనడం రాజ్యాంగ విరుద్ధమని సిపిఎం రాష్ట్రకమిటీ తెలిపింది. మతాన్ని బట్టి వివక్షత చూపటం చట్ట విరుద్ధం, అప్రజాస్వామికమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టిటిడి ఆధ్వర్యంలో నడిచే విద్య,వైద్య సంస్థలు ప్రభుత్వ నియమ, నిబంధనలకు, రాజ్యాంగ వ్యవస్థకు లోబడి పనిచేస్తాయని వెల్లడించారు. అవి కూడా లౌకిక సంస్థలే అని పేర్కొన్నారు. ఇప్పటివరకు లేని నిబంధనలు ఉన్నట్లుండి ఒక్కసారిగా ముందుకు తేవటంలో రాష్ట్రప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న బిజెపి,



ఆర్‌ఎస్‌ఎస్‌ల పాత్ర కనిపిస్తుందని విమర్శించారు. మతం పేరుతో వివక్షతను ప్రదర్శించటం మంచిది కాదని సూచించారు.వెంటనే ఈ నిబంధనను ఉపసహరించుకొని అర్హులైన వారిని ఉద్యోగాల్లో నియమించాలని కోరారు. రాష్ట్రప్రభుత్వం జోక్యం చేసుకొని మతం పేరుతో సాగుతున్న ఈ వివక్షత పూరితమైన నిబంధనను రద్దు చేయాలని కోరారు.

బర్డ్ ఫ్లూతో 5.42 లక్షల కోళ్లు మృతి

- మంత్రి అచ్చెన్నాయుడు

3



పారిశ్రామికోత్పత్తి కుదేలు

- తయారీ రంగం వెలవెల
- డిసెంబర్‌లో 3.2 శాతమే..
- 4.31 శాతంగా రిటైల్ ద్రవ్యోల్బణం

7

ఎరువుల వాడకంపై కేంద్రం నిఘా

- సరిహద్దు జిల్లాలపై గురి
- కర్ణాటక, తమిళనాడుకు అక్రమంగా చేరుతున్నాయని ఆరోపణ
- స్కామ్‌గా గుర్తించి రంగంలోకి దిగిన స్టేట్ విజిలెన్స్



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

రాయలసీమ జిల్లాలకు కేటాయించిన ఎరువులు అక్రమ మార్గంలో పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడుకు తరలుతున్నాయంటూ కేంద్ర ప్రభుత్వం గట్టి నిఘా పెట్టింది. ప్రధానంగా శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాలకు ఈ ఏడాదికి ఎరువుల అవసరాలపై రూపొందించిన ముందస్తు ప్రణాళిక కంటే గత డిసెంబర్ నాటికి అత్యధికంగా అమ్ముడైనట్లు పేర్కొని ప్రత్యేక విచారణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి తాఖీదులు పంపినట్లు సమాచారం. యూరియాతో పాటు డిఎపి, కాంప్లెక్స్, ఎస్‌ఎస్‌పి, ఎంఒపి సేల్స్ పైనా అనుమానం వెలిబుచ్చింది. కేంద్రం ఆదేశాలతో హుటాహుటిన కదిలిన రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్‌ను, వ్యవసాయశాఖను రంగంలోకి దించింది.

ప్లాన్ చేసినదానికంటే అధిక ఎరువులు అమ్ముడైనట్లు భావిస్తున్న శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లో విజిలెన్స్ విభాగం విచారణ ముమ్మరం చేసింది. క్షేత్ర స్థాయి నుంచి సమాచారం సేకరిస్తోంది. చిత్తూరుతో పాటు మరికొన్ని జిల్లాల్లోనూ ఎరువుల అమ్మకాలపైనా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇదొక కుంభకోణమని, ఎరువుల కేటాయింపులు, అమ్మకాల వ్యవహారంలో కీలకంగా వ్యవహరించే కొంతమంది ముఖ్య వ్యవసాయాధికారులు, ఎరువుల కంపెనీలకు చెందిన ప్రతినిధుల చేతివాటం వలన ఆయా జిల్లాలకు కేటాయించిన ఎరువులు పక్కదారి పట్టాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

50 శాతం అధికం

శ్రీసత్యసాయి జిల్లాలో గత రెండేళ్లతో పోల్చితే ఈ సంవత్సరం అధిక మొత్తంలో ఎరువుల అమ్మకాలు జరిగాయని ప్రాథమిక విచారణలో గుర్తించారు. ఖరీఫ్‌నకు 14 వేల టన్నుల యూరియా కావాలని అంచనా వేయగా అంతకంటే 50 శాతం ఎక్కువగా అమ్ముడైందని చెబుతున్నారు. ఖరీఫ్‌లో జిల్లాలో తీవ్ర కరువుంది. సాగు బాగా తగ్గింది. జిల్లాలోని 21 మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించింది. పంటల సాగు గణనీయంగా తగ్గిపోయి, కరువు తీవ్రంగా ఉండగా ప్లాన్ చేసినదానికంటే 50 శాతం అదనంగా ఎరువులు అమ్ముడు కావడం వెనుక గోల్‌మాల్ ఉందని అనుమానిస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఎరువులు నిల్వ చేసేందుకు గోదాములు లేవు. రైల్వే రేక్ సౌకర్యం కూడా లేదు. అనంతపురం జిల్లాపైనే ఆధారం. అక్కడి నుంచి సత్యసాయి జిల్లాకు రావాల్సిన ఎరువులు మధ్యలోనే పక్కదారి పడుతున్నాయన్నది ప్రధాన ఆరోపణ.

అనంతలో కూడా..

మరోవైపు అనంతపురం జిల్లాలోనూ ఇదే పరిస్థితి ఉందన్నది కేంద్రం ప్రాథమిక అంచనా. అక్కడ ప్లాన్ కంటే 29 శాతం అధికంగా ఎరువులు సేల్ అయ్యాయని చెబుతున్నారు. మరో సరిహద్దు జిల్లా చిత్తూరుపైనా విజిలెన్స్ దృష్టి సారించిందని తెలిసింది. ప్రతి ఏటా తమిళనాడుకు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఎరువులు అక్రమంగా రవాణా కావడం మామూలేనని, ఈ ఏడాది కూడా అలాంటిది జరిగిందా అనే కోణంలో ఆరా తీస్తున్నారు. ఎరువుల వాడకంపై అనుమానం ఉన్న మరికొన్ని జిల్లాలపైనా నిఘా పెట్టారని తెలిసింది.

ఏ ఒక్క చిన్నారీ వివక్షకు గురికారాదు

- రోహింగ్యా పిల్లలకు పాఠశాలల్లో ప్రవేశంపై సుప్రీం వ్యాఖ్య

న్యూఢిల్లీ : విద్య విషయంలో ఏ ఒక్క చిన్నారి కూడా వివక్షకు గురికాకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రోహింగ్యా శరణార్థులకు ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల్లో ప్రవేశం కల్పించాలని కేంద్ర, ఢిల్లీ ప్రభుత్వాలకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ రోహింగ్యా హ్యూమన్ రైట్స్ ఇనిషియేటివ్ అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం విచారించింది. ఈ సందర్భంగా రోహింగ్యాల కుటుంబాలు ఎక్కడ నివసిస్తున్నాయి? వారి వివరాలేమిటి సవివరంగా తెలియజేయాలని పిటిషనర్‌ను న్యాయమూర్తులు జస్టిస్ సూర్య కాంత, జస్టిస్ ఎన్ కోటేశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం ఆదేశించింది. ఇందుకు కొంత వ్యవధి కావాలని ఎన్‌జిఒ తరుపు న్యాయవాది కొలిన్ గోన్సాల్వేస్ కోరారు. దీనికి అంగీకరించిన ధర్మాసనం పిటీషన్ తదుపరి విచారణను 10 రోజులు వాయిదా వేసింది. ఆధార్ లేదంటూ రోహింగ్యా శరణార్థులకు ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలల్లో ప్రవేశం నిరాకరిస్తున్నారని న్యాయవాది ధర్మాసనానికి తెలిపారు. 'రోహింగ్యాలు యుఎన్‌హెచ్‌సిఆర్



(యునైటెడ్ నేషన్స్ హై కమిషనర్ ఫర్ రెఫ్యూజీస్) కార్డులు కలిగి ఉండటంతో వారికి ఆధార్ కార్డులు లేవు' అని తెలిపారు. రోహింగ్యాలు ఢిల్లీలో ఎక్కడెక్కడ ఉన్నారు..? ఎక్కడ స్థిరపడ్డారు..? వారికి అందుబాటులో ఉన్న సౌకర్యాలు గురించి తెలియచేయాలని ఈ సందర్భంగా న్యాయవాదిని ధర్మాసనం ఆదేశించింది. ఆధార్ కార్డులతో సంబంధం లేకుండా, ఐడి ప్రూఫ్ కోసం పట్టుబట్టకుండా రోహింగ్యాల పిల్లలందరికీ ఉచితంగా ప్రవేశం కల్పించాలని, 10, 12 తరగతులు, గ్రాడ్యుయేషన్‌తో సహా అన్ని పరీక్షల్లో పాల్గొనడానికి అనుమతించాలని అధికారులను ఆదేశించాలని పిటిషన్ కోరింది. అలాగే, ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచిత ఆరోగ్య సేవలు, అంత్యోదయ అన్న యోజన పథకం కింద లభించే సబ్సిడీ ఆహార ధాన్యాలు, ఆహార భద్రతా చట్టం కింద లభించే ప్రయోజనాలను పౌరసత్వంతో సంబంధం లేకుండా రోహింగ్యా కుటుంబాలకు దేశంలో ఇతర పౌరులకు లభించే విధంగానే విస్తరించాలని కూడా పిటిషన్ కోరింది.

పెట్టుబడులు పెట్టండి

- సిఫీ టెక్నాలజీస్ సిఎమ్‌డితో మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సిఫీ టెక్నాలజీస్ ఛైర్మన్ అండ్ మ్యానేజింగ్ డైరెక్టర్ (సిఎమ్‌డి) రాజు వేగేశ్నను విద్య, ఐటిశాఖల మంత్రి నారా లోకేష్ కోరారు. ఈ మేరకు ఉండవల్లిలోని నివాసంలో మంత్రి లోకేష్‌ను రాజు బుధవారం కలిశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రస్తుతం ఉన్న అవకాశాలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న సేవలు, నూతనంగా తీసుకొచ్చిన ఐటి పాలసీల గురించి లోకేష్ వివరించారు. సిఫీ టెక్నాలజీస్ సంస్థ దేశంలో ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో ఒక్కటిగా ఉందని రాజు తెలిపారు. కంపెనీ విస్తరణ ప్రణాళికల్లో భాగంగా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాల గురించి మంత్రితో చర్చించారు. హిందూస్తాన్ కోకో-కోలా ప్రతినిధులు జూయన్‌పబ్లో రోడ్రిగూజ్ ట్రోవటో మంత్రి లోకేష్‌ను విడిగా కలిశారు.

23న జనసేన శాసనసభా పక్ష సమావేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జనసేన పార్టీ శాసనసభా పక్ష సమావేశాన్ని ఈ నెల 23న నిర్వహించనున్నట్లు ఆ పార్టీ ప్రకటించింది. ఈ సమావేశానికి పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్ అధ్యక్షత వహించనున్నారు. ఈ నెల 24 నుంచి శాసనసభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలు, ఇతర అంశాలు చర్చించేందుకు అధ్యక్షులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించనున్న ఈ సమావేశానికి పార్టీ శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, ఎంపిలు హాజరుకానున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

విశాఖ కోస్టల్ నిర్మాణాలపై అవసరమైతే తిరిగి సర్వే

ప్రజాశక్తి-అమరావతి

విశాఖపట్నం, భీమునిపట్నం బీచ్ సమీపంలో కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సిఆర్ జెడ్)లో జరిగిన సర్వేపై అధికారుల కమిటీ నివేదికపై సందేహాలుంటే తిరిగి సర్వే చేయిస్తామని హైకోర్టు ప్రకటించింది. సర్వేలో లోపాలుంటే అందుకు అధికారులను బాధ్యులు చేస్తామని చెప్పింది. కమిటీ సమర్పించిన సర్వే నివేదికను తమ ముందుంచాలని ప్రభుత్వానికి చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. సిఆర్ జెడ్ రూల్స్‌కు వ్యతిరేక నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలంటూ జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్, గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షులు గంటా నూకరాజు వేసిన వ్యాజ్యాలపై విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

తిరుపతి తొక్కిసలాటపై పిల్ క్లోజ్

ప్రజాశక్తి-అమరావతి

వైకుంఠ ద్వార దర్శనం టిక్కెట్ల జారీ సమయంలో తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందిన ఘటనపై హైకోర్టు రిటైర్డు జడ్జితో కమిషన్ ఏర్పాటైనందున పిల్‌పై విచారణ అవసరం లేదని హైకోర్టు పేర్కొంది. ఆరుగురు మృతి, 40 మందికి గాయాలవ్వడానికి కారణమైన తొక్కిసలాట ఘటనపై సిట్టింగ్ లేదా రిటైర్డు హైకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించడంతో పాటు, ఘటనపై విచారణ జరిపి 30 రోజుల్లో నివేదికను గవర్నర్‌కు సమర్పించేలా ఉత్తర్వులు ఇవ్వాలంటూ కర్నూలు జిల్లా, పాండురంగాపురానికి చెందిన గుడిబండ ప్రభాకర్ రెడ్డి, విజయవాడకు చెందిన వంగవీటి నరేంద్ర పిల్స్ వేశారు. చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం విచారించింది. పిల్స్ పరిష్కారమైనట్లుగా తీర్పు చెప్పింది. కమిషన్‌కు గడువు నిర్ణయించాలన్న పిటిషనర్ల అభ్యర్థనను తోసిపుచ్చింది.

పారిశ్రామికవేత్తల వెనకడుగు

- మాజీ ఎంపి గోరంట్ల మాధవ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలనతో పారిశ్రామికవేత్తలు వెనకడుగు వేస్తున్నారని మాజీ ఎంపి, వైసిపి అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ పేర్కొన్నారు. బుధవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నియంతల పాలన సాగుతోందని, దౌర్జన్యాలు, దాడులతో భయాందోళనలు పెంచేలా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అతి తక్కువ కాలంలోనే చెడ్డపేరు తెచ్చుకున్న ప్రభుత్వం దేశంలో ఎపి తప్ప మరొకటి లేదని అన్నారు. వందమందికి పైగా వైసిపి సోషల్ మీడియా యాక్టివిస్టులను అరెస్టు చేసి వేధిస్తున్నారని తెలిపారు. తాడిపత్రిలో పెద్దారెడ్డిని పోలీసులు అడ్డుకుంటున్నారని, అడిగితే ప్రాణహాని ఉందని చెబుతున్నారని పేర్కొన్నారు. పల్నాడులో బుల్డోజర్ల సాయంతో వైసిపి నాయకుల ఇళ్లను కూల్చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పడం వల్లే దావోస్ వెళ్లినా ఎపికి పెట్టుబడులు రాలేదని అన్నారు. పారిశ్రామికవేత్తలు ఎపి వైపు చూడటానికి కూడా భయపడుతున్నారని మాధవ్ పేర్కొన్నారు.

వైద్య ఖర్చుల భారాన్ని తగ్గిస్తాం

- కిమ్స్ హాస్పిటల్ ప్రారంభోత్సవ సభలో సిఎం చంద్రబాబు



సభలో ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రజలకు వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు కృషి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. గుంటూరు, విజయవాడ మార్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన కిమ్స్ శిఖర ఆస్పత్రిని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... వైద్య ఖర్చుల భారంతో కుటుంబాలు చితికి పోతున్నాయని తెలిపారు. ఒక ఆపరేషన్‌కు రూ.60 నుంచి రూ.70 లక్షల వరకు ఖర్చవుతుందని, అయినా మనిషి బతుకుతాడన్న గ్యారెంటీ ఉండటంలేదని తెలిపారు. భారీ ఖర్చులతో కుటుంబాలు దెబ్బ తింటున్నాయన్నారు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి మృతి చెందితే ఆ కుటుంబం చితికిపోతుందని తెలిపారు. రోగుల ఖర్చులు తగ్గించేందుకు ఆస్పత్రి నిర్వాహకులు ఆలోచించాలని కోరారు. చిన్నపాటి వ్యాధులకు కూడా అనవసరంగా ఎక్కువ రోజులు ఆస్పత్రుల్లో ఉంచకుండా ఇంటి దగ్గర నుంచి చికిత్సలు తీసుకునేలా చూడాలన్నారు. చికిత్సల్లో సాంకేతికతను ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వం కూడా వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు కృషి చేస్తోందని చెప్పారు. ప్రపంచాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ శాసిస్తోందని, జెనిటికల్ పరీక్షల ద్వారా ఎటువంటి వ్యాధులు రాబోతున్నాయో కూడా తెలుస్తోందన్నారు. ఆయుష్మాన్ భవన్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. నేచురల్ ఫుడ్‌లో రాష్ట్రాన్ని నెంబరు వన్‌గా చేస్తున్నామని చెప్పారు. దేశంలో ఉత్పత్తి అయ్యే గ్రీన్ ఎనర్జీలో 1/3 మన రాష్ట్రంలోనే చేయబోతున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఎలక్ట్రిక్ వెహికల్స్ వాడే రోజు రావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ ధ్రువపత్రాలు, సర్టిఫికెట్లు, ఇతర సమాచారాలన్నీ ఇక మీదట వాట్సాప్‌లోనే పొందవచ్చని తెలిపారు. వివిధ రంగాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ చేయడానికి ముందుకొచ్చే వారికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాబోయే రోజుల్లో డేటానే సంపద అవుతుందని తెలిపారు. 1995లో తాను ఐటి గురించి చెప్పానని, 30 ఏళ్ల తరువాత ఇప్పుడు ఎఐ గురించి చెబుతున్నానని తెలిపారు. భవిష్యత్తులో భారతీయులు అద్భుతాలు సృష్టిస్తారన్నారు. 2004లో టిడిపి గెలవకపోవడం వల్ల రాష్ట్రానికి ఎంతో నష్టం జరిగిందని, అలాగే 2019లో వైసిపి గెలవడం వల్ల ఎంతో విధ్వంసం జరిగిందని తెలిపారు. ప్రజల ప్రాధాన్యతలు తెలియని వారు సిఎంగా ఉంటే ఎంత నష్టమో మంగళగిరి ఎయిమ్స్‌కు 2019 నుంచి 2024 వరకు నీరు ఇవ్వకపోవడం ఉదాహరణ అని పేర్కొన్నారు. పేదలకు రూ.10తో వైద్యం అందించే ఎయిమ్స్‌ను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పి.నారాయణ, కె.అచ్చెన్నాయుడు, కందుల దుర్గేష్, నిమ్మల రామానాయుడు, పి.సత్యకుమార్, ఎమ్మెల్యేలు రామాంజనేయులు, నశీర్, మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి, కిమ్స్ ఆస్పత్రి ఛైర్మన్ బొల్లినేని భాస్కరరావు, సిఇఒ బి.అభినయ్, డాక్టర్ బి.అద్వక్, డి.అనిత, డాక్టర్ లక్ష్మణరావు, బొల్లినేని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో స్కాముల పాలన

- అన్యాయాలు చేసే వారిని వదిలిపెట్టను
- వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్కాములు తప్ప పాలన జరగడం లేదని వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం జరిగిన ఉమ్మడి గుంటూరు జిల్లా నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి పాలనలో దోచుకోవడం, దాన్ని పంచుకోవడంపైనే పాలకుల దృష్టి ఉందని తెలిపారు. మద్యం, ఇసుక, మైనింగ్ స్కాములతోపాటు పేకాట క్లబ్బులకు అడ్డే లేదన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేయాలంటే దందా చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. చిన్న పిల్లలపైనా 111 సెక్షన్ కింద, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేవారిపై ఆర్గనైజ్డ్ క్రైం యాక్టు కింద కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు. బడ్జెట్‌తోపాటే సంక్షేమ కేలండర్ అందించామని, కోవిడ్ లాంటి విపత్తులోనూ మేలు చేశామని చెప్పారు. వైద్యరంగంలో ఊహకందని మార్పులు తెచ్చామని, ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షలకు పెంచామని చెప్పారు. రైతుల కోసం ఆర్‌బికెలు ఏర్పాటు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చలేకపోవడంతో కూటమి నాయకులు గ్రామాల్లో తిరగలేని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రభుత్వ వ్యవస్థలన్నీ తిరోగమనంలో ఉన్నాయని, అతి తక్కువ కాలంలోనే ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందని అన్నారు. ఎన్నికల ముందు అబద్ధాలు చెప్పకపోవడం వల్లే ఓటమి చెందామని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో 50 శాతం ఓట్లు వస్తే ఈ ఎన్నికల్లో 40 శాతం ఓట్లు వచ్చాయని వందలో 40 మంది వైసిపి తరపునే ఉన్నారనే విషయాన్ని మర్చిపోవద్దని పేర్కొన్నారు. గతంలో బటన్ నొక్కి డబ్బులు జమచేస్తుంటే ముసలమ్మ కూడా నొక్కుతుందని విమర్శించారని, ఇప్పుడు సంక్షేమ పథకాలు ఎందుకు అమలు చేయలేకపోతున్నారని, బటన్ ఎందుకు నొక్కలేకపోతున్నారని ప్రశ్నించారు. హామీలు అమలు చేయని పార్టీలు బంగాళాఖాతానికో, అథ:పాతాళానికో పోతాయని విమర్శించారు. ఇప్పుడు అధికారం ఉందికదా అని చట్ట విరుద్ధంగా అన్యాయాలు చేసేవారినెవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని, తప్పు చేసిన వారిని చట్టం ముందు నిలబెడతామని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కనీసం సీట్లు లేకపోయినా అక్రమాలకు పాల్పడి వారి తరపున గెలిపించుకున్నారని, అలా గెలిచిన వారు కూడా వైసిపి నాయకులే అనే విషయాన్ని కూటమి నాయకులు గుర్తుపెట్టుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎంపి ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, మాజీ మంత్రి అంబటి రాంబాబు, విడదల రజిని, మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

'వెలుగొండ'కు రూ.2 వేలకోట్లు

- ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

త్వరలో ప్రవేశపెట్టబోయే రాష్ట్ర బడ్జెట్‌లో పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.2 వేలకోట్లు నిధులు కేటాయించడంతోపాటు ముంపు గ్రామాల ప్రజలకు నష్టపరిహారం చెల్లించి పునరావాసం కల్పించాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి.. సిఎం చంద్రబాబుకు, జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు బుధవారం లేఖ రాశారు. ప్రకాశం జిల్లాలోని 23 మండలాలు, నెల్లూరు జిల్లాలోని 5 మండలాలు, కడప జిల్లాలోని 2 మండలాలు చొప్పున మొత్తం 30 మండలాల పరిధిలో 4,47,300 ఎకరాలకు సాగునీరు, 15 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందించే విధంగా వెలుగొండ పథకం రూపకల్పన చేసినట్లు చెప్పారు. అత్యంత కరువు పీడిత ప్రాంతాలు, ఫ్లోరైడ్ సమస్య ఉన్న ప్రాంతాలైన వీటి అభివృద్ధి ఈ పథకంతో ముడిపడి ఉందని పేర్కొన్నారు. సుమారు రూ.4 వేల కోట్ల ఖర్చుతో పూర్తి చేయగలిగే అవకాశం ఉన్న వెలుగొండ ప్రాజెక్టు పనులకు 2025-26 బడ్జెట్‌లో కనీసం రూ.2 వేల కోట్లు నిధులు కేటాయించాలని, ప్రాజెక్టు నిర్మాణంలో సర్వం కోల్పోతున్న 11 గ్రామాల ప్రజలకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించి, పునరావాసం కల్పించాలని కోరారు.

రూ.2,378 కోట్లు వెనక్కి

- మంత్రి పార్థసారథి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గత ప్రభుత్వ హయాంలో సకాలంలో ఇళ్లను పూర్తి చేయకపోవడం వల్ల దాదాపు రూ.2,378 కోట్లు కేంద్ర నిధులు వెనక్కి వెళ్లినట్లు పౌరసంబంధాలు, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. అదేవిధంగా గృహ నిర్మాణ నిధులు దాదాపు రూ.3,598 కోట్లను మళ్లించి నిరుపేదలకు అన్యాయం చేసిన ఘనత వారిదేనన్నారు. సచివాలయంలోని పబ్లిసిటీ సెల్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గృహ నిర్మాణానికి కేంద్రం రూ.20,726 కోట్లు రాష్ట్రానికి కేటాయిస్తే ఆ నిధులను సక్రమంగా వినియోగించుకోలేదని చెప్పారు. 2018లో టిడిపి ప్రభుత్వ హయాంలో ఆవాస్ సర్వేలో 3,18,987 మందిని గుర్తించి కేంద్ర వెబ్‌సైట్‌లో నమోదు చేస్తే, వైసిపి అధికారంలోకి రాగానే వీరిలో 1,39,243 మందిని తొలగించారని చెప్పారు. వైసిపి నేతలు వారి తప్పిదాలను కప్పిపుచ్చి, కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేయడాన్ని తప్పుబట్టారు. 2014-19 మధ్య ఎన్‌టిఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకం కింద ప్రతి ఇంటికీ రూ.2.50 లక్షలు మంజూరు చేయడమే కాకుండా ఎస్‌సిలకు అదనంగా రూ.50 వేలు అందించినట్లు చెప్పారు. పివిటిజిలకు అదనంగా రూ.1 లక్ష ఇచ్చినట్లు చెప్పారు.

వచ్చే ఐదేళ్లలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ శాశ్వత ఇంటి సౌకర్యం కల్పించాలనేది ప్రభుత్వ లక్ష్యం అన్నారు. పిఎంఎవై గ్రామీణ్ 1.0లో ఈ ఏడాది మార్చి నాటికి పూర్తి కావాల్సి ఉండగా సిఎం చొరవతో డిసెంబరు వరకూ పొడిగించారన్నారు. ఇప్పటికే 1.15 లక్షల ఇళ్లు పూర్తి చేశామని, మిగిలిన 7.35 లక్షల ఇళ్లలో 1.50 లక్షల ఇళ్లు జూన్ నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. పిఎంఎవై గ్రామీణ్ 2.0 పథకాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోనున్నట్లు చెప్పారు. లబ్ధిదారులను గుర్తించేందుకు ఇప్పటికే సర్వే ప్రారంభించినట్లు తెలిపారు. 11,600 మందిని గుర్తించామన్నారు. ఈ పథకంలో 5 లక్షల ఇళ్లు మంజూరు చేయించుకోవాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు.

ఆర్టీసి ఉద్యోగులకు ఒపిఎస్

- ఎస్‌డబ్ల్యూఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్టీసి ఉద్యోగులకు ఓల్డ్ పెన్షన్ స్కీం (ఒపిఎస్)ను అమలు చేయాలని స్టాఫ్ అండ్ వర్కర్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు ఎస్.కె జిలానీ బాషా.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి బుధవారం లేఖ రాశారు. ఓల్డ్ పెన్షన్ స్కీం అమలవుతుందనే ఆశతోనే ఉద్యోగులు విలీనాన్ని కోరుకున్నారని చెప్పారు. 2004 సెప్టెంబరు 1వ తేదీకి ముందు చేరిన అందరు ప్రభుత్వ ఉద్యోగులకు ఓల్డ్ పెన్షన్ స్కీం అమలవుతుందని, అయితే, ఆర్టీసి ఉద్యోగులకు మాత్రం వారు చేరిన తేదీని పరిగణలోకి తీసుకోకుండా ఆర్టీసిని ప్రభుత్వంలో వీలీనం చేసిన తేదీని పరిగణలోకి తీసుకుని సిపిఎస్ లేక ఇపిఎస్ ఆప్షన్ ఎంచుకోవాలని చెప్పడం సహజన్యాయానికి విరుద్ధమని లేఖలో పేర్కొన్నారు. లీవులు, గ్రాట్యుటీ అన్ని చేరిన తేదీని పరిగణలోకి తీసుకుని లెక్కిస్తున్నప్పుడు పెన్షన్ విధానంలో కూడా ఉద్యోగంలో చేరిన తేదీనే పరిగణలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నోటు పుస్తకాల పంపిణీపై విచారణ

- విద్యాశాఖకు తెలుగుయువత ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గత ప్రభుత్వ హయాంలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహించే నోటు పుస్తకాల తయారీ, ముద్రణపై విచారణ నిర్వహించాలని తెలుగు యువత ప్రధాన కార్యదర్శి రాగాల ఆనంద్ కోరారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ సుధామూర్తిలను వేర్వేరుగా కలిసి బుధవారం వినతిపత్రం అందించారు. తయారీ, ముద్రణ, పంపిణీ కాంట్రాక్ట్‌ను జెసి గ్రాఫిక్స్ చేపట్టిందని తెలిపారు. ఎల్1 కాంట్రాక్ట్ పొందేందుకు ఆ కంపెనీ సపోర్టింగ్ బిడ్లు అశోక ఎంటర్‌ప్రైజెస్, ఉషోదయ హైదరాబాద్ పేర్లతో టెండర్లు వేసిందని పేర్కొన్నారు. ఈ సంస్థ యాజమాని మాజీ ఎంపి వైఎస్ అవినాష్ రెడ్డి బంధువని తెలిపారు. చిన్నస్థాయి వ్యాపారులకు టెండర్లలో పాల్గొనే అవకాశం లేకుండా దినకర్ అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం నోటు పుస్తకాల పంపిణీకి కొత్త టెండర్లు పిలిచారని, వీటిలో జెసి కంపెనీకి కాకుండా చిన్నస్థాయి వ్యాపారులకు అవకాశాలు అందేల చర్యలు తీసుకోవాలని కోరారు.


ఎగ్జిబిషన్‌లో ఎగసిపడుతున్న మంటలు

విజయవాడ ఎగ్జిబిషన్‌లో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - భవానీపురం (విజయవాడ)

విజయవాడలో ఏర్పాటు చేసిన ఓ ఎగ్జిబిషన్‌లో బుధవారం అగ్నిప్రమాదం సంభవించింది. దీంతో ఎగ్జిబిషన్‌లోని దుకాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. గ్యాస్ స్టవ్ నుండి మంటలు చెలరేగడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. అగ్నిమాక సిబ్బంది, ఎగ్జిబిషన్ నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ విద్యాధరపురం లేబర్ కాలనీ స్టేడియంలో జలకన్య ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. దీనిలో మధ్యాహ్నం 12 గంటల సమయంలో ప్రమాదవశాత్తూ అగ్ని ప్రమాదం జరిగింది. ఒక స్టాల్‌లో ఓ మహిళ వంట చేసుకుంటున్న సమయంలో ప్రమాదవశాత్తూ గ్యాస్ స్టవ్ నుండి మంటలు వ్యాపించాయి. ఆ మహిళ భయాందోళనలతో బయటకు పరుగెత్తుకు వచ్చింది. అయితే, స్టాల్ లోపల ఉన్న గ్యాస్ సిలిండర్లు పేలి ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. దట్టమైన పొగ, మంటలు మరింత ఉధృతమవడంతో అక్కడ ఉన్నవారు భయభ్రాంతుల గురై పరుగులు తీశారు. మంటలు చుట్టుపక్కల స్టాళ్లకూ వ్యాపించాయి. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండడంతో మొత్తం 13 స్టాళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. వ్యాపారులు తమ వస్తువులను కాపాడుకునే అవకాశం కూడా లేకుండా పోయింది. అగ్నిమాపక సిబ్బంది, భవానీపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సుమారు రెండు గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టమూ సంభవించలేదు.

తులసిబాబుకు రూ.కోటి ఎలా ఇచ్చారు

- గుంటూరు కోర్టులో రఘురామకృష్ణ రాజు

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

సిఐడి అధికారులు కస్టోడియల్ టార్చర్ చేసిన ఘటనలో వాంగ్మూలం ఇచ్చేందుకు డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణరాజు బుధవారం గుంటూరు కోర్టుకు హాజరయ్యారు. న్యాయమూర్తి కె.లలిత ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేశారు. దాదాపు నాలుగు గంటలపాటు ఆయన్ను కోర్టు విచారించి వాంగ్మూలం నమోదు చేసింది. కోర్టు లోపలికి వెళ్లే ముందు, తరువాత ఆయన రెండుసార్లు మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. సిఐడి కస్టడీలో తనను కొట్టిన కామేపల్లి తులసిబాబు న్యాయవాదిగా నమోదు చేసుకోకున్నా ఆయనకు గత ప్రభుత్వం భారీగా పారితోషికం ఇచ్చిందన్నారు. దాదాపు కోటి రూపాయిలు లీగల్ సలహా కింద తులసిబాబు సొమ్ము తీసుకున్నారని తెలిపారు. న్యాయవాదిగా నమోదు కాకుండానే ప్రభుత్వం డబ్బులు ఎలా ఇచ్చిందని ప్రశ్నించారు. దీనిపై తాను సుప్రీం కోర్టుకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ఐపిఎస్ అధికారిని ఇంత వరకు సస్పెండ్ చేయలేదని, అరెస్టు కూడా చేయలేదన్నారు. వైఎస్ జగన్ అసెంబ్లీకి రావాలని తాను కోరుకుంటున్నానని తెలిపారు. తనపై దాడి చేసి కొట్టిన దెబ్బలకు సంబంధించి నివేదికలు మార్చిన ఘటనలో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్ ప్రభావతి ముమ్మాటికి నిందితురాలేనని పేర్కొన్నారు. ఆమెకు సుప్రీం కోర్టులో బెయిల్ వచ్చిందని, ఇందుకు తాను అభ్యంతరం వ్యక్తం చేస్తూ కౌంటర్ దాఖలు చేస్తానని తెలిపారు.


దీక్షలో కూర్చున్న విఎస్‌పి ఒబిసి అసోసియేషన్ కార్మికులు

'ఉక్కు' దీక్షలకు నాలుగేళ్లు

ప్రజాశక్తి -ఉక్కునగరం (విశాఖపట్నం)


విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన 2021 ఫిబ్రవరి 12న కూర్మన్నపాలెం కూడలి వద్ద ప్రారంభించిన రిలే నిరాహార దీక్షలు బుధవారంనాటికి నాలుగేళ్లు పూర్తి చేసుకున్నాయి. 1462వ రోజు దీక్షలో విఎస్‌పి ఒబిసి అసోసియేషన్ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు పరంధామయ్య, బి.అప్పారావు మాట్లాడుతూ.. 40 ఏళ్ల విశాఖ ఉక్కు చరిత్రలో ఎన్ని కష్టాలొచ్చినా వాటన్నిటినీ సమర్థవంతంగా ఎదుర్కొంటూనే నాటి నిర్మాణానికి చేసిన రూ.8593 కోట్ల అప్పులు, వడ్డీలను పూర్తిగా చెల్లించిన విషయాన్ని గుర్తు చేశారు. 2009 నూతన ప్లాంట్ నిర్మాణం, ప్రారంభం నాటికీ తిరిగి సుమారు రూ.8000 వేల కోట్లకు పైగా నికర లాభలు గడించి చరిత్ర సృష్టించిందని చెప్పారు. ఈ 40 ఏళ్లలో ఉద్యోగులు జీతాల్లేకుండా ఎప్పుడు పని చేయలేదని తెలిపారు. సంపదను సృష్టించి దేశ నిర్మాణానికి అందించే శ్రామిక వర్గం జీతాల్లేకుండా సంస్థపైన గౌరవంతో పని చేస్తోందని చెప్పారు. జీతాలు రాకపోతే జీవించే హక్కును కోల్పోవడమేనని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, బి.అప్పారావు, వరసాల శ్రీనివాసరావు, బి.కామేశ్వరావు, ఇ.సన్యాసిరావు, ఆర్.సత్యనారాయణ, పెద్దిరాజు, జిఆర్‌కె.నాయుడు తదితరులు పాల్గొన్నారు.


ఎయు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులతో మాట్లాడుతున్న ఆంధ్రా యూనివర్సిటీ ఇన్‌ఛార్జి విసి జి శశిభూషణరావు

సమస్యలపై ఎయు విద్యార్థుల ధర్నా

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విశాఖ ఆంధ్రా యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ కామర్స్ విభాగాల విద్యార్థులు బుధవారం వైస్ ఛాన్సలర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ, ప్రభుత్వం తమకు ఇవ్వాల్సిన రీయింబర్స్‌మెంట్ నిధులను నేటికీ విడుదల చేయలేదని, కానీ మెస్ బిల్లులు చెల్లించాల్సిందేనని ఎయు అధికారులు తీవ్ర ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. లేనిపక్షంలో మెస్ కార్డులు నిలిపివేస్తామని చెబుతున్నారన్నారు. భోజనంలో నాణ్యత లోపిస్తోందని, హాస్టల్‌లో ఒక్క రూమ్‌కు ఒక లైట్, ఫ్యాన్ ఉండగా నెల బిల్లు రూ.350 నుంచి రూ.450 వరకూ వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బిల్లులు తమకు భారంగా మారాయని తెలిపారు. హాస్టల్ డెవలప్‌మెంట్ పేరుతో విద్యార్థుల నుంచి పెద్ద మొత్తంలో ఫీజులు వసూలు చేశారని, వాటిని తిరిగి విద్యార్థులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. మెస్ బిల్లులు తగ్గించాలని, ప్రభుత్వం నుంచి నిధులు వచ్చే వరకూ బిల్లుల వసూలు నిలిపివేయాలని కోరారు. మౌలిక వసతులు మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల ఆందోళనకు ఎస్‌ఎఫ్‌ఐ మద్దతు తెలిపింది. ఎయు విసి శశిభూషణరావు, రిజిస్ట్రార్ ధనంజయరావు స్పందించి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి యూనివర్సిటీ అధికారులతో పాటు ఎస్‌ఎఫ్‌ఐ ఎయు అధ్యక్షులు హర్షిత్, దుర్గాప్రసాద్ సహా ఎనిమిది మంది విద్యార్థులతో కమిటీ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు జి అజయ్, నాయకులు అరుణ్ కుమార్, నాని, తరుణ్, మహేష్, ప్రసాద్, పెద్ద సంఖ్యలో హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.


వెండి ఆభరణాల విరాళాన్ని అందించిన దాత

19 నుంచి శ్రీకపిలేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

తిరుపతి కపిలతీర్థంలో ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు జరగనున్న శ్రీ కపిలేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను టిటిడి జెఇఒ వి.వీరబ్రహ్మం బుధవారం పరిశీలించారు. 15న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగుతుందని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. 26న మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలో పుష్కరిణిని పరిశుభ్రంగా ఉంచాలని, ఆకర్షణీయంగా పెయింటింగ్, రంగోలీలు వేయాలని, స్వామివారి వాహనాలకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. వేసవి నేపథ్యంలో చలువ పందిళ్లు, తాగునీరు, అన్నప్రసాదాలు అందించేందుకు వీలుగా ఏర్పాట్లు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇఒ దేవేంద్రబాబు, ఎఇఒ కె.సుబ్బరాజు, సూపరింటెండెంట్ కెపి చంద్రశేఖర్, డిఇ మల్లయ్య, సీనియర్ అసిస్టెంట్ దాము, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఎ.రవికుమార్ పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి ఆభరణాలు విరాళం

శ్రీ కపిలేశ్వర స్వామి ఆలయంలోని శ్రీకామాక్షి అమ్మవారికి 9.115 కిలోల వెండి ఆభరణాలను తిరుమల వాస్తవ్యులు ఎస్‌వి నరహరి దంపతులు బుధవారం విరాళంగా అందించారు. సుమారు రూ.9.28 లక్షలు విలువ చేసే 12 రకాల ఆభరణాలను కపిలతీర్థం ఆలయంలోని ఊంజల్ మండపం వద్ద టిటిడి తిరుపతి జెఇఒ వి.వీరబ్రహ్మంకు అందజేశారు. దాత అందించిన వెండి ఆభరణాలలో అమ్మవారికి కిరీటం - 1, చెవులు - 2, చేతులు - 4, పాదాలు - 2, పీఠం - 2, అమ్మవారికి చీర - 1 ఉన్నాయి. అనంతరం ఆభరణాలకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దాత ఎస్‌వి నరహరి దంపతులను టిటిడి జెఇఒ వి.వీరబ్రహ్మం శాలువతో సత్కరించి స్వామివారి ప్రసాదాలను అందించారు.

భార్య కాపురానికి రాదేమోనని భర్త బలవన్మరణం

- కుమారుడి మృతితో తల్లి ఆత్మహత్య

ప్రజాశక్తి-రేపల్లె (బాపట్ల జిల్లా)

భార్య కాపురానికి రాదేమోనని భర్త బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుమారుడి మృతితో తల్లి కూడా ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన బాపట్ల జిల్లా రేపల్లెలో బుధవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..రేపల్లె పట్టణం నాలుగో వార్డులోని రజకవారి వీధిలో వెల్లటూరు రాజకుమారి (55) తన కుమారుడు నాగేంద్ర (26), కోడలు లక్ష్మీ తిరుపతమ్మతో కలిసి నివాసం ఉంటున్నారు. నాగేంద్ర, లక్ష్మీతిరుపతమ్మ దంపతులకు ఓ కుమారుడు ఉన్నారు. మూడు సంవత్సరాల క్రితం భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు రావడంతో తన కుమారుడిని తీసుకుని లక్ష్మీతిరుపతమ్మ పుట్టింటికి వెళ్లారు. కొద్ది రోజుల క్రితం తన భర్తకు విడాకుల నోటీసు పంపించారు. ఇక తన భార్య తన వద్దకు రాదేమోనన్న మనస్తాపంతో గత సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని నాగేంద్ర ఆత్మహత్య చేసుకున్నారు. కుమారుడి మృతితో రాజకుమారి కూడా ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. గత రెండు రోజులుగా ఇంట్లో నుండి ఎవరూ బయటికి రాకపోవడం, ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు గమనించి నాగేంద్ర బంధువులకు సమాచారం అందించారు. నాగేంద్ర బాబాయ్ వచ్చి ఇంట్లోని మృతదేహాలను గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజన హక్కులు కాపాడతాం

- ట్రైకార్ చైర్మన్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గిరిజనుల హక్కులు కాపాడటానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. జివో 3ను అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1/70 చట్టంపై ఆదివాసీలు అపోహలు పెట్టుకోవద్దన్నారు. పార్టీ వ్యవస్థాపకులు ఎన్‌టి రామారావు 1985లో జివో 275 ఇచ్చి గిరిజనులకు హక్కులు కల్పించి వాటి సంరక్షణకు కృషి చేశారని తెలిపారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా 2000లో చంద్రబాబు జిఓ 3తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఆదివాసీలను అన్ని విధాలుగా అణగదొక్కాలని వైసిపి ప్రభుత్వం చూసిందని ఆరోపించారు. టిడిపి నాయకులు ధారూ నాయక్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ, 1/70చట్టంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి స్పష్టత ఇచ్చారని తెలిపారు. ఈ చట్టంపై వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు.

శ్రీవారి భక్తులకు టిటిడి విజ్ఞప్తి

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీవారి దర్శనానికి టోకెన్లు, టికెట్లు పొందిన యాత్రికులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లలోకి ప్రవేశించాల్సిందిగా టిటిడి విజ్ఞప్తి చేసింది. ఇదే విషయాన్ని పలుమార్లు ప్రచార, ప్రసార మాధ్యమాల ద్వారా యాత్రికులకు తెలియజేశాం. అయినప్పటికీ ఇటీవల కొంతమంది యాత్రికులు తమకు కేటాయించిన సమయానికి ముందే క్యూలైన్ల వద్దకు వెళ్లి క్యూలైన్లలోకి అనుమతించాలని సిబ్బందితో వాగ్వాదానికి దిగడమేకాకుండా, సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదు అని పేర్కొంది.

రొయ్యల ధర ఆశాజనకం

ఇతర దేశాలకు జోరుగా ఎగుమతులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

వనామి రొయ్యల ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో ప్రస్తుతం సాగు తక్కువగా ఉండటం, అంతర్జాతీయంగా ధరలు పెరగడంతో తాజా ధరలు రైతుల్లో ఉత్సాహాన్ని నింపుతున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 85 వేల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. అత్యధికంగా కోనసీమ జిల్లాలో 50, శాతం, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో 50 శాతం ఆక్వా సాగవుతోంది. ప్రస్తుతం వంద కౌంట్ ధర రూ.255 ఉంది. ఈ ధర గతంలో రూ.200 మించిలేదు. 90 కౌంట్ ధర రూ.265 ఉంది ఈ ధర గతంలో రూ.165 నుంచి రూ.180 మాత్రమే పలికింది. 80 కౌంట్ ధర రూ.285, 70 కౌంట్ ధర రూ.325, , 60 కౌంట్ ధర రూ.345 చొప్పున వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. 50 కౌంట్‌కు రూ.375 ధర లభిస్తోంది. 40 కౌంట్ ధర రూ.415కు చేరింది. 30 కౌంట్ ధర రూ.470 వరకూ ఉంది. గత పంటతో పోల్చితే కౌంట్లపై రూ.80 నుంచి రూ.100కు పైగా ధరలు పెరిగాయి. దీంతో, రైతులు వంద కౌంట్లను తీయడం లేదు. 40 లేదా 50 కౌంట్ల వరకూ వేచి చూస్తున్నారు. జిల్లా నుంచి చైనా, యూరప్, కొరియా దేశాలకు ఎగుమతులు జరుగుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాల వల్ల జిల్లాలోని ఆక్వా రైతులను కొన్నేళ్లుగా నష్టాలను చవిచూశారు. రొయ్యల మేత ధరలు ఏటా పెరగడం, మార్కెట్లో రొయ్యలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం ఇందుకు కారణం. ఈ నేపథ్యంలో తాజాగా పెరిగిన రొయ్యల ధరలు కొంత ఊరటనిస్తున్నాయని రైతులు చెబుతున్నారు.


చెరువులో రొయ్యలు పడుతున్న కార్మికులు

రొయ్య పిల్లల ధర పెంచేసిన వ్యాపారులు

రొయ్యల ధర ఆశాజనకంగా ఉండడంతో రొయ్య పిల్లల ధరలను వ్యాపారులు పెంచేశారు. గతంలో సాధారణ రకం రొయ్య పిల్ల ధర 15 పైసల నుంచి 20 పైసలు ఉండేది. ప్రస్తుతం 25 పైసలకు పెంచేశారు. నాణ్యమైన రొయ్య పిల్ల ధర 30 పైసల నుంచి 35 పైసలకు చేరింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 280 వరకూ రొయ్యల హేచరీలు ఉన్నాయి. వీటిలో సాధారణ రకం రొయ్య పిల్లలతోపాటు క్వాలిటీ రకం రొయ్య పిల్లలను ఉత్పత్తి చేస్తున్నారు. యజమానులు సిండికేటై రొయ్యల పిల్లల ధరను పెంచి అమ్ముతున్నాయి. లోకల్‌గా రొయ్య పిల్లలు నాణ్యత లేకపోవడంతో కొంతమంది రైతులు గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి సీడ్‌ను దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో, అదనపు భారం పడుతోంది. ప్రస్తుతం నెలకొన్న డిమాండ్ నేపథ్యంలో అధికార యంత్రాంగం చొరవ చూపి స్థానికంగా నాణ్యమైన రొయ్య పిల్లలు ఉత్పత్తి చేసే దిశగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. రొయ్యలకు వినియోగించే మేత ప్రొ బయాటిక్స్, ఇతర మందుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. వీటి ధరలకు కళ్లెం వేస్తే చిన్న, సన్నకారు రైతులు సైతం వనామి సాగు చేసే అవకాశాలున్నాయి. ఎగుమతిదారులు గతంలో సిండికేటై రొయ్యల ధర తగ్గించి కొనుగోలు చేసిన ఉదాహరణలు జిల్లాలో ఉన్నాయి.

సిండికేట్ కాకుండా చూడాలి



ప్రస్తుతం రొయ్యల ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. వ్యాపారులు సిండికేటై ధరను తగ్గించకుండా చూడాలి. లేకుంటే మళ్లీ నష్టపోతాం. 30 కౌంట్ కేజీ ధర రూ.470కు చేరడంతో అత్యధిక మంది 30 లేదా 40 కౌంట్ వచ్చే వరకూ ఆగి రొయ్యలు తీస్తున్నాం. తాజా ధరల నేపథ్యంలో రొయ్య పిల్లల ధర కూడా 15 పైసల వరకూ పెరిగింది. ఈ పంట చేతికొచ్చే నాటికి ధరలు పడిపోతే రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉంది. రొయ్యల మేత ధరల పెరుగుదలను నియంత్రించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

- పినిపే జయరాజ్, ఆక్వారైతు, జగ్గరాజుపేట, ఉప్పలగుప్తం మండలం


భిక్షాటన చేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్లు

క్లాప్ ఆటో డ్రైవర్ల భిక్షాటన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు నగరంలో ఫిబ్రవరి ఒకటో తేదీన అక్రమంగా విధుల నుంచి తొలగించిన తమను వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి మెయిన్ బజార్ వరకూ క్లాప్ డ్రైవర్లు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మాట్లాడుతూ.. మూడు నెలలుగా క్లాప్ ఆటోల డ్రైవర్లకు జీతాలు లేకపోవడంతో పస్తులతో అలమటిస్తున్నారని తెలిపారు. బకాయి జీతాల కోసం పాలకులు, అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని, నిరసనగా ఈరోజు భిక్షాటన చేపట్టామని వివరించారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి క్లాప్ ఆటోల డ్రైవర్లకు ఇవ్వాల్సిన మూడు నెలల బకాయి జీతాలు వెంటనే ఇవ్వాలని, అక్రమంగా తొలగించిన క్లాప్ ఆటో డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమానికి సిఐటియు నగర కార్యదర్శి వైఎస్.కనకారావు, ఆటో డ్రైవర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబు సంఘీభావం తెలిపారు.

రిజర్వాయర్ ద్వారా చెరువులకు నీటి విడుదల

- బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ (శ్రీసత్యసాయి జిల్లా)

రిజర్వాయర్ల ద్వారా చెరువులకు నీరందించి రైతుల కళ్లల్లో ఆనందం నింపుతామని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం గొల్లపల్లి రిజర్వాయర్ పూర్తి స్థాయిలో నీటితో నిండిన నేపథ్యంలో బుధవారం నిర్వహించిన జల హారతి కార్యక్రమం ఆమె పాల్గొన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి చెరువులకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడూతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయాంలోనే గొల్లపల్లి రిజర్వాయర్ పూర్తయ్యిందని తెలిపారు. రెండేళ్ల తర్వాత ఈ రిజర్వాయర్ పూర్తి సామర్థ్యంతో నిండడంతో దిగువనున్న పెనుకొండ, హిందూపురం, మడకశిర ప్రాంతాల్లోని పలు చెరువులకు నీటిని విడుల చేస్తున్నట్లు చెప్పారు. పోలవరం, బనకచర్ల డ్యామ్‌ను పూర్తి చేసి ప్రతి రైతుకూ కృష్ణా జలాలు అందించేలా సిఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు. ఇరిగేషన్ ప్రాజెక్టులను మొదలు పెట్టి కాలువల వెడల్పు కోసం రూ.3,650 కోట్లు విడుదల చేశారన్నారు. వైసిపి అధికారంలో ఉనన్ని రోజులూ జగన్‌మోహన్‌రెడ్డి సాగునీటి ప్రాజెక్టులను పట్టించుకోలేదని విమర్శించారు. రాష్ట్రంలో వైసిపి శకం ముగిసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


గొల్లపల్లి రిజర్వాయర్‌లో గంగపూజ చేస్తున్న మంత్రి సవిత

అదాని అవినీతిపై ప్రధాని ప్రకటన చేయాలి

- సిపిఐ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అదాని అవినీతిపై ప్రధాని మోడీ ప్రకటన చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అమెరికా అధ్యక్షులుగా ఎన్నికైన ట్రంప్, దేశంలో అవినీతికి పాల్పడిన అదానికి సాయం చేసే విధంగా ఫారన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్ - 1977 అమలును 6 మాసాలపాటు నిలిపివేస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేయడాన్ని తప్పుబట్టారు. అదానికి ప్రధాని మోడీ అన్ని రకాలుగా సాయం చేస్తున్నారని విమర్శించారు. హిడెన్ బర్గ్ నివేదిక వచ్చిన సమయంలో పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు చర్చకు లేవనెత్తే పరిస్థితి లేకుండా చేశారని చెప్పారు. ఇప్పుడు అమెరికా అధ్యక్షులు ట్రంప్ కూడా అదానికి అనుకూలంగా ఈ చర్యలు చేపట్టడంతో, మోడీ, ట్రంప్ కార్పొరేట్ అనుకూల విధానాలు తేటతెల్లమవుతున్నాయని తెలిపారు.

యాక్సెస్ నుంచి విద్యుత్ కొనుగోలు వద్దు

యాక్సెస్ ఎనర్జీ సంస్థ నుంచి అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు యత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ సంస్థ ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను అధిక ధరలకు ఎపి ప్రభుత్వం కొనుగోలు చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. ఈ ఒప్పందం వల్ల రానున్న 25 ఏళ్లలో వినియోగదారులపై రూ.14,186.92 కోట్ల మేర భారం పడుతుందన్నారు.

తోపుడుబండ్ల తొలగింపుపై నిరసన

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

తోపుడుబడ్లను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ విశాఖ పూర్ణామార్కెట్ బస్సు స్టాపు వద్ద సిఐటియు ఆధ్వర్యాన బుధవారం చిరు వ్యాపారులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు విశాఖ నగర కార్యదర్శి ఎం సుబ్బారావు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పూర్ణా మార్కెట్ వద్ద రోడ్లపై తోపుడుబండ్లపై చిల్లర వ్యాపారాలు చేసుకుంటున్న వారిని అధికారులు తొలగించమనడం అన్యాయమన్నారు. తోపుడుబండ్లతో వ్యాపారాలు చేయవద్దనిముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఒక్కసారిగా చెప్పడం దారుణమన్నారు.

దళితులు, బిసిలు చిరు వ్యాపారులు చేసుకుంటూ బతుకుతున్నారని తెలిపారు. ఇటీవల రూ.30 వేలు విలువైన పండ్లు, పూలను అధికారులు ధ్వంసం చేసి వ్యాపారాలు చేయొద్దని హెచ్చరించారని ఆవేదన వ్యక్తం చేశారు. తోపుడు బండ్ల కార్మికుల సమస్యలను పరిష్కరించి, వారు వ్యాపారాలు చేసుకోవటానికి అవకాశం ఇవ్వాలని కోరారు. అనంతరం చిరు వ్యాపారులు ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తోపుడు బండ్ల కార్మికులు, చిల్లర వర్తకులు, మహిళలు పాల్గొన్నారు.



ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్తున్న చిరు వ్యాపారులు

బర్డ్ ఫ్లూతో 5.42 లక్షల కోళ్లు మృతి

- మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కోళ్ల మరణాలకు బర్డ్ ఫ్లూ కారణమని వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ వ్యాధికి గురై నాలుగు ప్రాంతాల్లోని కోళ్ల ఫారాల్లో 5.42 లక్షల కోళ్లు కొద్ది రోజుల కిందట మృతి చెందాయని చెప్పారు. మృతి చెందిన కోళ్ల నమూనాలను భోపాల్‌లో ఉన్న ల్యాబ్‌లో పరీక్షించిన అనంతరం బర్డ్ ఫ్లూగా గుర్తించినట్లు తెలిపారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉండవల్లిలోని తన నివాసంలో బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సమావేశ వివరాలను మంత్రి అచ్చెన్నాయుడు మీడియాకు వెల్లడిస్తూ.. వ్యాధి పూర్తిగా తగ్గుముఖం పట్టిందని, పరిస్థితి అదుపులో ఉందని తెలిపారు.

సోషల్ మీడియాలో 40 లక్షల కోళ్లు మృతి చెందినట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 10.78 కోట్ల కోళ్లు ఉన్నాయని తెలిపారు. వ్యాధి గురించి ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వ్యాధిని గుర్తించిన కోళ్ల ఫారాల్లో 14 వేల కోళ్లు జీవించి ఉండగా వాటిని చంపి ఖననం చేశామని, 3 వందల గుడ్లను కూడా శాస్త్రీయ విధానంలో డిస్పోజ్ చేశామని పేర్కొన్నారు.



వ్యాధిని గుర్తించిన ప్రాంతాల నుంచి కిలోమీటర్ వరకూ రెడ్‌జోన్ ఏర్పాటుచేసి షాపుల్లో విక్రయాలు నిలిపేసినట్లు చెప్పారు. 70 డిగ్రీల సెల్సియస్ వద్ద ఇందుకు కారణమైన వైరస్ మృతి చెందుతుందని, కోడి గుడ్లు, మాంసం పూర్తిగా ఉడికించిన తరువాత తీసుకోవడం వల్ల ఎటువంటి ఇబ్బంది ఉండదని అన్నారు. రాష్ట్రం నుంచి కోడిగుడ్లు అధికంగా పశ్చిమ బెంగాల్‌కు ఉత్పత్తి చేస్తున్నారని, అక్కడ వీటి కొనుగోళ్లు నిలిపివేశారని తెలియడంతో అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారని చెప్పారు. సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు.

721 ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు

బర్డ్ ఫ్లూ వ్యాధి నివారణకు పశు సంవర్ధకశాఖ చర్యలు చేపట్టిందని, ఇందులో భాగంగా సంబంధిత శాఖల అధికారులతో 721 ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటుచేసినట్లు ఆ శాఖ డైరెక్టర్ టి దామోదరనాయుడు తెలిపారు. వ్యాధిని గుర్తించిన జిల్లాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. కోళ్ల ఫారాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు.

ఆరో రోజూ నష్టాల పరంపర

- ఇంట్రాడేలో సెన్సెక్స్ 900 పాయింట్ల పతనం
- వీడని ట్రంప్ టారీఫ్ భయాలు

ముంబయి : వరుసగా ఆరో సెషన్‌లోనూ భారత స్టాక్ మార్కెట్లలో నష్టాల పరంపర కొనసాగింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల భయాలు, ఎఫ్‌ఐఐలు తరలిపోవడం, భారత జిడిపి వృద్ధిపై అనుమానాలు ఇన్వెస్టర్లను ఆందోళనకు గురి చేశాయి. ఈ నేపథ్యంలోనే బుధవారం ఇంట్రాడేలో బిఎస్ఇ సెన్సెక్స్ ఏకంగా 905 పాయింట్లు పతనమై 76వేల దిగువకు పడిపోయి 75,388 కనిష్టాన్ని తాకింది. మధ్యాహ్నం తర్వాత కొంత కొనుగోళ్లు పుంజుకున్నప్పటికీ.. తుదకు 122.52 పాయింట్ల నష్టంతో 76,171 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 26 పాయింట్లు కోల్పోయి 23,045కు చేరింది. ఫిబ్రవరి నాలుగో తేదీ నుంచి సెన్సెక్స్ 2,412.73 పాయింట్లు లేదా 3.07 శాతం, నిఫ్టీ 694 పాయింట్లు 2.92 శాతం చొప్పున నష్టపోయాయి. సెన్సెక్స్-30లో మహీంద్రా అండ్ మహీంద్రా, ఐటిసి, పవర్‌గ్రిడ్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, టైటాన్, ఇన్ఫోసిస్ షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. మరోవైపు బజాజ్ ఫిన్ సర్వ్, టాటా స్టీల్, లార్సెన్ అండ్ టర్బో, అల్ట్రా టెక్ సిమెంట్, కోటక్ మహీంద్రా బ్యాంక్, టాటా మోటార్స్ తదితర షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ముందు వరసలో ఉన్నాయి. మంగళవారం నాటికి రూ. 4,486.41 కోట్ల విలువైన ఎఫ్‌ఐఐలు తరలిపోయాయి. డాలరుతో రూపాయి మారకం విలువ 9 పైసలు బలహీన పడి 86.88 వద్ద నమోదయ్యింది. ఏషియన్ మార్కెట్లలో సియోల్, టోక్యో, షాంఘై, హాంకాంగ్ మార్కెట్లు సానుకూలంగా నమోదయ్యాయి.



కావేరీ సీడ్స్ లాభాల్లో 29 శాతం వృద్ధి

kaveri seeds®

హైదరాబాద్ : ప్రముఖ విత్తనాల కంపెనీ కావేరీ సీడ్స్ 2024-25 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 29.05 శాతం వృద్ధితో రూ.15.04 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.11.66 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.118.47 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన క్యూ3లో 30.63 శాతం పెరిగి రూ.154.77 కోట్లకు చేరినట్లు తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది మాసాల్లో 1.46 శాతం పెరుగుదలతో రూ.294.46 కోట్ల నికర లాభాలు ఆర్జించినట్లు పేర్కొంది. వరి, మొక్కజొన్న విభాగాల్లో మెరుగైన ప్రగతిని కనబర్చినట్లు ఆ కంపెనీ సిఎండి జివి భాస్కర్ రావు తెలిపారు.

ప్రోస్టర్మ్ ఇన్ఫో ఐపిఒకు సెబీ అనుమతి

ముంబయి : పవర్ సొల్యూషన్స్ ప్రొడక్ట్ కంపెనీ ప్రోస్టర్మ్ ఇన్ఫో సిస్టమ్స్ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ) కోసం చేసుకున్న దరఖాస్తుకు మార్కెట్ రెగ్యులేటర్ సెబీ అనుమతి ఇచ్చింది. ఈ ఇష్యూలో రూ.10 ముఖ విలువ కలిగిన 1.6 కోట్ల ఈక్విటీ షేర్లను జారీ చేయనున్నట్లు ఆ కంపెనీ ప్రతిపాదిత పత్రాల్లో తెలిపింది. ఈ నిధులను పెట్టుబడి మూలధనం, రుణాల చెల్లింపు, వృద్ధి అవకాశాలు, సాధారణ కార్పొరేట్ అవసరాల కోసం ఉపయోగించనుంది. 2023-24 నాటికి తమకు ఎల్‌అండ్‌టి, టాటా పవర్, బజాజ్ ఫైనాన్స్ సహా 700 పైగా క్లయింట్స్ ఉన్నారని ఆ కంపెనీ తెలిపింది. 2023-24లో 18 శాతం వృద్ధితో రూ.22.8 కోట్ల నికర లాభాలు సాధించింది.

153 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-పాచిపెంట (పార్వతీపురం మన్యం జిల్లా)

పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలంలోని మాతుమూరు గ్రీన్‌ఫీల్డ్ రహదారి కూడలి వద్ద బుధవారం 153 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను పాచిపెంట పోలీస్‌స్టేషన్‌లో ఎఎస్‌పి అంకిత సురాన బుధవారం మీడియాకు వివరించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా నుంచి మాతుమూరు మీదుగా సాలూరు వైపు కారులో గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులకు ముందస్తు సమాచారం వచ్చింది. ఈ నేపథ్యంలో మాతుమూరు వద్ద గ్రీన్‌ఫీల్డ్ రహదారి కూడలిలో పాచిపెంట ఎస్‌ఐ వెంకట సురేష్ తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా ఉన్న ఓ కారును ఆపగా అందులో ఉన్న వ్యక్తులు కారు విడిచి పరారయ్యారు. అనంతరం పోలీసులు కారును తనిఖీ చేయగా అందులో నాలుగు సంచుల్లో 33 గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కారును సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.15 లక్షలు ఉంటుందని ఎఎస్‌పి వెల్లడించారు. గత మూడు నెలల కాలంలో వెయ్యి కిలోల గంజాయిని పట్టుకున్నామని చెప్పారు. గంజాయిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్‌ఐ వెంకట సురేష్, సాలూరు రూరల్ సర్కిల్ బృందాన్ని ఆమె అభినందించారు.


పట్టుబడిన గంజాయితో ఎఎస్‌పి అంకిత సురాన, సిఐలు రామకృష్ణ, అప్పలనాయుడు, ఎస్‌ఐ వెంకట సురేష్

కాంప్లెక్స్ సమావేశానికి సాధారణ సెలవు ఇవ్వాలి

- ఎపిటిఎఫ్ విజ్ఞప్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రతినెలా మూడో శనివారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు హాజరయ్యే ఉపాధ్యాయులకు సాధారణ సెలవుకు అనుమతినివ్వాలని ఎపిటిఎఫ్ కోరింది. మెడికల్ లీవ్ తప్ప మిగిలిన సెలవులు ఉపాధ్యాయులు వినియోగించొద్దనే నిబంధన విధించడంపై పునరాలోచన చేయాలని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి హృదయరాజు, ఎస్ చిరంజీవి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. శనివారం సగం రోజు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు పెట్టడం, సెలవులను వినియోగించుకోకూడదని చెప్పడం సబబు కాదని పేర్కొన్నారు. పాఠశాలకు పూర్తిరోజు సెలవు ప్రకటించి కాంప్లెక్స్ సమావేశాలు జరిపితే ఫలితం ఉంటుందని తెలిపారు.

హాఫ్ డే సమావేశం సరికాదు : టిఎన్‌యుఎస్

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల నిర్వహణ కోసం మూడో శనివారం సగం పూట పాఠశాల నిర్వహించడం సరికాదని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం తెలిపింది.

ఉదయం 11:45 గంటల వరకు జరిపి మరలా మధ్యాహ్నం ఒంటి గంటకు సమావేశానికి చేరుకోవడం ఇబ్బందిగా ఉంటుందని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, రామశెట్టి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. రవాణా సౌకర్యం లేని అనేక పాఠశాలలు ఉన్నాయని, కావున సగం రోజు స్కూల్ కాంప్లెక్స్‌ల నిర్వహణ ఆలోచనను మానుకోవాలని కోరారు.

చోరీకి గురైన 638 సెల్‌ఫోన్లు రికవరీ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు జిల్లా పోలీసులు మరోమారు భారీ ఎత్తున సెల్‌ఫోన్లు రికవరీ చేసి పోగొట్టుకున్న వారికి అందించారు. ఏలూరు నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ బుధవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... గత మూడు నెలల్లో జిల్లాలో పలువురు తమ సెల్‌ఫోన్లను పోగొట్టుకున్నారు. సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సిఇఐఆర్) పోర్టల్‌ను ఉపయోగించి ఫోన్‌లను తిరిగి రాబట్టారు. మొత్తం 638 సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్‌పి తెలిపారు. రాష్ట్రంలోని కృష్ణా, పశ్చిమగోదావరి, అంబేద్కర్ కోనసీమ జిల్లాలతోపాటు తెలంగాణ, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి రికవరీ చేసి తెచ్చామని చెప్పారు. వీటి విలువ సుమారు రూ.76.56 లక్షలు ఉంటుందన్నారు. స్వాధీనం చేసుకున్న ఫోన్లను అసలైన వినియోగదారులకు తిరిగి అందజేసినట్లు తెలిపారు.

ఇప్పటి వరకు 14 సార్లు సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశామని.. మొత్తం రూ.4,06,39,000 విలువైన 2,398 సెల్‌ఫోన్లను బాధితులకు అందించినట్లు ఎస్‌పి చెప్పారు.

23 పట్టణాల్లోనూ అదే రోజు మందుల డెలివరీ

- అమెజాన్ ఫార్మసీ వెల్లడి

బెంగళూరు : దేశ వ్యాప్తంగా మందుల లభ్యతను మరింత సరళతరం చేసినట్లు అమెజాన్ ఫార్మసీ తెలిపింది. వినియోగదారులు ప్రముఖ మెట్రోలు, ద్వితీయ శ్రేణీ 2 నగరాలు సహా 23 పట్టణాలలో అందుబాటులో ఉన్న అదే రోజు విస్తృత శ్రేణీలో డెలివరీ సేవలను పొందవచ్చని పేర్కొంది.

తమ విక్రేతలు సుదూర ప్రాంతాల్లో కూడా వేలాది ప్రిస్క్రిప్షన్ మందులు, ఆరోగ్య సంరక్షణ అవసరాలను ఇంటి వద్ద అందించడానికి దేశవ్యాప్తంగా లాజిస్టిక్స్ నెట్ వర్క్‌ను వినియోగిస్తున్నారని ఆ సంస్థ ప్రతినిధి హర్ష్ గోయల్ పేర్కొన్నారు.

నాట్కో ఫార్మాకు రూ.133 కోట్ల లాభాలు

హైదరాబాద్ : ప్రముఖ ఔషధ ఉత్పత్తుల కంపెనీ నాట్కో ఫార్మా 2024-25 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 37 శాతం పతనంతో రూ.133 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.212.70 కోట్ల లాభాలు ప్రకటించింది. ఇదే సమయంలో రూ.758.60 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన క్యూ3లో 37.4 శాతం క్షీణించి రూ.474.80 కోట్లకు పరిమితమయ్యింది. 2024-25కు గాను మూడో మధ్యంతర డివిడెండ్ కింద ప్రతీ రూ.2 ముఖ విలువ కలిగిన షేర్‌పై రూ.1.50 చెల్లించడానికి ఆ కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. రికార్డ్ తేదిని ఫిబ్రవరి 18గా నిర్ణయించింది.

NATCO
Natco Pharma Limited

ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్ లాభాల్లో 70 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ నికర లాభాలు 70 శాతం పెరిగి రూ.18.5 కోట్లకు చేరాయి. సంస్థ రెవెన్యూ 49 శాతం పెరిగి రూ.700 కోట్ల మైలురాయిని చేరినట్లు వెల్లడించింది. గడిచిన త్రైమాసికంలో నెలసరి లావాదేవీల సంఖ్య 62 శాతం పెరిగి 10 కోట్లు దాటినట్లు తెలిపింది.

సంపాదకీయం

చిత్తశుద్ధి చూపాలి

ఏజెన్సీకి రక్షణ కవచమైన 1/70 చట్ట పరిరక్షణ కోసం ఆదివాసీ ప్రజానీకం ఉద్యమించిన తీరు శ్లాఘనీయం. ఆదివాసీ అఖిలపక్ష రాజకీయ, ప్రజాసంఘాలు రెండురోజుల మన్యం బంద్‌కు పిలుపునిస్తే ఉద్యమ తీవ్రతతో 24 గంటలు గడవకముందే ముఖ్యమంత్రి స్పందించి ఆ చట్టాన్ని కొనసాగిస్తామంటూ హామీ ఇవ్వాల్సి వచ్చింది. దీంతో రెండవరోజు బంద్‌ను విరమిస్తున్నట్లు ఆందోళనకారులు ప్రకటించారు. ఇంతటి పోరాటపటిమ చూపిన ప్రజానీకానికి, వారిని నడిపించిన వివిధ ప్రజాసంఘాలకు, పక్షాలకు అభినందనలు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకోసం భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తిని గిరిజన ప్రజానీకం కొనసాగించాల్సి వుంటుంది. మన్యం బంద్‌కు పార్టీ అభిమానాలకు అతీతంగా గిరిజనం కదిలారు. విద్యార్థులు, యువత రోడ్లమీదకు వచ్చారు. సామాన్య ప్రజానీకం కూడా ఎక్కడికక్కడ బంద్‌లో భాగస్వామ్యమైంది. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలతో పాటు, హోటళ్లు, దుకాణాలను స్వచ్ఛందంగా మూసి వేశారు. వాహనాలు నిలిచిపోయాయి. నిరసనలు, బైఠాయింపులతో ఏజెన్సీ ప్రాంతం మారుమ్రోగింది. తమ మనుగడకు మూలమైన వివిధ ఏజెన్సీ చట్టాల అమలు, పరిరక్షణ విషయంలో గిరిజన ప్రజానీకంలో నెలకొన్న ఆందోళనే బంద్ పిలుపునకు ఈ స్థాయిలో స్పందన రావడానికి కారణం. ఈ వాస్తవాన్ని విస్మరించి ఎవరో తప్పుడు ప్రచారం చేసి, అపోహలు సృష్టిస్తున్నట్లు ముఖ్యమంత్రి ఎక్స్‌లో చేసిన పోస్టులో పేర్కొనడం విడ్డూరంగా ఉంది. కొద్ది రోజుల క్రితం కార్పొరేట్లకు ఏజెన్సీని అప్పచెప్పడానికి వీలుగా 1/70 చట్టాన్ని సవరించాలంటూ రాష్ట్ర స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు గిరిజనులు ఆగ్రహంతో రోడ్డెక్కడానికి తక్షణ కారణం. స్పీకర్ వ్యాఖ్యలపై చర్చలు, నిరసనలు జరుగుతున్న సమయంలో కిమ్మనకుండా ఊరుకోవడం, బంద్ పిలుపు తరువాత కూడా అణచివేత చర్యలకు, ముందస్తు అరెస్టులకు దిగడం పట్ల సర్కారు ఆత్మశోధన చేసుకోవాలి.

నిజానికి దేశ వ్యాప్తంగా అటవీ ప్రాంతాలపై కార్పొరేట్ల కన్ను ఇప్పటిది కాదు. మైనింగ్ కోసమో, టూరిజం పేరుతోనో పచ్చటి అడవులను కబళించడానికి ఎప్పటినుండో ఆ శక్తులు పావులు కదుపుతున్నాయి. వామపక్షాల చొరవతో రూపొందిన అటవీ హక్కుల చట్టంతో పాటు ఏజెన్సీ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్ యాక్టు (1/70), అటవీ సంరక్షణ చట్టం, పంచాయతీ రాజ్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్డ్ ఏరియాస్ యాక్టు (పెసా) వంటివి వారి ప్రయత్నాలకు అడ్డుగా ఉన్నాయి. కేంద్రంలో నరేంద్రమోడీ నేతృత్వంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వీటిని నీరుగార్చి, అటవీ భూములను కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రక్రియను ప్రారంభించింది. మోడీ ప్రభుత్వం చేపడుతున్న ఈ గిరిజన వ్యతిరేక కార్యక్రమాలను టిడిపి ఏనాడూ ఖండించకపోగా, ఇటీవల అటవీ సంరక్షణ చట్టానికి ప్రతిపాదించిన సవరణలను పార్లమెంటులో బలపరిచింది. టిడిపి కూటమి ప్రభుత్వం విడుదల చేసిన విజన్ 2047 డాక్యుమెంటుతో పాటు అనుబంధ పాలసీల్లోనూ కార్పొరేట్లకు భూ పందేరమే కీలకం కావడం, ఏజెన్సీ ప్రాంతానికీ అందులో పెద్ద పీట వేయడం గమనార్హం. ఈ పాలసీలు విడుదలైన తరువాతే అయ్యన్నపాత్రుడు వంటి నేతలు ఏదో ఒక సాకుతో గిరిజనుల హక్కులపై దాడికి తెగబడుతున్నారు. గత వైసిపి ప్రభుత్వం అదానీ సంస్థలకు, తాజాగా రాష్ట్ర మంత్రివర్గం నవయుగ వంటి సంస్థలకు ఏజెన్సీ ప్రాంతంలో హైడ్రో, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వడం కూడా గిరిజనులకు, అటవీ భూములకు పొంచి ఉన్న ముప్పునకు నిదర్శనం. ఒకదాని తరువాత ఒకటిగా చోటుచేసుకుంటున్న ఈ పరిణామాలే గిరిజనుల్లో భయాందోళనలకు, ఆగ్రహానికి కారణమవుతున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా అడవిబిడ్డల్లో నెలకొన్న భయాందోళనలను పూర్తిగా తొలగించాలి. త్వరలో జరగనున్న బడ్జెట్ సమావేశాల్లో అసెంబ్లీ వేదికగా 1/70తో సహా ఇతర అటవీ చట్టాల పట్ల ప్రభుత్వ వైఖరిని ముఖ్యమంత్రి విస్పష్టంగా ప్రకటించాలి. ఈ ప్రాంతంలో జరిగే ఉద్యోగ, ఉపాధ్యాయ నియామకాలను 100 శాతం గిరిజనులకే రిజర్వ్ చేస్తూ జిఓ నెంబర్ 3ని పునరుద్ధరించాలి. ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సిని నిర్వహించాలి. గిరిజనుల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక వికాసానికి అవసరమైన అన్ని చర్యలను తీసుకోవడం ద్వారా చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే!

మహనీయుల మాట



ప్రశ్నించడం మానేస్తే బానిసత్వానికి అలవాటు పడినట్లే.
- బి.ఆర్.అంబేద్కర్, భారత రాజ్యాంగ నిర్మాత.

మద్దతు ధరలకు చట్టబద్ధత-కేంద్రం వైఖరి!


విశ్లేషణ

- సత్య

బడ్జెట్ ప్రవేశ పెట్టబోయే ముందు కేంద్రంలో ఎవరు అధికారంలో ఉన్నా వివిధ తరగతుల ప్రతినిధులతో చర్చలు జరపటం ఒక తంతుగా జరుగుతున్నది. అన్ని రోడ్లూ రోమ్‌కే అన్నట్లుగా ఏ పాలక వర్గ పార్టీ చరిత్ర చూసినా గర్వకారణం ఏమీ లేదు. సంపదలలో పెద్ద పీట కార్పొరేట్ శక్తులకే వేస్తున్న కారణంగానే అసమానతలు ఏటేటా పెరుగుతున్నాయి. తంతుగా అయినా బడ్జెట్ చర్చకు రైతు సంఘాలను కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించలేదు.

కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత, ఇతర అంశాల గురించి పరిశీలించేందుకు 2022 జులైలో కేంద్రం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఇంతవరకు అది ఏం చేసిందో ఎవరికీ తెలియదు. వారు నివేదిక సమర్పించరు. ప్రభుత్వమూ అడగదు. అంతా ఒక నాటకంగా మారింది. ఈ లోగా 2021లో క్షమాపణలు చెప్పి మరీ వెనక్కు తీసుకున్న మూడు సాగు చట్టాలను మరో రూపంలో ముందుకు తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం పావులు కదుపుతోంది. దేశంలో భూ కమతాలు పద్నాలుగు కోట్లకు పైగా ఉన్నాయి. వాటిలో 88 శాతం రెండున్నర ఎకరాల లోపు కలిగిన రైతులే ఉన్నారు. వ్యవసాయం గిట్టుబాటు కావటం లేదంటూ వారందరినీ కార్పొరేట్లకు అప్పగించేందుకు తన బాధ్యతను వదిలించుకొనేందుకు కేంద్రం చూస్తున్నది. ఒకసారి అది జరిగితే రాష్ట్రాలు కూడా అదేబాట పడతాయి. పరిశ్రమలు, వాణిజ్యాలకు అనేక రక్షణలు, రాయితీలు ఉన్నాయి. వాటి మాదిరిగానే తమకూ కల్పించాలని రైతులు కోరటం గొంతెమ్మ కోర్కె కాదు. కనీస మద్దతు ధరను ఒక్క హక్కుగా చట్టబద్ధం చేయాలని కోరుతున్నారు.

పారిశ్రామిక ఉత్పత్తులకు, ఎగుమతులకు, దిగుమతులకూ రాయితీలు ఇస్తున్న ప్రభుత్వం రైతులను ఎందుకు విస్మరిస్తున్నది? పోనీ వ్యవసాయం ఉపాధి కల్పించటం లేదా?



పరిశ్రమలు, సేవారంగాల కంటే ఎక్కువ 44 శాతం మందికి కల్పిస్తున్నది. సంఘటితంగా పోరాడే స్థితిలో వారు లేకపోవటం తప్ప మరొకటి కనిపించటం లేదు. మనకు అవసరమైన వంట నూనెల్లో 60 శాతం విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. దానికి ఎన్నో రాయితీలు ఇస్తున్నది ప్రభుత్వం. కానీ ఇక్కడ నూనె గింజలు పండించేవారికి ధరల గురించి ఒక హామీ ఇవ్వటానికి ముందుకు రావటం లేదు. మార్కెట్ శక్తుల దయాదాక్షిణ్యాలకు వదలివేస్తున్నది. గతేడాది సోయా, ఆవ రైతులు కనీస మద్దతు ధర కంటే తక్కువే పొందారు. మరోవైపున బియ్యం, గోధుమలు, ఉల్లి, పంచదార వంటి వాటి ఎగుమతుల మీద నిషేధం పెట్టి మార్కెట్లో రైతులకు అన్యాయం చేశారు. వినియోగదారులకు మేలు చేయటం అంటే రైతుల నోట్లో మట్టి కొట్టటం కాదు కదా! ప్రభుత్వం నిర్ణయించిన మొత్తం కంటే తక్కువకు రైతుల నుంచి చెరకును మిల్లులు కొనుగోలు చేయకూడదు (అది గిట్టుబాటు కావటం లేదు). అదే మాదిరి ఇతర పంటలకు ప్రభుత్వం ఎందుకు హామీ ఇవ్వటానికి నిరాకరిస్తున్నది? కనీస వేతన చట్టాన్ని అమలు జరపకపోతే కార్మికులు కోర్టులకు ఎక్కే హక్కు ఉంది, కానీ రైతులకు కనీస మద్దతు ధరలకు అలాంటి అవకాశం లేదు. దాదాపు పదిహేను కోట్ల మంది రైతులు ఉండగా వారిలో తొమ్మిది కోట్ల మందికి ఏటా ఆరు వేల రూపాయలు ఇచ్చి అదే మహాభాగ్యం అని చెబుతున్నది. తప్పుల తడకలతో కూడిన గణాంకాలు (వివిధ సూచికలను ప్రకటించినపుడు ప్రభుత్వమే అలా చెబుతున్నది. ఉదా : దేశ ఆకలి సూచిక) వెల్లడించినదాని ప్రకారం 2004-05లో వ్యవసాయ వాణిజ్య సూచిక 87.72గా ఉన్నది. 2010-11 నాటికి 102.95కు పెరిగింది. దాని ప్రకారం పెట్టుబడుల కంటే పంటల అమ్మకం ద్వారా ఎక్కువ పొందారని భాష్యం చెప్పారు. అదే 2022-23లో ఆ సూచిక 97.21కి పడిపోయింది. అంటే రైతులు పొందుతున్నది తగ్గిపోయింది. అందుకే రైతుల కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కోరుతున్నారు.

రద్దు చేసిన మూడు సాగు చట్టాలను మూడు సంవత్సరాల తరువాత కేంద్ర ప్రభుత్వం దొడ్డిదారిన మరో రూపంలో ముందుకు తీసుకురావటం ఆందోళన కలిగించే అంశం. నేషనల్ అగ్రికల్చర్ మార్కెటింగ్ పాలసీ (నాంప్)ని 2024 నవంబరు 25న కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. దీనికి వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) ఆధ్వర్యాన డిసెంబరు 23న దేశమంతటా నిరసన తెలిపారు. అనేక మంది నిపుణులు విమర్శించారు. దాని మీద అభిప్రాయాలు తెలిపేందుకు కేవలం పదిహేను రోజులు మాత్రమే కేంద్రం గడువు ఇచ్చింది. ఇప్పుడున్న మార్కెటింగ్ వ్యవస్థలో ఎలాంటి లోపాలు లేవని కాదు, దాన్ని సంస్కరించకూడదని ఎవరూ చెప్పటం లేదు. అయితే ఆ పేరుతో ఇప్పుడున్నదాని కంటే ప్రమాదకరమైన ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి సంస్థలు సూచించిన పద్ధతిలో సమూల మార్పులు ప్రతిపాదించటం ఆందోళనకరం. దాని ప్రకారం దేశమంతటిని అనుసంధానించే ఒకే మార్కెట్‌ను ఏర్పాటు చేస్తారు. ఇదంతా చిన్న రైతులు, చిన్న వ్యాపారుల ప్రయోజనాల కంటే కార్పొరేట్లకే ప్రాధాన్యత ఇచ్చే వ్యవహారం. రైతులు ముడి సరకును సరఫరా చేసేవారిగా మాత్రమే ఉంటారు. వాటి నుంచి ఉత్పత్తులు తయారు చేయటం, వాణిజ్యం, ఎగుమతి అంతా కార్పొరేట్లదే. ఈ క్రమంలో తేలే మిగులులో రైతుల వాటా గురించి ఎక్కడా స్పష్టత లేదు. అంతే కాదు కనీస మద్దతు ధరలకు ఎలాంటి హామీ ప్రస్తావన కూడా లేదు. అలాంటి ఉద్దేశ్యం ఉంటే ఈ పాటికి కేంద్ర ప్రభుత్వం దాని గురించి ఒక స్పష్టత ఇచ్చి ఉండేది. రైతాంగానికి గరిష్ట ప్రయోజనం, డిజిటల్, పారదర్శకత, జాతీయ మార్కెట్ సమాచారం వంటి పదజాలం ఎంతగా వల్లించినా వాటిని వినియోగించుకొనే అవకాశం ఎంత మంది రైతులకు ఉంటుందన్నది ప్రశ్న. ఇప్పుడు అనేక నియంత్రణలు ఉన్నా వాటిని ఖాతరు చేయకపోవటం, దొడ్డిదారిన ఉల్లంఘిస్తున్న కంపెనీలపై అసలు ఎలాంటి నియంత్రణలు ఉండకూడదని ఈ ప్రతిపాదనల్లో ఉన్నది. వ్యవసాయం ఉమ్మడి జాబితాలో ఉన్నప్పటికీ ఈ విధానంతో రాష్ట్రాల హక్కులు, నియంత్రణలకు నీళ్లు వదులుకోవాల్సిందే. అమల్లోకి వచ్చిన తరువాత గానీ ఇతర మంచి చెడ్డలు వెల్లడి కావు.

ఇప్పుడున్న మార్కెటింగ్ వ్యవస్థలో ఎలాంటి లోపాలు లేవని కాదు, దాన్ని సంస్కరించకూడదని ఎవరూ చెప్పటం లేదు. అయితే ఆ పేరుతో ఇప్పుడున్నదాని కంటే ప్రమాదకరమైన ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి సంస్థలు సూచించిన పద్ధతిలో సమూల మార్పులు ప్రతిపాదించటం ఆందోళనకరం. దాని ప్రకారం దేశమంతటిని అనుసంధానించే ఒకే మార్కెట్‌ను ఏర్పాటు చేస్తారు. ఇదంతా చిన్న రైతులు, చిన్న వ్యాపారుల ప్రయోజనాల కంటే కార్పొరేట్లకే ప్రాధాన్యత ఇచ్చే వ్యవహారం. రైతులు ముడి సరకును సరఫరా చేసేవారిగా మాత్రమే ఉంటారు. వాటి నుంచి ఉత్పత్తులు తయారు చేయటం, వాణిజ్యం, ఎగుమతి అంతా కార్పొరేట్లదే. ఈ క్రమంలో తేలే మిగులులో రైతుల వాటా గురించి ఎక్కడా స్పష్టత లేదు. అంతే కాదు కనీస మద్దతు ధరలకు ఎలాంటి హామీ ప్రస్తావన కూడా లేదు.

ఫిబ్రవరి 14వ తేదీన కేంద్ర, పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం, రైతు సంఘాల ప్రతినిధుల మధ్య జరిగే చర్చల ఎజెండా ఏమిటో తెలియదు. ఎవరెవరు పాల్గొనేదీ ఇంకా స్పష్టం కాలేదు. ఒకటి మాత్రం స్పష్టం, ఇది ఒక రోజులో తేలే వ్యవహారం కాదు. కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని 2012 లోనే సిఎంగా ఉండగా నరేంద్ర మోడీ కమిటీ నాటి కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. దీని గురించి తాజా పార్లమెంటరీ కమిటీ కూడా సిఫార్సు చేసినా మోడీ మొరాయిస్తున్నారు. పార్లమెంటరీ కమిటీ సిఫార్సును అమలు చేయాలంటూ కేంద్రానికి సూచించాలని రైతు సంఘాల నేతలు సుప్రీం కోర్టును కోరారు. వ్యవసాయ గ్రాంట్లపై ఏర్పాటైన కమిటీ 2024-25 నివేదికను గతేడాది డిసెంబరు 20న పార్లమెంటుకు సమర్పించింది. దీన్ని కేంద్రం ఆమోదిస్తే అమలుకు ఉపక్రమించాలి. తిరస్కరిస్తే కారణాన్ని చెప్పాల్సి ఉంటుంది. పార్లమెంటరీ కమిటీ చేసిన సిఫార్సు ఇలా ఉన్నాయి. ప్రస్తుతం ఏడాదికి ఇస్తున్న కిసాన్ సమ్మాన్ యోజన మొత్తం రూ. ఆరు వేలను పన్నెండు వేలకు పెంచాలి (దాన్ని చూసి కొంత మంది అమలు జరగనున్నట్లు ప్రచారం చేశారు). ఈ ప్రోత్సాహకాన్ని కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులకు కూడా ఇవ్వాలి. కనీస మద్దతు ధరల చట్టబద్ధతకు ఒక రోడ్ మ్యాప్‌ను సాధ్యమైనంత త్వరలో ప్రకటించాలి. వ్యవసాయ కార్మికులకు కనీస జీవన వేతనాల నిమిత్తం జాతీయ కమిషన్ ఏర్పాటు. రైతులు, వ్యవసాయ కార్మికులకు రుణాల రద్దు పథకాన్ని ప్రవేశ పెట్టాలి. వ్యవసాయ శాఖ పేరులో వ్యవసాయ కార్మికుల పేరును కూడా చేర్చాలి.

కనీస మద్దతు ధరలకు అనుకూల వాదనల సారం ఇలా ఉంది. రైతులకు ధరల మీద ఒక చట్టబద్ధత ఉంటుంది. మార్కెట్ వడిదుడుకుల నుంచి రక్షణ ఉంటుంది. మధ్యవర్తుల దోపిడీ నిరోధంగా ఉంటుంది. ఉత్పత్తి ఖర్చులను భరించేందుకు, ఆర్థిక పరమైన భద్రతను మెరుగు పరచుకొనేందుకు, స్థిరమైన రాబడికి వీలు కలిగిస్తుంది. వ్యవసాయ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహిస్తుంది. ఉత్పాదకత, సామర్థ్యాలను పెంచుతుంది. ఆహార భద్రత, కొరతలను తీరుస్తుంది. దారిద్ర్య తగ్గింపుకు తోడ్పడుతుంది. రైతాంగ జీవనాన్ని మెరుగు పరుస్తుంది. మార్కెట్ వడిదుడుకులను తగ్గిస్తుంది. ★

కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని 2012 లోనే సిఎంగా ఉండగా నరేంద్ర మోడీ కమిటీ నాటి కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. దీని గురించి తాజా పార్లమెంటరీ కమిటీ కూడా సిఫార్సు చేసినా మోడీ మొరాయిస్తున్నారు. పార్లమెంటరీ కమిటీ సిఫార్సును అమలు చేయాలంటూ కేంద్రానికి సూచించాలని రైతు సంఘాల నేతలు సుప్రీం కోర్టును కోరారు. వ్యవసాయ గ్రాంట్లపై ఏర్పాటైన కమిటీ 2024-25 నివేదికను గతేడాది డిసెంబరు 20న పార్లమెంటుకు సమర్పించింది. దీన్ని కేంద్రం ఆమోదిస్తే అమలుకు ఉపక్రమించాలి. తిరస్కరిస్తే కారణాన్ని చెప్పాల్సి ఉంటుంది.

మణిపూర్‌ను హత్యాక్షేత్రంగా మారుస్తున్నారు


వ్యాఖ్య

- ఎం. ప్రశాంత్

మణిపూర్ ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ మరో మార్గం లేక ఎట్టకేలకు రాజీనామా చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిత్ షా తమకు విశ్వాసపాత్రుడైన బీరెన్ సింగ్‌ను అన్ని విధాలుగా రక్షించడానికి శాయశక్తులా ప్రయత్నించారు. కానీ ఫలితం లేకపోయింది. బిజెపిలో బీరెన్ సింగ్‌పై తిరుగుబాటు పెరగడంతో, కేంద్ర నాయకత్వం మిన్నకుండిపోయింది. బీరెన్ పదవి నుంచి నిష్క్రమించాల్సి వచ్చింది. మణిపూర్‌లో పరిస్థితి జాతి-మత ఘర్షణలతో దిగజారుతున్న తరుణంలో కేంద్ర నాయకత్వం ఆయన రాజీనామాను ఆమోదించి ఉంటే...బహుశా అక్కడ జరిగిన ఊచకోతను నివారించగలిగేది.

కేంద్రంలో 2014లో మొదటిసారిగా మోడీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి, ఈశాన్య ప్రాంతం సంఘ్ పరివార్‌కు ప్రయోగశాలగా మారింది. ఈశాన్య రాష్ట్రాలలో క్రైస్తవుల సంఖ్య ఎక్కువగా ఉండటం ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్ పరివార్‌లకు ఎప్పుడూ నచ్చలేదు. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి కార్యకర్తలను తీసుకురావడం ద్వారా ఈశాన్య ప్రాంతంలో తన ప్రభావాన్ని పెంచుకోవడానికి ఆర్‌ఎస్‌ఎస్ తీవ్రంగా ప్రయత్నించింది. కానీ ఫలించలేదు. అయితే, 2014లో కేంద్రంలో అధికార మార్పు ఈశాన్య ప్రాంతంలో సంఘ్ పరివార్‌కు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించింది. కేంద్ర ప్రభుత్వ మద్దతుతో బిజెపి ఈశాన్య రాష్ట్రాల్లో మెల్లగా అధికారాన్ని చేజిక్కించుకుంది. కాంగ్రెస్‌ను చీల్చడం ద్వారా అరుణాచల్ ప్రదేశ్, త్రిపుర, మణిపూర్‌లలో బిజెపి అధికారంలోకి వచ్చింది.

కాంగ్రెస్ వరుసగా 15 సంవత్సరాలు పాలించిన మణిపూర్‌లో బిజెపి పట్టు సాధించింది బీరెన్ సింగ్ ద్వారానే. ఆయన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు. అంతేగాక మణిపూర్ ముఖ్యమంత్రి ఒక్రామ్ ఇబోబి సింగ్‌కు అత్యంత సన్నిహితుడు. 2016లో, బిజెపి బీరెన్ సింగ్‌ను 'ఆపరేషన్ కమల్'తో ఆకట్టుకుంది. 2017 అసెంబ్లీ ఎన్నికల్లో 28 సీట్లతో కాంగ్రెస్ ఏకైక అతి పెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, కేవలం 21 సీట్లు మాత్రమే ఉన్న బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కాన్రాడ్ సంగ్మా నేతృత్వంలోని నేషనల్ పీపుల్స్ ఫ్రంట్, నాగా పీపుల్స్ ఫ్రంట్ మద్దతుతో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. బీరెన్ సింగ్ ముఖ్యమంత్రి అయ్యారు. ఫుట్‌బాల్ ఆటగాడైన బీరెన్ మణిపూర్ రాష్ట్ర జట్టు సభ్యుడు. ఆ క్రమంలోనే బిఎస్‌ఎఫ్ (బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్)కు ఎంపికయ్యాడు. ఫుట్‌బాల్ మైదానంలో వింగ్ బ్యాక్ స్థానంలో ఆడిన ఆయన, రాజకీయాల్లో స్ట్రైకర్ పాత్రకు మారాడు.



బిజెపికి పూర్తి మెజారిటీ లేకపోవడంతో అప్పటి బీరెన్ సింగ్ ప్రభుత్వ పాలన ప్రశాంతంగా జరిగింది. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో, బిజెపి 32 సీట్లు గెలుచుకుని సంపూర్ణ మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. 'ఆపరేషన్ ఆకర్ష్' ద్వారా వచ్చిన ఐదుగురు ఎమ్మెల్యేలతో, 60 మంది సభ్యులున్న అసెంబ్లీలో బిజెపి బలం 37కి పెరిగింది. దీనితో, పాలనా శైలి కూడా మారిపోయింది. ఆర్‌ఎస్‌ఎస్ నమూనాతో పనిచేసే అరంబై తెంకోల్, మెయితీ లీపున్ వంటి సంస్థలు సంఘ్ పరివార్ సహాయంతో క్రియాశీలకంగా మారాయి. కుకీ వ్యతిరేక భావన ఈ సంస్థల పునాదిగా వుంది. ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ ఈ తీవ్రవాద సంస్థలను నేరుగా ప్రోత్సహించారు. బీరెన్ ప్రభుత్వం కుకీలను తరిమికొట్టడంతో పాటుగా, అనేక అణచివేత చర్యలకు పాల్పడింది.

బిజెపికి పూర్తి మెజారిటీ లేకపోవడంతో అప్పటి బీరెన్ సింగ్ ప్రభుత్వ పాలన ప్రశాంతంగా జరిగింది. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో, బిజెపి 32 సీట్లు గెలుచుకుని సంపూర్ణ మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. 'ఆపరేషన్ ఆకర్ష్' ద్వారా వచ్చిన ఐదుగురు ఎమ్మెల్యేలతో, 60 మంది సభ్యులున్న అసెంబ్లీలో బిజెపి బలం 37కి పెరిగింది. దీనితో, పాలనా శైలి కూడా మారిపోయింది. కేవలం 33 లక్షల మంది జనాభా కలిగిన చిన్న రాష్ట్రమైన మణిపూర్‌లో, మెయితీలు 53 శాతంగా ఆధిపత్య సమూహంగా ఉన్నారు. నాగాలు 20 శాతం, కుకీలు 16 శాతం ఉన్నారు. పంగల్, కోమ్ వంటి చిన్న సమూహాలు కూడా ఉన్నాయి. మెయితీలలో కేవలం 10 శాతం మంది మాత్రమే క్రైస్తవులు కాగా, కుకి-నాగా సమాజంలో ఎక్కువ మంది క్రైస్తవులు వున్నారు. 1864 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో ఇంఫాల్ లోయ, దాని చుట్టూ కొండలతో మణిపూర్ ప్రకృతి దృశ్యం ఆకట్టుకుంటుంది. మెయితీలు పూర్తిగా లోయలలోను, కుకీలు, నాగాలు ఎక్కువగా కొండలలోనూ నివసిస్తారు.

విద్వేష రాజకీయం

సంఘ్ పరివార్ క్రైస్తవ కుకీల పట్ల మెయితీలలో విద్వేషాన్ని రగిలించడం ద్వారా చీలిక రాజకీయాలకు పాల్పడుతోంది. బిజెపికి పూర్తి మెజారిటీ రావడంతో, విద్వేష రాజకీయాలు తీవ్రమయ్యాయి. ఆర్‌ఎస్‌ఎస్ నమూనాతో పనిచేసే అరంబై తెంకోల్, మెయితీ లీపున్ వంటి సంస్థలు సంఘ్ పరివార్ సహాయంతో క్రియాశీలకంగా మారాయి. కుకీ వ్యతిరేక భావన ఈ సంస్థల పునాదిగా వుంది. ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ ఈ తీవ్రవాద సంస్థలను నేరుగా ప్రోత్సహించారు. బీరెన్ ప్రభుత్వం కుకీలను తరిమికొట్టడంతో పాటుగా, అనేక అణచివేత చర్యలకు పాల్పడింది. ఇది పెద్ద ఎత్తున నిరసనలకు దారితీసింది. మెయితీ తెగకు షెడ్యూల్డ్ తెగ హోదా కల్పించడాన్ని పరిశీలించాలన్న హైకోర్టు ఆదేశం మెయితీ-కుకీల మధ్య విద్వేషాలను రగిల్చింది.

రెండు జాతుల మధ్య 2023 మే 3న ఘర్షణ ప్రారంభమైంది. తిరుగుబాటును ముందుగానే ప్లాన్ చేసుకున్న అరంబై తెంకోల్-మెయితీ లీపున్ సంస్థలు... లోయ లోని, కొండల మీది క్రైస్తవ చర్చిలు, పాఠశాలలు మొదలైన వాటిపై విచక్షణా రహితంగా దాడి చేశాయి. లోయలో క్రైస్తవులను వేటాడారు. కుకీలు కూడా ఆయుధాలు చేపట్టడంతో మణిపూర్‌లో పరిస్థితి యుద్ధ వాతావరణాన్ని తలపించింది. మెయితీ-కుకి ప్రాంతాలు రెండు శత్రు రాజ్యాల మాదిరిగా విడిపోయాయి. మెయితీ తీవ్రవాద సంస్థలకు బహిరంగంగా మద్దతు ప్రకటించిన బీరెన్ సింగ్‌ను తొలగించాలని ప్రతిపక్ష పార్టీలు సమిష్టిగా డిమాండ్ చేసినప్పటికీ...మోడీ, అమిత్ షా చెవికెక్కించుకోలేదు. నెలల తరబడి జరిగిన అల్లర్లలో దాదాపు 300 మంది మరణించారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ఆస్తులను కోల్పోయారు. మహిళలపై అత్యాచారాలు జరిగాయి.

లోక్‌సభ ఎన్నికలలో రెండు స్థానాల్లోనూ బిజెపిని ఓడించడం ద్వారా మణిపూర్ వాసులు ఒక హెచ్చరిక ఇచ్చారు. అయినప్పటికీ బీరెన్ సింగ్‌ను ప్రధాని నరేంద్ర మోడీ కాపాడుతూనే ఉన్నారు. స్పీకర్ తోక్‌చమ్ సత్యబ్రత సింగ్ సహా 18 మంది బిజెపి ఎమ్మెల్యేలు సింగ్‌ను వ్యతిరేకించారు. ప్రతిపక్షాలు తీసుకొచ్చిన అవిశ్వాస తీర్మానాన్ని ఆమోదిస్తామని స్పీకర్ కేంద్ర నాయకత్వానికి తెలియజేసిన తర్వాత గత్యంతరం లేని పరిస్థితిలో బీరెన్ రాజీనామా కోరారు అమిత్ షా. ఎనిమిదేళ్ల పాలన తర్వాత బీరెన్ సింగ్ రాజీనామా సమయానికి ... సంఘ్ పరివార్ విభజన రాజకీయాల కారణంగా ఏర్పడిన తీవ్ర గాయంతో మణిపూర్ అల్లాడుతోంది.

/ 'దేశాభిమాని' సౌజన్యంతో /

కవిత్వం



కోటి ఆశల కొత్త గాజా!

ఒక తూరుపు విచ్చుకొన్నపుడు
కోటి ఆశల కిరణాలు తడిమినప్పుడు
గాజా మూర్ఛ నుండి లేచింది..
దాని ఊపిర్లు, తిరుగుతున్న భూగోళం
చుట్టూ చక్కర్లు కొట్టి వచ్చేశాయ్
గుండెలపై, నిరుడు పారేసుకొన్న
నవ్వులు ఏరుకొంటూ పసి పాదముద్రలు
పరుగులు పెడుతుంటే కొత్తగా పుట్టాననుకొంది
జాత్యహంకార శరాఘాతానికి మూర్ఛిల్లి లేచి
కాళ్ళు చేతులు విదిలించుకొంటూంటే..
దరిమిలా, అలాగే చచ్చినట్టు పడుండమని
సామ్రాజ్యవాద హూంకరింపొకటి!
గాజా గుండెల్లో గిజిగాడి గూళ్ళు అల్లుకొన్న
పాత బంధాలు
కూలిపోయిన బతుకులకు మిగిలిపోయిన
కొత్త ఆశలు ప్రోది చేసుకొంటుంటే..
అంత బ్రతికున్నాక శవంలా ఎలా
ఉండగలుగుతుంది!
సరిహద్దుల వద్ద కొత్తదార్లకు కొన్ని వేడుకోళ్ళు
పాతుకొంటుంటే
పగిలిన గాజా గాజు గుండె ముక్కల్లో
పాత ఉదయాల కోసం కోటి ఆకాంక్షలు
వెతుక్కొంటూన్న హృదయాలెన్నో..
గాజా! నీది మరో జన్మే! మది నిండా
శాంతి సుమాలే విరబూయాలిప్పుడు!

- భీమవరపు పురుషోత్తమ్,
సెల్ : 9949800253

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @gmail.com

ఉద్యానవనానికి ఊతమిదేనా..?

- రూ.13.03 కోట్లు మంజూరు
- విడుదలైంది రూ.1.89 కోట్లు
- ఏటా 25శాతం అభివృద్ధి సాధ్యమా?



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన నిధులు రూ.13.03 కోట్లు. ప్రధానంగా మూడు పథకాల కింద ఉద్యానవన శాఖ నిధులు కేటాయిస్తారు. ఇందులో సమగ్ర ఉద్యానవన అభివృద్ధి పథకం (ఎంఐడిహెచ్) కింద రూ.10.41 కోట్లు కేటాయించారు. ఇందులో ఇప్పటి వరకు ఖర్చు చేసింది రూ.1.51 కోట్లు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కెవిఐ) కింద కేటాయించింది రూ.1.58 కోట్లు అయితే ఖర్చు చేసింది సున్నా కావడం గమనార్హం. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ఆయిల్‌పామ్, బాంబూ మిషన్‌కు రూ.1.03 కోట్లు కేటాయించగా ఖర్చు చేసింది రూ.37.81 లక్షలు. ఈ మూడు పథకాలకు కలిపి అనంతపురం జిల్లాకు ఈ ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన నిధులు రూ.13.03 కోట్లు, ఇందులో ఇప్పటి వరకు ఖర్చు పెట్టిన నిధులు చూస్తే రూ.1.89 కోట్లు మాత్రమే. కేటాయించిన దాంట్లో ఇప్పటి వరకు ఖర్చు చేసిన నిధులు కేవలం 5.5 శాతం నిధులు మాత్రమే కావడం గమనార్హం. మరో మాసంతో ఈ ఆర్థిక సంవత్సరమే ముగియనుంది. ఒక్క నెలలోపు తక్కిన నిధులు కేటాయించడం, వినియోగించడం ఏ మేరకు సాధ్యమన్నది చూడాల్సి ఉంది.

డ్రిప్‌ది అదే పరిస్థితి

ఉద్యానవన పంటల అభివృద్ధిలో డ్రిప్ కీలకమైంది. ఇదైనా లక్ష్యానికి అనుగుణంగా నడుస్తోందా అంటే అదీ లేకుండా ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 37,500 హెక్టార్లకు అనుమతి వచ్చింది. దీని కోసం ఇప్పటి వరకు 39,170 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. దీని విస్తీర్ణంలో చూసినప్పుడు 52,736 హెక్టార్లలో డ్రిప్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఆమోదం తెలిపిన వరకే చూస్తే 20,530 రైతులకు సంబంధించి 24,980 హెక్టార్లకు ఇచ్చారు. ఇప్పటి వరకు మంజూరైనవి చూస్తే 9392 హెక్టార్లకే ఉంది. ఇంకా పెద్దఎత్తున జరగాల్సి ఉంది.

25 శాతం వృద్ధి సాధ్యమేనా ?

అనంతపురం జిల్లాలో ఏటా 25 శాతం ఉద్యానవన పరిధిలో అభివృద్ధి సాధిస్తామని ఇటీవల అనంతపురం నగరంలో నిర్వహించిన హార్టికల్చర్ కాంక్లేవ్‌లో జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ప్రకటించారు. ఇప్పుడు ఏటా వస్తున్న దిగుబడులు 25 లక్షల టన్నులను 29 లక్షల టన్నుల దిగుబడి తీసుకెళతామని ప్రకటించారు. రైతుకు ఊతమందకుండా 25 శాతం వృద్ధి ఎలా సాధ్యమని రైతు సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. ప్రధానంగా మార్కెటింగ్ సౌకర్యం లేకుండా విస్తరణ ఎలా సాధ్యమని అడుగుతున్నారు.

మార్కెటింగ్ మౌలిక సదుపాయాల కల్పనకు ఈ ఏడాది జిల్లాకు కేటాయించిన రూ.1.42 కోట్లలో ఒక్క రూపాయి నిధులు కూడా ప్రభుత్వం మంజూరు చేయలేదు. ఇప్పటికే ఉద్యానవన పంటలను పండించిన రైతులు పంటను అమ్ముకోలేని పరిస్థితులున్నాయి. తాజాగా మిరప రైతు ధరలేక గగ్గోలు పెడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యావన పంటలను ప్రోత్సహిస్తామన్న దానిలో వాస్తవికత ఎంతన్న ప్రశ్నలు రైతుల నుంచి ఉత్పన్నమవుతున్నాయి.

కర్నూలులో హైకోర్టు బెంచ్ వద్దంటూ పిల్

ప్రజాశక్తి-అమరావతి

కర్నూలులో హైకోర్టు శాశ్వత బెంచ్ ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిల్ విచారణ వచ్చే వారానికి వాయిదా పడింది. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును అధ్యయనం కోసం వాయిదా వేస్తున్నట్లు చీఫ్ జస్టిస ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ప్రకటించింది. కర్నూలులో హైకోర్టు పర్మినెంట్ బెంచ్ ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని లాయర్లు తాండవ యోగేష్, తురగ సాయి సూర్య వేసిన పిల్స్‌లో రాజధాని అమరావతి కాబట్టి బెంచ్ అవసరం లేదని పేర్కొన్నారు.

అవినీతి ఆరోపణలపై గుట్టుగా విచారణ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం వాణిజ్య పనుల శాఖ కార్యాలయంలో భారీ అవినీతి జరిగిందన్న ఆరోపణలపై జెసి ఆదేశాల మేరకు బుధవారం నిర్వహించిన విచారణ గుట్టుచప్పుడు కాకుండా నిర్వహించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న కృష్ణవేణి భారీగా అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. ఈనేపథ్యంలో కొంతమంది డీలర్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ సూచనల మేరకు వాణిజ్య పన్నుల శాఖ సంయుక్త కమిషనర్ శేషాద్రి విచారణ అధికారిగా డిప్యూటీ కమిషనర్ మురళి మనోహర్ ను నియమించారు. దీంతో ఆయన బుధవారం విచారణ నిమిత్తం హిందూపురం వచ్చారు. అయితే ఈ విషయాన్ని స్థానిక వాణిజ్య పన్నుల శాఖ అధికారులు బయటకు రాకుండా జాగ్రత్త పడ్డారు. సమాచారం తెలియడంతో మీడియా ప్రతినిధులు కార్యాలయానికి వెళ్లి అసిస్టెంట్ కమిషనర్‌ను కలిసి విచారణ అధికారి వివరాలు ఇవ్వాలని కోరారు.

అయితే ఆయన రాలేదని తెలిపారు. కాని విచారణ అధికారి ఉదయం నుంచి ఫిర్యాదులు చేసిన వారిని రహస్యంగా కలిసినట్లు తెలిసింది. మధ్యాహ్నం విచారణ అధికారి కార్యాలయనికి వచ్చిన విషయం తెలుసుకున్న మీడియా ప్రతినిధులు అయన్ను కలవడానికి కార్యాలయానికి వెళ్లారు. విచారణ అధికారి మురళి మనోహర్ మూడు నిమిషాలు మాట్లాడడానికి రెండు గంటలసేపు సమయం పట్టింది. అధికారులతో రహస్యంగా రెండు గంటలసేపు చర్చించారు. అనంతరం మీడియా ప్రతినిధులను లోపలికి పిలిచారు. కార్యాలయంలో ఎటువంటి అవినీతి జరగలేదని, ఫిర్యాదులు చేసిన డీలర్ల చిరునామాకు వెళ్లి పరిశీలిస్తే అక్కడ వారు ఎవరూ లేరని, నిరాధారణ ఆరోపణలని కొట్టి పారేశారు. అయినప్పటికీ కార్యాలయంలో ఉన్న అధికారులను ఒక్కొక్కరిగా విచారణ చేస్తున్నామని, మరి కొంతమందిని అనంతపురం పిలిపించి విచారణ చేస్తామని తెలిపారు. అయితే ఎటువంటి అవినీతి జరగకపోతే గంటల తరబడి రహస్యంగా అధికారులను విచారణ చేయాల్సిన అవసరం ఏముందన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. అవినీతిని కప్పిపుచ్చడానికి విచారణ అధికారి ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- ఒకరు అరెస్టు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు అటవీశాఖ సంచార దళ నిఘా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన దాడిలో కారుతో సహా ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని, నిందితుల్లో ఒకరిని అరెస్టు చేసినట్లు డిఎఫ్ఒ గురు ప్రభాకర్ తెలిపారు. తమకు అందిన రహస్య సమాచారం మేరకు తాను తమ సిబ్బందితో కలిసి బుధవారం ఉదయం పీలేరు-చిత్తూరు మార్గంలోని ఎంజెఆర్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించామన్నారు. ఆ సమయంలో పీలేరు వైపు నుంచి ఓ కారు వేగంగా ముందుకు దూసుకువెళ్లిందని చెప్పారు. అప్రమత్తమైన తమ సిబ్బంది ఆ కారును వెంబడించి చిత్తూరు జిల్లా, పులిచెర్ల మండలం, అశోక్ నగర్ సమీపంలో పట్టుకునే ప్రయత్నం చేశామన్నారు. ఆ సమయంలో కారులోని ఐదుగురిలో నలుగురు పారిపోగా వెంగటేశన్ పప్పుగన్ (41) అనే తమిళనాడుకు చెందిన ఒక వ్యక్తి పట్టుబడ్డాడని తెలిపారు. స్వాధీనం చేసుకున్న వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 301 కేజీ బరువుగల తొమ్మిది ఎర్రచందనం దుంగలు గుర్తించామన్నారు. కారుతో సహా ఎర్రచందనం దుంగల విలువ సుమారు రూ.15 లక్షలు ఉంటుందని అంచనా వేశామని చెప్పారు. కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

ఎంపిడిఒ కార్యాలయం.. వరాహాల విహార కేంద్రం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి (తిరుపతి)

తొట్టంబేడు మండల పరిషత్ కార్యాలయం వరాహాలకు విహార కేంద్రంగా మారింది. పట్టించుకునే నాథుడు లేకపోవడంతో వరాహాలు అక్కడ స్వైర విహారం చేస్తున్నాయి. ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలోనే వెలుగు, ఉపాధి హామీ, ఐసిడిఎస్, ఫారెస్ట్, వ్యవసాయ, విద్య, పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖా కార్యాలయాలు ఉన్నాయి. అయితే వరాహాల సమూహం ఎప్పుడు పడితే అప్పుడు, కార్యాలయాల పనివేళల్లో సైతం అతిథుల్లా విహరిస్తుండడంతో సిబ్బంది, పలు సమస్యలపై వచ్చే అర్జీదారులు ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా వరాహాలను ప్రజా ఆరోగ్య భద్రతా చట్టం కింద పట్టణ, మండల కేంద్రాలకు కనీసం 10 కిలోమీటర్ల అవతల ఉంచాలన్న నిబంధన ఉంది. అయితే అవేమి అధికారులు పట్టించుకోకపోవడంతో వరాహాలు ప్రభుత్వ కార్యాలయాలను విడిది కేంద్రాలుగా వినియోగించుకుంటున్నాయన్న విమర్శలు వస్తున్నాయి.

'బళ్లారి-గుండ్లపల్లి'ని జాతీయ రహదారిగా మార్చండి

- కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ కార్యదర్శికి ఎంపిలు, విప్ వినతి

ప్రజాశక్తి-రాయదుర్గం

బళ్లారి-ఎన్.గుండ్లపల్లి ప్రధాన రోడ్డును జాతీయ రహదారిగా గుర్తిస్తూ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం ఎంపిలు అంబికా లక్ష్మినారాయణ, బికె.పార్థసారథి, రాష్ట్ర ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఢిల్లీలోని కేంద్ర రవాణా శాఖ కార్యాలయంలో కేంద్ర రవాణా మంత్రిత్వశాఖ కార్యదర్శి ఉమాశంకర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాలను కలిపే 52 కిలోమీటర్ల పొడవైన ఈ అంతర్రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా గుర్తిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని విన్నవించారు. అలాగే 150-ఎ జాతీయ రహదారిపై డి.హీరేహాల్‌లో బ్రిడ్జి నిర్మాణంపై స్థానికులు అభ్యంతరం చెపుతున్నారని ప్రజల వినతి మేరకు బాక్స్ బ్రిడ్జి బదులు ఫ్లై ఓవర్ నిర్మించేలా డిజైన్‌లో మార్పు చేయాలని కోరారు. రెండు సమస్యలకు త్వరలో తప్పక పరిష్కారం లభిస్తుందని కాలవ శ్రీనివాసులు ఆశాభావం వ్యక్తం చేశారు.

బెరైటీస్ అమ్మకపు పన్ను తగ్గింపుపై వివరాలివ్వండి : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలో బెరైటీస్ తవ్వకాలకు గత నెల 24న వెలువడిన టెండర్ నోటిఫికేషన్‌ను వ్యతిరేకిస్తూ కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ) సెక్రటేరియట్ మెంబర్ గుజ్జుల ఈశ్వరయ్య హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. సిప్లస్‌సి ప్లస్ డబ్ల్యు గ్రేడ్ బెరైటీస్ అమ్మకపు ధర మెట్రిక్ టన్నుకు రూ.1670 ఉంటే, దానిని రూ.1188కి తగ్గించడం వల్ల ప్రభుత్వానికి ఆర్థికంగా నష్టమని పిల్‌లో పేర్కొన్నారు. ఈ పిల్‌లో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. విచారణను 2 వారాలకు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.


దస్తగిరి ఫిర్యాదుపై కేసు కొట్టేయాలని పిల్

ప్రజాశక్తి-అమరావతి

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన షేక్ దస్తగిరి చేసిన ఫిర్యాదు మేరకు రిమ్స్ పోలీసులు ఈ నెల 3న నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ దేవిరెడ్డి చైతన్యరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. దస్తగిరి కడప కేంద్ర కారాగారంలో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నప్పుడు తాను జైలుకెళ్లి మరీ అతన్ని బెదిరించానని చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. 2023 నవంబర్లో ఘటన జరిగిందని చెప్పి 2025 ఫిబ్రవరిలో ఫిర్యాదు చేయడం వెనుక రాజకీయ కుట్ర ఉందన్నారు.

సిఎం ఇతర ప్రముఖులపై కేసుల్ని సిబిఐకి ఇవ్వాలని పిల్

సిఎం చంద్రబాబు, పలువురు మంత్రులు, ఇతర పెద్దలపై కేసులను సిబిఐ, ఇడికి బదిలీ చేయాలంటూ దాఖలైన పిల్ విచారణ 2 వారాలకు వాయిదా పడింది. చంద్రబాబు, మంత్రులు నారా లోకేష్, పొంగూరు నారాయణ, కింజరాపు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు వ్యాపారవేత్తలు లింగమనేని రమేష్, వేమూరు హరికృష్ణ ప్రసాద్ ఇతరులు, పలు కంపెనీలపై ఉన్న కేసులను సిబిఐ, ఇడికి అప్పగించేలా ఆదేశాలివ్వాలని కొట్టి బాలగంగాధర తిలక్ పిల్ దాఖలు చేశారు.



పుతిన్‌తో ట్రంప్ హలో..హలో

- ఉక్రెయిన్‌తో యుద్ధంతో పాటు పలు అంశాలపై చర్చ
- 'ట్రూత్ సోషల్'లో అమెరికా అధ్యక్షుడు వెల్లడి

వాషింగ్టన్ : రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో తాను ఫోన్‌లో మాట్లాడినట్టు అమెరికా ప్రెసిడెంట్ డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధానికి ముగింపు పలికే లక్ష్యంతో తక్షణమే చర్చలను ప్రారంభించాలని తన జాతీయ భద్రతా బృంద సభ్యులను ఆదేశించినట్టు చెప్పారు. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత ట్రంప్, పుతిన్‌ల మధ్య సంభాషణ జరగటం ఇదే తొలిసారి కావటం గమనార్హం. 14 ఏండ్లుగా జైలుశిక్షను అనుభవించిన పెన్సిల్వేనియా స్కూల్ టీచర్ మ్యార్క్ ఫొగెల్‌ను రష్యా విడుదల చేసిన ఒకరోజు తర్వాత ఈ పరిణామం చోటు చేసుకోవటం గమనార్హం. పుతిన్‌తో సుదీర్ఘమైన, అత్యంత ఉత్పాదకమైన ఫోన్ కాల్ చేసినట్టు ట్రంప్.. ట్రూత్ సోషల్‌లో రాసుకొచ్చారు. ఉక్రెయిన్, మిడిల్ ఈస్ట్, ఇంధనం, కృత్రిమ మేధస్సు, డాలర్ శక్తి, అనేక ఇతర విషయాలను చర్చించినట్టు వివరించారు. కలిసి పని చేయటం వల్ల ఏదో ఒకరోజు లభించే గొప్ప ప్రయోజనం గురించి తాను, పుతిన్ మాట్లాడుకున్నామని పేర్కొన్నారు. అలాగే, ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధాన్ని ముగించాల్సిన అవసరాన్ని అంగీకరించామని ట్రంప్ వివరించారు. ఉక్రెయిన్‌లో యుద్ధంపై చర్చలు ప్రారంభించాలన్న ప్రతిజ్ఞతో పాటు ఇరువురు ఒకరి దేశాలను ఒకరు సందర్శించనున్నట్టు స్పష్టం చేశారు. యుద్ధం విషయంలో చర్చలకు నాయకత్వం వహించాలని విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో, సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్, జాతీయ భద్రతా సలహాదార మైఖేల్ వాల్ట్జ్, మిడిల్ ఈస్ట్ రాయబారి స్టీవ్ విట్‌కాఫ్‌లను ఆదేశించినట్టు ట్రంప్ వివరించారు. పుతిన్‌తో సంభాషణ గురించి తెలియజేయటానికి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీకి కూడా ఫోన్ చేస్తానని ట్రంప్ పేర్కొన్నారు.

బర్డ్‌ఫ్లూతో పౌల్ట్రీ పల్టీ..!



- పడిపోయిన చికెన్, గుడ్ల అమ్మకాలు
- స్తంభించిన ఎగుమతులు
- ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష కుటుంబాలకు ఉపాధి సమస్య
- అధికారుల ప్రకటనలు సరికాదంటున్న రైతులు

ప్రజాశక్తి - తణుకు రూరల్ (పశ్చిమగోదావరి జిల్లా)

బర్డ్‌ఫ్లూ.. పౌల్ట్రీ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టేసింది. ఇప్పటికే కొన్ని రోజులుగా కోళ్ల మృతి చెందుతుండడంతో పౌల్ట్రీ రైతులు ఆర్థికంగా సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బర్డ్ ఫ్లూ వార్తలు, చికెన్, గుడ్లు వాడకంపై నిషేధం గోరు చుట్టుపై రోకలిపోటులా మారిందని రైతులు లబోదిబోమంటున్నారు. తణుకు పరిసర ప్రాంతాలతోపాటు పశ్చిమగోదావరి, అటు ఏలూరు జిల్లాల్లో చికెన్, గుడ్ల అమ్మకం గణనీయంగా పడిపోయింది. వాస్తవంగా కృష్ణానంద పౌల్ట్రీ ఫారానికి కిలోమీటర్ వరకూ రెడ్‌జోన్‌గా, 10 కిలోమీటర్ల పరిధి వరకూ సర్వేలైన్స్ జోన్‌గా ప్రకటించారు. ఆ పరిధిలో చికెన్ షాపులు మూసివేయడంతోపాటు గ్రామాల్లో ఆయా పంచాయతీలు పెద్దఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నాయి. తణుకు నియోజకవర్గంలో తణుకు రూరల్, ఇరగవరం, అత్తిలి మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల్లో మొత్తం 50 వరకూ పౌల్ట్రీ ఫారాలు ఉన్నాయి. వీటిలో ఒక్కో ఫారంలో సామర్థ్యాన్ని బట్టి పది వేల నుంచి లక్ష వరకూ కోళ్లను పౌల్ట్రీ రైతులు పెంచుతున్నారు. పది వేల సామర్థ్యం కలిగిన కోళ్ల ఫారానికి మేత, మందులు, కూలీల జీతాలు అన్నీ కలిపి రోజుకు రూ.35 వేల వరకూ ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. రోజుకు 1.32 టన్నుల మేత ఖర్చవుతుందని, ఒక టన్ను ధర రూ.30 వేల నుంచి రూ.32 వేల ధర పలుకుతోంది. మేత కింద మొక్కజొన్న, నూకలు, సోయా కేకులు, డిఒబి, సన్‌ఫ్లవర్, ఎండు చేప కలిపి కోళ్లకు మేతల కింద ఇస్తారు. ఈ మేతపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐదు శాతం జిఎస్‌టి విధిస్తోంది. మేతలే కాకుండా మొదటి రోజు పిల్ల దశ నుంచి 25 వారాల వరకూ క్రమం తప్పకుండా నిర్ణీత కాలవ్యవధిలో వ్యాక్సిన్లు వేయాల్సి ఉంటుంది. 22వ వారం నుంచి కోడిగుడ్లు పెట్టడం మొదలవుతుంది. అప్పటి వరకూ ఒక్కో కోడిపై రూ.360 ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. ఒక్క గుడ్డు ఉత్పత్తికి రైతుకు రూ.4.31 మేత, కోడి నిర్వహణకు ఖర్చవుతుంది. రోజురోజుకీ పెరుగుతున్న ఖర్చులతో సతమతమవుతున్న పౌల్ట్రీ రైతులు ఇప్పటికే లక్షల్లో కోళ్లు మృత్యువాత పడి తల్లడిల్లుతున్నారు. దీనికి కారణం తాజాగా బర్డ్ ఫ్లూ అని నిర్ధారణ కావడంతో మూడు నెలలు కోళ్ల ఫారాలు మూసివేయాలని ఆ పరిధిలో అధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో చికెన్, గుడ్లు వినియోగించరాదనే ప్రచారం పౌల్ట్రీ రైతుల పరిస్థితిని మరింత దిగజార్చింది. పౌల్ట్రీ పరిశ్రమపై ప్రత్యక్షంగా, పరోక్షంగా కొన్ని లక్షల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. ఒక్కో పౌల్ట్రీ ఫారంలో రెండు నుంచి నాలుగు కుటుంబాల వరకూ వలస కూలీల కుటుంబాలు జీవనం సాగిస్తుంటాయి. ఇక తణుకు పరిసరాల్లో 11 వరకూ ఎగ్ ట్రేడింగ్ సెంటర్లు ఉన్నాయి. ఆయా పౌల్ట్రీ ఫారాల్లో సేకరించిన గుడ్లను పశ్చిమబెంగాల్, అస్సాం, ఒడిశా, జార్ఖండ్ వంటి రాష్ట్రాలు ఇక్కడ నుంచే ఎగుమతి చేసుకుంటున్నాయి. ఒక్కో లారీలో 1.50 లక్షల గుడ్లు చొప్పున 20 లారీల లోడులు ఇతర రాష్ట్రాలకు ప్రతిరోజూ ఎగుమతి అవుతున్నాయి. ఇలా గుడ్లు సేకరించేందుకు వెళ్లే ఒక్కో లారీపై ఆరుగురు కూలీల చొప్పున పని చేస్తుంటారు. ప్రస్తుతం తలెత్తిన పరిస్థితుల్లో పౌల్ట్రీ పరిశ్రమ ఉత్పత్తి నిలిచిపోయి నష్టాల్లోకి వెళ్తే లక్షలాది మంది కూలీలు రోడ్డున పడే ప్రమాదం ఉంది.

అధికారుల ప్రకటనపై పౌల్ట్రీ రైతుల అసంతృప్తి

బర్డ్ ఫ్లూ, ఆపై చికెన్, గుడ్లు వాడకంపై అధికారులు చేసిన ప్రకటనపై పౌల్ట్రీ రైతుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది.

ఇదిలా ఉండగా ఈ బర్డ్స్ అనేది ఎవిఎన్ ఇన్ఫ్లుఎంజా వైరస్ ప్రభావం పక్షులపై, కోళ్లపై తీవ్రంగా ఉంటుందని, కోళ్ల ఫారాల్లో పనిచేసే వ్యక్తులు తగిన జాగ్రత్తలు పాటిస్తూ మాస్కులు ధరించాలని సూచిస్తున్నారు. మాంసం వినియోగం తగ్గించి, ఉడకబెట్టిన గుడ్లు వినియోగించడంలో ఎటువంటి ఇబ్బందీ ఉండదని చెబుతున్నారు. ఈ వైరస్ బారిన పడిన మనుషుల్లో జ్వరం, గొంతునొప్పి, తలనొప్పి లక్షణాలు ఉంటాయని, ఈ వైరస్ ప్రభావం మరింత ఎక్కువ ఉంటే తీవ్రమైన దగ్గు ఆయాసం వస్తుందంటున్నారు. ఈ వైరస్ ప్రభావం తీవ్రమైతే నిమోనియా వంటి లక్షణాలు కన్పిస్తాయని, ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ చేరుతుందని చెబుతున్నారు. లక్షణాల తీవ్రతను బట్టి టానిఫ్లూ-75 ఎంజి ఇవ్వాల్సి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

అపోహల ప్రచారం సరికాదు..

ప్రపంచ ఆరోగ్య సంస్థ గైడ్‌లైన్స్ ప్రకారం బర్డ్ ఫ్లూ ఇక్కడ మనుషులకు వ్యాపిస్తుందని అపోహ పడడం సరికాదు. బర్డ్ ఫ్లూ నియంత్రణకు చర్యలు తీసుకోవాలి తప్ప కోడిమాంసం, గుడ్లు వినియోగించొద్దని ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం తగదు. ఈ వైరస్ 50 డిగ్రీల ఉష్ణోగ్రత దాటితే చనిపోతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మాంసం, గుడ్లను మనం 150 నుంచి 200 డిగ్రీల ఉష్ణోగ్రత స్థాయిలో ఉడికించిన తర్వాత తీసుకుంటాం. కాబట్టి వైరస్ ప్రభావం ఉండదు. మైనస్ డిగ్రీల్లో ఉండే దేశాల్లో ఇది మనుషులకు వ్యాపిస్తుంది. ఎపిలో ఉండే ఉష్ణోగ్రతలు కోడి మనుగడకు అనువైనవి. కోడిలో రోగనిరోధక శక్తి పెరిగేందుకు తగిన మందులు ఇవ్వడం ద్వారా వైరస్ ప్రభావం పెద్దగా ఉండదు.

పెన్మెత్స సుబ్బరాజు, పౌల్ట్రీ రైతు, కావలిపురం, ఇరగవరం మండలం

బర్డ్ ఫ్లూ పట్ల ఆందోళన అక్కర్లేదు

బర్డ్ ఫ్లూ వ్యాపిస్తున్న నేపథ్యంలో ప్రజలు ఎటువంటి భయాందోళనకూ గురికావాల్సిన అవసరం లేదు. కోడి గుడ్లు, కోడి మాంసం వినియోగంపై జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదు. పూర్తిగా ఉడికించిన ఆహారం తీసుకోవడం వల్ల వైరస్ ప్రభావం ఉండదు. 50 డిగ్రీలు దాటితే వైరస్ చనిపోతుంది. అటువంటిది 100 నుంచి 150 డిగ్రీల వరకూ ఉడికించి తినడం వల్ల ఎటువంటి ఇబ్బందీ ఉండదు. ఇది ఒక ఫారం నుంచి మరో ఫారానికి వ్యాపించి నష్టాలు పెరగకుండా ఉండడం కోసమే నియంత్రణ చర్యలు చేపట్టాం.

కె.శంకరం, పశు సంవర్ధక శాఖాధికారి

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి హత్య కేసు దర్యాప్తు ముమ్మరం

- అనుమానితులను విచారిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-తెర్లాం (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా తెర్లాం మండలంలోని నెమలాం గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కోనారి ప్రసాద్ హత్య ఘటనపై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేపట్టారు. సిఐ నారాయణరావు ఆధ్వర్యాన ప్రత్యేక పోలీసు బృందాలు పలు కోణాల్లో సమాచారాన్ని సేకరిస్తున్నారు. నెమలాం-బూరి పేట గ్రామాలకు సంబంధించి అనుమానితులను పిలిపించి విచారిస్తున్నారు. హత్యకు గురైన ప్రసాద్ కుటుంబంతో ఎవరికైనా తగాదాలు ఉన్నాయా, ఇంకేమైనా కారణాలు ఉన్నాయా? అనే కోణంలోనూ పరిశీలిస్తున్నట్లు సిఐ తెలిపారు. ప్రసాద్‌కు ఇంకా పెళ్లికాకపోవడంతో ఎవరితోనైనా ప్రేమ వ్యవహారాలు, అక్రమ సంబంధాలు ఉన్నాయా అనే కోణాన్ని కూడా పరిశీలిస్తున్నారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని సిఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి బేబినాయన పరామర్శ

కోనారి ప్రసాద్ కుటుంబాన్ని బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన బుధవారం పరామర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి భయంకరమైన సంఘటనలు జరగడం చాలా దురదృష్టకరమని అన్నారు. నిందితులు ఎంతటి వారైనాప్పటికీ తక్షణమే కేసును ఛేదించి బాధిత కుటుంబానికి తగు న్యాయం జరిగించేలా చూడాలని కోరారు. ఎమ్మెల్యేతో పాటు మండల పార్టీ అధ్యక్షులు ఎన్.వెంకట్ నాయుడు, ఎన్.వెంకటేశ్వరరావు, పలువురు సర్పంచులు పాల్గొన్నారు.

14న 'ఘంటశాల ది గ్రేట్' విడుదల

- చిత్ర దర్శకుడు రామారావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఈ నెల 14వ తేదీన విడుదల కానున్న 'ఘంటశాల ది గ్రేట్' చిత్రాన్ని ఆదరించాలని ఆ చిత్ర నిర్మాత, దర్శకుడు సిహెచ్.రామారావు కోరారు. ఈ నెల 14న శ్రీకాకుళం నగరంలోని మారుతీ థియేటర్‌లో విడుదల చేసే ఈ సినిమాను ఆ రోజు ఒక టిక్కెట్‌పై ఇద్దరు చూసేందుకు అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. నగరంలోని ఒక రెస్టారెంట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలుగు పాట ఉన్నంత కాలం ఘంటశాల వెంకటేశ్వరరావు సజీవంగా ఉంటారని... ఆయన కీర్తి, ఖ్యాతి అజరామరమని అన్నారు. ఘంటశాల గురించి నేటి తరానికి తెయజెప్పాలన్న ఆలోచనతోనే ఈ సినిమాను తెరకెక్కించామని తెలిపారు. ఘంటశాల గాయకునిగానే కాకుండా వ్యక్తిత్వం కూడా ఎంతో ఉన్నతమైందని కొనియాడారు. తెలుగు మాటను, పాటను తనదైన స్వరంతో అలరించిన మహానుభావుడు అని అన్నారు. రాష్ట్రంలో ఏ గాయకునిపైనా పూర్తిస్థాయి నిడివి చిత్రం ఇంతవరకు నిర్మించలేదని, ఆ అవకాశం తనకే దక్కిందన్నారు. ఈ చిత్రంలో గాయకుడు కృష్ణచైతన్య, యాంకర్ మృదుల నటన ఎంతగానో ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని తెలిపారు. వారితో పాటు సుమన్, భార్గవి, సాయికిరణ్ వంటి సీనియర్ నటీనటులు పలు పాత్రలను పోషించారన్నారు. తొలుత శ్రీకాకుళంలో సినిమాను విడుదల చేసిన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా జైత్రయాత్ర సాగుతుందన్నారు. ఘంటశాల అభిమానులు, ప్రజలు సినిమాను ఆదరించి, ఆశీర్వదించాలని కోరారు.

రైతులకు భూ ఆధార్

- ప్రతి రైతుకూ విశిష్ట సంఖ్య
- ఆర్‌ఎస్‌కెల ద్వారా మొదలైన జారీ
- ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని ఆదేశం



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

రబీ వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులకు అదనంగా మరో పని వచ్చి పడింది. రైతు సేవా కేంద్రాల (ఆర్‌ఎస్‌కె) చుట్టూ తిరగాల్సిన అవసరం ఏర్పడింది. 'ఫార్మర్ రిజిస్ట్రీ' పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి రైతుకూ విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వాలని నిర్ణయించింది. విశిష్ట సంఖ్యకు అర్హులైన రైతులను గుర్తించి, ప్రభుత్వ సబ్సిడీలు, పంటల బీమా వంటి ప్రయోజనాలు పొందేందుకు భూ ఆధార్ అవసరమని పేర్కొంది. ప్రభుత్వ సూచనలతో జిల్లాలో నమోదు ప్రక్రియను మొదలు పెట్టారు. ఈ నెలాఖరులోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. దీంతో వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రైతు సేవా కేంద్రాల్లో రైతులు తమ పేర్లను నమోదు చేసుకునేలా చూస్తున్నారు.

జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్లలో సుమారు 6.20 లక్షల ఎకరాల్లో పలురకాల వ్యవసాయ పంటలు సాగవుతున్నాయి. వీటితో పాటు జిల్లాలో లక్ష ఎకరాల్లో కొబ్బరి, జీడి, మామిడి తదితర పంటలు సాగవుతున్నాయి. 249 ఎకరాల్లో పట్టు సాగుతోంది. వీరందరికీ తొలుత 14 అంకెలతో ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఇవ్వనున్నారు. తర్వాత భూ ఆధార్ పేరుతో కార్డులను జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతు పేరు నమోదుకు అర్హుడే అని ప్రభుత్వం తెలిపింది. విశిష్ట సంఖ్య పొందేందుకు రైతులు తమ ఆధార్, పట్టాదారు పాస్ పుస్తకం తీసుకుని రైతు సేవా కేంద్రాలకు వెళ్లాల్సి ఉంటుంది. ఇందుకోసం రూపొందించిన ప్రత్యేక పోర్టల్‌లో రైతుల వివరాలను నమోదు చేస్తారు. రైతు ఫోన్ నంబరుకు వచ్చిన ఒటిపి సిబ్బందికి చెప్తే వారు 14 అంకెల సంఖ్యను చెప్తారు.

భూ ఆధార్‌పై అవగాహన

ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి ఈ సంఖ్య అధికారిక గుర్తింపుగా పనిచేస్తుందని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. విశిష్ట సంఖ్య సాయంతో అర్హులైన రైతుల గుర్తింపు, వారికి వర్తించనున్న సబ్సిడీలు, పంటల బీమా వంటి ప్రయోజనాలు పొందేలా చేస్తోందని చెప్తున్నారు. పిఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంట రుణాలు, పంటల బీమా, రాయితీపై సూక్ష్మ పథకాలు, సూక్ష్మ సేద్యంపై రాయితీ వంటి పథకాలను నేరుగా పొందే అవకాశం ఉందని వివరిస్తున్నారు. వీటితోపాటు నీటిపారుదల, తెగుళ్ల నియంత్రణ, వాతావరణ సూచనలు వంటి ఇతర సేవలు అందుకోవడానికి దోహదపడుతుందని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

విశిష్ట సంఖ్య జారీలో అసలు ఉద్దేశం ఇదేనా?

రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, సబ్సిడీలు అనర్హులు పొందుతున్నట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, గతంలో వైసిపి ప్రభుత్వం అందించిన రైతు భరోసా అనర్హులు కూడా పొందినట్లు గుర్తించింది. భూ ఆధార్‌తో వాటిని ఏరివేయాలని భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఫించన్లు, ఇళ్లపై సర్వే చేసి అనర్హులను తొలగిస్తున్న ప్రభుత్వం... భూ ఆధార్‌తో అర్హులెవరు, అనర్హులు ఎవరనేది కూడా పనిలో పనిగా తేలుతుందని భావిస్తున్నట్లుగా తెలుస్తోంది.

రైతులకు తప్పని అవస్థలు

భూ ఆధార్ జారీలో రైతులకు అవస్థలు తప్పేలా లేవు. ప్రస్తుతం రబీ వ్యవసాయ పనులు జోరుగా సాగుతుండడంతో ఆర్‌ఎస్‌కెలకు రావడం, క్యూలో నిల్చొని నమోదు చేయించుకునేందుకు కొంత సమయం కేటాయించాల్సి ఉంటుంది. దీంతోపాటు చాలామంది రైతులు తమ భూములను కౌలుకు ఇచ్చి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోయారు.

ఈ-క్రాప్ బుకింగ్ సమయంలోనూ వారు రాలేకపోయారు. పండిన పంటను వ్యాపారులు, దళారులకు అమ్ముకున్నారు. పెట్టుబడి సాయం, ఇతర సంక్షేమ పథకాల వర్తింపునకు భూ ఆధార్ తప్పనిసరి చేసే అవకాశం ఉండడంతో, వారు సొంతూళ్లకు పయనమవుతున్నారు.

ప్రభుత్వ వ్యయం తగ్గించడం కాదు సైద్ధాంతిక విభేధాలతో జరిపే దాడులు

- ట్రంప్, మస్క్ చర్యలపై బడ్జెట్ నిపుణుల వ్యాఖ్యలు



వాషింగ్టన్ : ప్రభుత్వ సంస్థల వృధా ఖర్చులను తగ్గిస్తామంటూ ఎన్నికల ప్రచారంలో హామీలు గుప్పించిన ట్రంప్ అధికారంలోకి రాగానే ఆ మేరకు చర్యలు తీసుకోవడం మొదలుపెట్టారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ (డిఓజిఇ-డోజ్)ని ఏర్పాటు చేసి దాని బాధ్యతలను టెస్లా అధినేత ఎలాన్ మస్క్‌కు అప్పజెప్పారు. ఇక అక్కడ నుండి ప్రభుత్వ ఉద్యోగాల్లో, సిబ్బందిలో కోతలతో సహా పలు ప్రభుత్వ సంస్థల వ్యయం తగ్గించే పేరుతో మస్క్ చర్యలు తీసుకోవడం ఆరంభించారు. అయితే ఈ చర్యలను నిశితంగా పరిశీలించినట్లైతే, ప్రజలు చెల్లించే పన్ను మొత్తాలు ఆదా చేసేందుకు జరిగే ప్రయత్నాల కన్నా కన్జర్వేటివ్‌లు దీర్ఘకాలంగా ద్వేషిస్తూ వచ్చిన ఫెడరల్ సంస్థలపై సైద్ధాంతిక దాడిగా కనిపిస్తోందని ఇరువురు రిపబ్లికన్ బడ్జెట్ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

బాధ్యతలు చేపట్టిన వెంటనే మస్క్ తన డోజ్ సభ్యులను పంపించి ప్రభుత్వ కంప్యూటర్ వ్యవస్థల్లోని సిబ్బంది వేతన భత్యాల సమాచారాన్ని పరిశీలించాల్సిందిగా కోరారు. ఆ తర్వాత ప్రపంచంలోని అన్నార్తులకు జీవనాడిగా వున్న సంస్థను, రుణ దాతల నుండి అమెరికన్లను రక్షించే మరో సంస్థను రద్దు చేసేశారు. ఇలా ట్రంప్, మస్క్‌లు లక్ష్యంగా పెట్టుకున్న సంస్థల పద్దులను చూసినట్లైతే అవి మొత్తంగా ఫెడరల్ బడ్జెట్‌లో చాలా స్వల్పవాటాను కలిగివున్నాయని ఆ ఇరువురు నిపుణుల్లో ఒకరైన కాంగ్రెస్ బడ్జెట్ ఆఫీస్ (సిబిఓ) మాజీ రిపబ్లికన్ డైరెక్టర్ డగ్లస్ హోల్ట్జ్ ఎకిన్ వ్యాఖ్యానించారు. తమకు నచ్చే రీతిలో వ్యవహరిస్తున్న సంస్థల జోలికి వీరు వెళ్ళడం లేదని, ఎవరైతే తమతో విభేదిస్తున్నారో వారి జోలికే వెళుతున్నారని ఆయన పేర్కొన్నారు.

సెనెట్ బడ్జెట్ కమిటీ 20ఏళ్ళకి పైగా డైరెక్టర్‌గా వ్యవహరించిన బిల్ హోగ్లాండ్ మాట్లాడుతూ, ఇప్పటివరకు రూపొందించిన ఖర్చు తగ్గింపు ప్రయత్నాలన్నీ కూడా సైద్ధాంతిక కారణాలతోనే చేపట్టినట్లు కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. ఆయా సంస్థలతో పనిచేసేటపుడు కన్జర్వేటివ్‌లు ఎదుర్కొనే విభేదాలే ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయని అన్నారు. యుఎస్‌ఎయిడ్, ప్రకృతి వైపరీత్యాలకు స్పందించే ఫెమా (ఫెడరల్ ఎమర్జన్సీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ) వంటి సంస్థలు అమెరికా ప్రయోజనాలకు హానికరంగా పరిణమిస్తున్నాయని రిపబ్లికన్లు దీర్ఘకాలంగా భావిస్తున్నారని అన్నారు.

రాహుల్ గాంధీకి లక్నో కోర్టు సమన్లు

- మార్చి 24న విచారణ

లక్నో : లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి లక్నో కోర్టు సమన్లు జారీ చేసింది. తన భారత్ జోడో యాత్రలో భాగంగా 2022లో ఆర్మీపై చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలపై న్యాయస్థానం ఈ చర్యకు దిగింది. ఈ కేసు తదుపరి విచారణను అడిషనల్ చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేటు అలోక్ వర్మ వచ్చే నెల 24కు నిర్ణయించారు. దీనికి రాహుల్ హాజరు కావాల్సి ఉంటుంది. అంతకముందు బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ మాజీ డైరెక్టర్ ఉదయ్ శంకర్ శ్రీవాస్తవ తరపున లాయర్ వివేక్ తివారీ.. రాహుల్‌పై పరువు నష్టం దావా వేశారు. "భారత్ జోడో యాత్రలో భాగంగా రాహుల్.. డిసెంబర్ 16, 2022న ఈ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. కొందరు మీడియా వ్యక్తులతో మాట్లాడుతూ.. డిసెంబర్ 9న చోటు చేసుకున్న భారత్, చైనా ఆర్మీల మధ్య చోటు చేసుకున్న ఘర్షణ గురించి ఆయన అభ్యంతరకరంగా మాట్లాడారు" అని లాయర్ వివేక్ తివారీ వివరించారు.

మహాకుంభ్ మేళాకు పోటెత్తిన జనం

ప్రయాగ్‌రాజ్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు బుధవారం యాత్రీకులు భారీగా తరలివస్తున్నారు. బుధవారం మాఘ పూర్ణిమ సందర్భంగా రెండు కోట్ల మందికి పైగా స్నానాలు ఆచరించినట్లు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం వెల్లడించింది. ఈ మాఘ పూర్ణిమ స్నానంతో తమ నెల రోజుల కల్పవాసీ దీక్ష ముగించుకొని దాదాపు 10లక్షల మంది మహా కుంభమేళా నుంచి తిరుగు ప్రయాణం కానున్నారు. దీంతో వారంతా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, పార్కింగ్ స్థలాలను మాత్రమే వినియోగించాలని అధికారులు కల్పవాసీలకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు, యాత్రీకులపై హెలికాప్టర్ నుంచి పూల వర్షం కురిపించారు. కాగా, మాజీ క్రికెటర్ అనిల్ కుంబ్లే తన భార్యతో కలిసి త్రివేణి సంగమం వద్ద స్నానం ఆచరించారు. సాధారణ యాత్రకుడిగా పడవపై సంగమం వద్దకు చేరుకొని పూజలు నిర్వహించారు. మరోవైపు, ఫిబ్రవరి 11వ తేదీ వరకు మొత్తంగా 46.25 కోట్ల మంది భక్తులు మహా కుంభ్‌కు విచ్చేసి పుణ్యస్నానాలు ఆచరించినట్లు అధికారులు వెల్లడించారు.

తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనలు

- బంగ్లాదేశ్‌లో నిరసనలపై ఐక్యరాజ్య సమితి నివేదిక వెల్లడి

జెనీవా : గత వేసవి కాలంలో ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేస్తూ సామూహికంగా ప్రదర్శనలు, ధర్నాలు, ఆందోళనలు చేసిన నిరసనకారులపై ఆనాటి ప్రభుత్వం తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడిందని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల చీఫ్ వోల్కర్ టర్క్ బుధవారం చెప్పారు. ఈ మేరకు బంగ్లాదేశ్ మాజీ ప్రభుత్వం, భద్రతా యంత్రాగం వ్యవస్థాగతంగా పాల్పడిన నేరాలను, ఉల్లంఘనలను పేర్కొంటూ నిజ నిర్ధారణ కమిటీ నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా జెనీవాలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. భయాందోళనలు, మూకుమ్మడి అరెస్టుల నేపథ్యంలో ఈ నేరాలన్నీ చోటు చేసుకుని వుండవచ్చున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనకారులను, ఆ ఆందోళనలకు సానుభూతి తెలిపేవారిని హింసాత్మకంగా అణచివేయాలని, దాడులు జరపాలని అధికారిక విధానంగా వుందని, అందుకు బంగ్లాదేశ్ సీనియర్ అధికారులు వెల్లడించిన సాక్ష్యాధారాలు వున్నాయని ఆ నివేదిక పేర్కొంది. ప్రభుత్వ రంగంలో ఉద్యోగాల కోటాకు వ్యతిరేకంగా విద్యార్థుల నేతృత్వంలో మొదలైన ఉద్యమం చాలా త్వరగా దేశవ్యాప్తంగా విస్తరించింది.

ఆదేశాలిచ్చినా లెక్కలేదా?

(మొదటి పేజీ తరువాయి)

ఇతర నేతలను విమర్శించారనే నెపంతో పోలీసులు అక్రమంగా నిర్బంధించారని విశాఖపట్నం జిల్లా, మద్దిలపాలెం, చైతన్యనగర్‌కు చెందిన భార్య బోసా లక్ష్మి పిటిషన్ దాఖలు చేశారు. తన భర్తను ప్రకాశం జిల్లా పొదిలి, దర్శి పోలీసులు అక్రమంగా నిర్బంధించారని ఆమె అభియోగం. ఇచ్ఛాపురం పోలీసులు అరెస్టు చేశారని ప్రభుత్వ న్యాయవాది చెప్పారు. దీంతో ఇచ్ఛాపురం పోలీసులను హైకోర్టు ప్రతివాదిగా చేర్చింది. పొదిలి, ఇచ్ఛాపురం ఎస్‌హెచ్ఒలు స్వయంగా హైకోర్టుకు హాజరయ్యారు. సోషల్ మీడియా పోస్టులు పెట్టినట్లు అంగీకరిస్తూ రమణ వాంగ్మూలం ఇచ్చారని, ఆయన సెక్షన్ 41ఏ నోటీసు తీసుకోవడానికి నిరాకరించడంతో అరెస్ట్ చేశాక విడుదల చేశామని చెప్పారు. దీనిపై హైకోర్టు, అరెస్టు చేశాక 41ఎ నోటీసు అవసరం ఏముందని ప్రశ్నించింది. అరెస్ట్, విడుదల విషయంపై రికార్డు నిర్వహించకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేసింది.


వృద్ధికే పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

నిర్దేశించారు. రాజధాని నిర్మాణం, పోలవరం వంటి పథకాలకు కేంద్రం కొంత నిధులు ఇప్పటికే ప్రకటించగా, అందుకు రాష్ట్ర వాటా నిధులను కూడా సమకూర్చాల్సి ఉంటుందని ఆయన సూచించారు. ఇప్పటికే కేంద్ర ఆర్థిక సంఘాన్ని, నీతీఆయోగ్‌ను కూడా అదనపు ఆర్థిక సాయంపై విజ్ఞాపనలు అందించిన నేపథ్యంలో ఆ నిధులను కూడా బడ్జెట్‌లో చూపించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయుష్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'పౌరసత్వం' ఆశలపై ట్రంప్ నీళ్లు

- భారతీయ దంపతుల్లో ఆందోళన
- 'సీ-సెక్షన్' కోసం పరుగులు
- గ్రీన్ కార్డులు ఇక గగనమేనంటున్న నిపుణులు



న్యూఢిల్లీ : తాత్కాలిక వీసా కలిగిన వారి పిల్లలకు జన్మతః పౌరసత్వం కల్పించడాన్ని నిషేధిస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన సంతకం వలసదారులకు...ముఖ్యంగా భారతీయులకు గట్టి ఎదురు దెబ్బేనని అంతా భావిస్తున్నారు. ట్రంప్ ఆదేశాలను కోర్టులో సవాలు చేసి వాటి అమలును ప్రస్తుతానికి పక్కన పెట్టినప్పటికీ త్వరలో తల్లిదండ్రులుగా మారబోతున్న వేలాది మంది భారతీయులను ఈ విధానం అయోమయంలోకి నెట్టేసింది. హెచ్-1బీ వీసా కలిగిన భారతీయ నిపుణులపై దీని ప్రభావం మరింత అధికంగా ఉంటుంది. ఎందుకంటే అమెరికాలో జన్మించే తమ పిల్లలకు అక్కడి పౌరసత్వం దానంతట అదే అభిస్తుందని అనేక మంది ఆశించారు. కానీ ట్రంప్ ఆదేశాలు వారి ఆశలపై నీళ్ల చల్లుతున్నాయి.

'దాని ప్రభావంపై మాపై నేరుగా పడుతుంది' అని కాలిఫోర్నియాలోని శాన్ జోస్‌లో పనిచేస్తున్న భారతీయ ఇంజినీర్ అక్షయ్ పిసే వాపోయారు. ఆయన భార్య నేహా సత్పూతే ఈ నెలలో ప్రసవించాల్సి ఉంది. 'ట్రంప్ ఆదేశాలు అమలులోకి వస్తే ఏం జరుగుతుందో తెలియడం లేదు' అని ఆయన చెప్పారు. గడువు తేదీ లోగానే ప్రసవం అయ్యేలా చూసుకోవడానికి ఆ దంపతులు ఇష్టపడడం లేదు. 'నా భార్య క్షేమంగా ప్రసవించడం, ఆమె ఆరోగ్యం నాకు ముఖ్యం. ఆ తర్వాతే పౌరసత్వం' అని అక్షయ్ కరాఖండీగా చెప్పారు. అయితే తమ బిడ్డకు అమెరికా పౌరసత్వం లభించాలంటే ముందుగానే ప్రసవించాలని పలువురు దంపతులు నిర్ణయానికి వచ్చారు. అయితే ఇది మంచి పద్ధతి కాదని అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజిన్ (ఏఏపీఐ) అధ్యక్షుడు సతీష్ కతులా సలహా ఇస్తున్నారు. కఠినమైన వైద్య చట్టాలు అమలులో ఉన్న దేశంలో కేవలం పౌరసత్వం కోసం సీ-సెక్షన్ల విధానాన్ని అనుసరించడం మంచిది కాదని తెలిపారు.

'పాస్‌పోర్ట్ కోసం భారత కాన్సులేట్‌ను సంప్రదించాలా? ఏ వీసా వర్తిస్తుంది? దీనిపై స్పష్టమైన సమాచారం లేదు' అని శాన్ జోన్‌లో నివసిస్తున్న ప్రియాన్షి జాజూ చెప్పారు. ఆమె ఏప్రిల్‌లో ప్రసవించాల్సి ఉంది. కాగా అమెరికాలో జన్మించిన వారికి నాన్-ఇమ్మిగ్రెంట్ హోదా కల్పించే నిబంధన ఏదీ చట్టంలో లేదని న్యూయార్క్‌కు చెందిన ఇమ్మిగ్రేషన్ అటార్నీ సైరస్ మెహతా స్పష్టం చేశారు. జన్మతః పౌరసత్వం లేని హెచ్-1బీ వీసా కలిగిన వారి పిల్లలు చట్టపరమైన అనిశ్చితిని ఎదుర్కోవాల్సి వస్తుందని న్యాయ నిపుణులు హెచ్చరించారు. తాము చట్టబద్ధంగా అమెరికాలో ఉంటున్నామని, పన్ను చెల్లింపుదారులమని, అలాంటప్పుడు తమ పిల్లలకు ఎందుకు పౌరసత్వం కల్పించరని పలువురు వలసదారులు ప్రశ్నించారు.

అమెరికాలో అత్యధిక సంఖ్యలో నివసిస్తున్న వలసదారుల్లో భారతీయులది రెండో స్థానం. దీంతో ట్రంప్ నిర్ణయం వారి పైన ఎక్కువగా ప్రభావం చూపుతుంది. యాభై లక్షల మందికి పైగా నాన్-ఇమ్మిగ్రెంట్ వీసాలు ఉన్నాయి. కొత్త నిబంధనల ప్రకారం అమెరికాలో జన్మించినా వీరి పిల్లలకు పౌరసత్వం లభించదు. ఇతర దేశీయులతో పోలిస్తే భారతీయులకే ఎక్కువ గ్రీన్ కార్డ్ బ్యాక్‌లాగ్‌లు ఉన్నాయని ఇమ్మిగ్రేషన్ విధాన విశ్లేషకుడు స్నేహ పూరీ తెలిపారు. ఏ దేశానికైనా గ్రీన్‌కార్డులను ఏడు శాతానికి పరిమితం చేయాలని ప్రస్తుత అమెరికా చట్టాలు నిర్దేశిస్తున్నాయి. భారతీయులు ప్రతి ఏటా 72 శాతం హెచ్-1బీ వీసాలు పొందుతుండడంతో బ్యాక్‌లాగ్ 11 లక్షలకు పెరిగింది. ఈ నేపథ్యంలో కొత్తగా దరఖాస్తు చేసుకునే భారతీయులు జీవితకాలం ఎదురు చూడాల్సి ఉంటుందని, గ్రీన్ కార్డు పొందకుండానే నాలుగు లక్షల మంది మరణించే అవకాశం ఉన్నందని కాటో సంస్థకు చెందిన ఇమ్మిగ్రేషన్ డైరెక్టర్ డేవిడ్ బియర్ హెచ్చరించారు.

అలాగే, ట్రంప్ ఆదేశాలు డాక్యుమెంట్లు లేని వలసదారులపై కూడా ప్రభావం చూపుతాయి. అమెరికాలో జన్మించే వీరి పిల్లలకు జన్మతః పౌరసత్వం లభించే అవకాశమే లేదు. 21 సంవత్సరాల వయసు వచ్చిన వారు గతంలో తమ తల్లిదండ్రులను గ్రీన్ కార్డు కోసం స్పాన్సర్ చేసే అవకాశం ఉండేది. తాజా నిబంధనల కారణంగా ఆ అవకాశం లేకుండా పోయింది. డాక్యుమెంట్లు లేని భారతీయుల సంఖ్య 7.25 లక్షలు ఉండవచ్చునని ప్యూ రిసెర్చ్ అంచనా వేయగా 3.75 లక్షల మంది ఉండవచ్చునని మైగ్రేషన్ పాలసీ ఇన్‌స్టిట్యూట్ చెబుతోంది. హెచ్1బీ లేదా ఓ వీసాలు కలిగిన భారతీయులకు తమ పిల్లల భవిష్యత్తుపై తీవ్ర ఆందోళనలు కలుగుతున్నాయి. వీసా స్టాంపింగ్ కోసం తప్పనిసరిగా అమెరికాను వదిలి వెళ్లే వారికి తరచుగా నిరీక్షణ తప్పడం లేదు. తమ పిల్లలకు కూడా ఇదే సమస్య ఎదురవుతుందని అనేక మంది ఆందోళన చెందుతున్నారు.

పారిశ్రామికోత్పత్తి కుదేలు

- తయారీ రంగం వెలవెల
- డిసెంబర్‌లో 3.2 శాతమే..
- 4.31 శాతంగా రిటైల్ ద్రవ్యోల్బణం



న్యూఢిల్లీ : దేశ ఆర్థిక వ్యవస్థ మందగమనంలోకి జారుకోవడంతో తయారీ రంగం వెలవెల పోతోంది. ప్రజల కొనుగోలు శక్తి క్షీణించి సరుకులకు డిమాండ్ తగ్గడంతో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపి) నాలుగు నెలల కనిష్టానికి పడిపోయినట్లు ప్రభుత్వ గణంకాలే స్పష్టం చేస్తున్నాయి. గడిచిన ఏడాది 2024 డిసెంబర్‌లో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ 3.2 శాతానికి పడిపోయిందని బుధవారం కేంద్ర గణంకాల శాఖ తెలిపింది. ఇంతక్రితం నవంబర్‌లో 5 శాతంగా నమోదయ్యింది. ఇదే నెలలో తయారీ రంగంలో 5.8 శాతం పెరుగుదల ఉండగా.. డిసెంబర్‌లో 3 శాతానికి పరిమితమవడం ఆందోళనకరం.

నవంబర్‌లో 1.9 శాతం పెరిగిన గనుల రంగం.. డిసెంబర్‌లో 2.6 శాతం వృద్ధిని కనబర్చింది. విద్యుత్ ఉత్పత్తి 4.4 శాతం నుంచి 6.2 శాతానికి పెరిగింది. మౌలిక వసతులు, నిర్మాణ రంగ ఉత్పత్తులు నవంబర్‌లో 8.1 శాతం వృద్ధిని సాధించగా.. డిసెంబర్‌లో 6.3 శాతానికి తగ్గాయి. జనవరికి సంబంధించిన ఐఐపి గణంకాలను మార్చ్ 12న విడుదల చేయనున్నారు.

ఈ ఏడాది జనవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ 4.31 శాతంగా చోటు చేసుకుంది. 2024 డిసెంబర్‌లో ఇది 5.22 శాతంగా చోటు చేసుకుంది. గడిచిన నెలలో ఆహారోత్పత్తుల ధరలు 6 శాతంగా ఉండగా.. ఇంతక్రితం నెలలో 8.4 శాతం పెరుగుదలను నమోదు చేశాయి. జనవరిలో ముఖ్యంగా కొబ్బరి ఆయిల్ 54.2 శాతం, ఆలు 49.6 శాతం, కొబ్బరి 38.7 శాతం, అల్లం 30.7 శాతం, బటానీలు 30.2 శాతం చొప్పున పెరగడం గమనార్హం.

1984 అల్లర్లు హత్య కేసులో
దోషిగా కాంగ్రెస్ మాజీ ఎంపి సజ్జన్ కుమార్

న్యూఢిల్లీ : 1984 సిక్కు వ్యతిరేక అలర్లలో ఒక హత్య కేసులో కాంగ్రెస్ మాజీ ఎంపి సజ్జన్ కుమార్‌ను ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు దోషిగా తేల్చింది. ఈ నెల 18న శిక్ష ఖరారు చేయనున్నట్లు కోర్టు తెలిపింది. కేసు తదుపరి విచారణను 18కి వాయిదా వేసింది. కాగా, ఈ అల్లర్లకు సంబంధించిన ఒక కేసులో సజ్జన్ కుమార్ ఇప్పటికే జీవితఖైదు అనుభవిస్తున్నారు. 1984 నవంబర్ 1న ఢిల్లీలోని సరస్వతి నగర్‌లో తండ్రీకొడుకులు ఇద్దరినీ ఒక మూక తగులబెట్టి సజీవదహనం చేసింది. ఈ కేసులో సజ్జన్ కుమార్‌ను కోర్టు బుధవారం దోషిగా తేల్చింది. ఈ మేరకు రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా ఆదేశాలు జారీచేశారు. ఈ దారుణానికి పాల్పడిన మూకలో సజ్జన్ కుమార్ కేవలం ఒక సభ్యుడిగా మాత్రమే ఉండలేదని, ఆ మూకకు నాయకత్వం వహించాడని కోర్టు వ్యాఖ్యానించింది. సజ్జన్ కుమార్‌ను తీహార్ జైలు నుంచి తీసుకొచ్చి కోర్టులో హాజరుపర్చారు.

సంబంధాలు మరింత బలోపేతం!

- పలు ద్వైపాక్షిక అంశాలపై చర్చించిన మోడీ, మాక్రాన్
- ప్రజా ప్రయోజనాల కోసమే ఎఐ
- మార్సెల్లెలో భారత్ నూతన కాన్సులేట్ కార్యాలయం ప్రారంభం
- అమెరికా బయలుదేరిన మోడీ



పారిస్ : భారత్, ఫ్రాన్స్‌ల మధ్య వాణిజ్య, పెట్టుబడుల సంబంధాలను మరింత పెంపొందించుకోవాలని భారత ప్రధాని నరేంద్ర మోడీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్‌లు పిలుపునిచ్చారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో, అలాగే వివిధ అంతర్జాతీయ వేదికలపై సహకారాన్ని పెంచుకోవాలని అంగీకారానికి వచ్చారు. ఇరువురు నేతల ద్వైపాక్షిక భేటీ అనంతరం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ రంగాల్లో ఇరు దేశాల మధ్య సహకారం ఊపందుకోవడం పట్ల నేతలు సంతృప్తి వ్యక్తం చేశారు. కొత్త సంవత్సరంలో ద్వైపాక్షిక సహకారానికి ప్రాధాన్యతా రంగాలుగా డిజిటల్ ఆరోగ్యం, సూక్ష్మజీవుల నిరోధకత, ఆరోగ్య నిపుణుల పరస్పర మార్పిడి వంటి రంగాలను గుర్తించారు.

కృత్రిమ మేథస్సును వినియోగించేందుకు నిర్దేశించే ప్రమాణాలను ప్రజాస్వామిక విలువలు ప్రతిబింబించేలా చూడాల్సి వుందని ఇరు దేశాలు అభిప్రాయపడ్డాయి. ప్రజా ప్రయోజనాల కోసమే ఎఐని వాడాలని నేతలు పేర్కొన్నారు. ఎఐ అభివృద్ధిని పరిచే ప్రక్రియలో ఇరు దేశాలు భాగస్వామ్యం కావాలని నిర్ణయించారు. ఇంధన భద్రతకు అణు విద్యుత్ చాలా కీలకమని నొక్కి చెబుతూ అధునాతన అణు రియాక్టర్లను సంయుక్తంగా అభివృద్ధిపరచాలనే లక్ష్యాన్ని ఇరు దేశాలు నొక్కి చెప్పాయి. ఈ మేరకు ఒక అవగాహనా ఒప్పందంపై సంతకాలు కూడా చేశారు. తక్కువ కార్బన్లు వినియోగించుకునే ఆర్థిక వ్యవస్థ దిశగా పరివర్తన చెందడానికి, ఇంధన భద్రతకు అణు ఇంధనమనేది చాలా కీలకంగా మారిందని నొక్కి చెప్పారు. రక్షణ, రోదసీ, పౌర అణు సహకారం, ఆరోగ్యం, ప్రజల మధ్య సహకారం వంటి రంగాల్లో పురోగతిని నేతలు సమీక్షించారు. 2026ను భారత్, ఫ్రాన్స్ ఆవిష్కరణల సంవత్సరంగా ఇరువురు నేతలు ప్రకటించారు. ఈ మేరకు ఇరువురు నేతలు దీని లోగోను ఆవిష్కరించారు. ప్రధానంగా ఎఐపైనే ద్వైపాక్షిక చర్చలు కేంద్రీకృతమయ్యాయని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి చెప్పారు. యూరప్, పశ్చిమాసియా, ఇండో-పసిఫిక్ ప్రాంతాల్లో నెలకొన్న పరిణామాలపై పరస్పరం అభిప్రాయాలు వ్యక్తం చేసుకున్నారని తెలిపారు. విభిన్నమైన వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చలు జరిగాయన్నారు.

అమరవీరులకు నివాళులు

అనంతరం ఇరువురు నేతలు ఫ్రాన్స్ అధ్యక్ష విమానంలో మార్సెల్లె నగరానికి చేరుకున్నారు. అక్కడ కొత్తగా భారత కాన్సులేట్ కార్యాలయాన్ని సంయుక్తంగా ప్రారంభించారు. ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో ఈ కార్యాలయం కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. అనంతరం మజర్గ్యూస్ యుద్ధ వీరుల సమాధిని సందర్శించి పుష్పగుచ్ఛాలుంచి అంజలి ఘటించారు. మొదటి ప్రపంచ యుద్ధంలో తమ ప్రాణాలను త్యాగం చేసిన 205 మంది భారతీయ సైనికులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ యుద్ధంలో అశువులు బాసిన వీరుల త్యాగానికి గుర్తుగా ఫ్రాన్స్ ప్రభుత్వం గతంలో మార్సెల్లె నగరంలో యుద్ధ స్మారకాన్ని నిర్మించింది. కామన్‌వెల్త్ వార్ గ్రేవ్స్ కమిషన్ (సిడబ్ల్యుజిసి) ఈ స్మారక నిర్వహణా బాధ్యతలు చూస్తుంది. ఫ్రాన్స్‌లో రెండు రోజుల పర్యటన ముగించుకుని ప్రధాని మోడీ అమెరికా పర్యటనకు బయలుదేరి వెళ్లారు.

భూభాగాల మార్పిడి అవకాశం లేదు

- స్పష్టం చేసిన రష్యా

మాస్కో : శాంతి ఒప్పందంలో భాగంగా ఉక్రెయిన్‌తో భూభాగాల మార్పిడికి ఎలాంటి అవకాశం లేదని రష్యా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి మరియా జకరోవా స్పష్టం చేశారు. గార్డియన్ పత్రికకు ఇంటర్వ్యూ ఇచ్చిన సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్స్కీ రష్యాతో భూభాగాల మార్పిడికి ఒక ప్రతిపాదన చేశారు. గత ఆగస్టులో ఉక్రెయిన్ బలగాలు స్వాధీనం చేసుకున్న కుర్స్క్ ప్రాంతాన్ని వెనక్కి తిరిగి ఇచ్చేస్తామని, అందుకు ప్రతిగా రష్యా కూడా తమ భూభాగాన్ని ఇచ్చేయాల్సి వుంటుందని చెప్పారు. అయితే బదులుగా ఏ ఏ భాగాలు కోరాలనుకుంటున్నారనే అంశంపై జెలెన్స్కీ ఒక స్పష్టత ఇవ్వలేదు. కాగా ఆ ప్రతిపాదనను జకరోవా తోసిపుచ్చారు. "కుర్స్క్ ప్రాంతంలో విధ్వంసం సృష్టిస్తున్న నయా నాజీలకు ఎలాంటి భూభాగ మార్పిడి లేకుండానే ఒక మీటరు వెడల్పు, రెండు మీటర్ల పొడవు, మీటరన్నర లోతు వున్న ప్రాంతం లభిస్తుంది." అని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆమె సోషల్‌మీడియాలో పోస్టు పెట్టారు. ఆ కొలతలతో సమాధి గురించి పరోక్షంగా ప్రస్తావిస్తూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. కదనరంగంలో ఉక్రెయిన్ బలగాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై నుండి దృష్టి మరల్చడానికే జెలెన్స్కీ ఈ వ్యాఖ్యలు చేశారని ఆమె వ్యాఖ్యానించారు. ఆరు మాసాల క్రితం కుర్స్క్ ప్రాంతంలోకి తొలిసారిగా చొచ్చుకుపోయినపుడు స్వాధీనం చేసుకున్న భూభాగంలో సగానికి పైగా ప్రాంతాన్ని ఉక్రెయిన్ ఆర్మీ కోల్పోయింది. ఈ సైనిక కార్యకలాపాల వల్ల ఉక్రెయిన్ వైపు 59,500మందికి పైగా మరణించారని రష్యా రక్షణ శాఖ అంచనా వేసింది. ఇలా దాడులు జరపడం వల్ల చర్చలు జరిగే అవకాశాలు మృగ్యమైపోతాయని గత ఆగస్టులోనే రష్యా అధ్యక్షుడు పుతిన్ హెచ్చరించారు. ఉద్దేశ్యపూర్వకంగానే రష్యా పౌరులను, అణు సదుపాయాలను కీవ్ లక్ష్యంగా చేసుకుంటోందని విమర్శించారు. అటువంటి వ్యక్తులతో ఇక చర్చలు ఏముంటాయని ప్రశ్నించారు. ఇటీవల విముక్తి పొందిన ప్రాంతాల్లో ఉక్రెయిన్ జరిపిన అత్యాచారాలపై రష్యా అధికారులు ప్రస్తుతం దర్యాప్తు జరుపుతున్నారు. రష్యా చట్టం కింద కుర్స్క్ ప్రాంతానికి, రష్యాలో భాగంగా మారిన మాజీ ఉక్రెయిన్ ప్రాంతంగానే చట్టపరమైన గుర్తింపు వుంది. కానీ కీవ్ మాత్రం ఇంకా ఆ ప్రాంతంపై తమకు సార్వభౌమాధికారం వుందని పేర్కొంటోంది. ఉక్రెయిన్‌తో శాంతి ఒప్పందం క్షేత్ర స్థాయిలో వాస్తవికతను పరిష్కరించేలా వుండాలని రష్యా పట్టుబడుతోంది. అంటే రష్యాలో చేరేందుకు అనుకూలంగా మాజీ ఉక్రెయిన్ ప్రాంతాల్లోని ప్రజలు ఓటు వేశారు. వాటిని గుర్తించాల్సి వుందని రష్యా కోరుతోంది. అయితే అదంతా వట్టి కపటమని కీవ్ తోసిపుచ్చుతోంది.

భారత్‌తో సంబంధాలకు ట్రంప్ ప్రాధాన్యత

- వైట్‌హౌస్ మాజీ అధికారి వ్యాఖ్యలు

న్యూయార్క్ : భారత్‌తో సంబంధాలకు ట్రంప్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని వైట్‌హౌస్ మాజీ అధికారి లీసా కర్టిస్ వ్యాఖ్యానించారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో మార్పులు తీసుకువచ్చే సామర్థ్యం భారత్‌కు వుందని గుర్తించిందని, ముఖ్యమైన భాగస్వామిగా భావిస్తోందని పేర్కొన్నారు. గురువారం వైట్‌హౌస్‌లో అధ్యక్షుడు ట్రంప్‌తో మోడీ భేటీ కానున్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. ట్రంప్ మొదటి ప్రభుత్వంలో లీసా జాతీయ భద్రతా మండలిలో దక్షిణ, సెంట్రల్ ఆసియా సీనియర్ డైరెక్టర్‌గా 2017 నుండి 2021 వరకు పనిచేశారు. మోడీ పర్యటనను పురస్కరించుకుని వాషింగ్టన్‌కు చెందిన సెంటర్ ఫర్ ఎ న్యూ అమెరికన్ సెక్యూరిటీ (సిఎన్ఎఎస్) సంస్థ నిర్వహించిన ఆన్‌లైన్ పత్రికా సమావేశంలో లీసా పాల్గొన్నారు. భారత ప్రభుత్వంలో సంబంధాలకు ట్రంప్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందనడంలో ఎలాంటి సందేహం లేదని ఆమె స్పష్టం చేశారు.

ఇంక్రిమెంట్లపై యుజిసి యూ-టర్న్

- పరిశోధనలకు వేతన పెంపుదల ఉండదంటూ ఆదేశాలు

న్యూఢిల్లీ : పరిశోధనలకు పెద్ద పీట వేస్తానని చెప్పుకునే యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) వాస్తవంలో అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో పీహెచ్‌డీ, ఎంఫిల్ డిగ్రీల కోసం పరిశోధనలు చేసే ఫ్యాకల్టీ సభ్యులకు ఇంక్రిమెంట్లు ఇచ్చే విషయంలో కమిషన్ యూ-టర్న్ తీసుకుంది. కళాశాలలు, యూనివర్సిటీల్లో పరిశోధనలకు సంబంధించిన అర్హతలు పొందేందుకు ఫ్యాకల్టీ సభ్యులకు యజిసి ఇప్పటి వరకూ ఇంక్రిమెంట్లు ఇస్తోంది. అయితే వాటిని నిరాకరించేందుకు ఇప్పుడు ఎనిమిది సంవత్సరాల నాటి ప్రభుత్వ ఆదేశాలను బూజు దులిపి బయటికి తీసింది. ఈ నేపథ్యంలో తమకు ఇప్పటికే చెల్లించిన మొత్తాన్ని రికవరీ చేస్తుందేమోనని అధ్యాపకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పీహెచ్‌డీ, ఎంఫిల్ డిగ్రీల కోసం పరిశోధనలు చేసే ఫ్యాకల్టీ సభ్యులకు ఇంక్రిమెంట్లు చెల్లించేందుకు యూనివర్సిటీలను యుజిసి గతంలో అనుమతించింది. గత దశాబ్ద కాలంగా ఈ ఇంక్రిమెంట్ల చెల్లింపు జరుగుతోంది. అయితే ఇప్పుడు ఇకపై ఇంక్రిమెంట్లు ఇవ్వరాదంటూ తాజాగా ఆదేశాలు జారీ చేసింది. దీనికి సంబంధించి యుజిసి సోమవారం కేంద్రీయ వర్సిటీలకు వివరణ పంపింది. ఇంక్రిమెంట్ విషయంలో ఉన్నత విద్యా శాఖ పంపిన లేఖను పరిగణనలోకి తీసుకొని, దాని ప్రకారం నడుచుకోవాలని అందులో సూచించింది. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే ఉన్నత విద్యా శాఖ లేఖ పంపింది 2017 నవంబర్ 2వ తేదీన. 'ఇంటెన్సివ్‌లు వేతనాల్లో భాగంగానే ఉన్నాయి. కెరీర్ అడ్వాన్స్‌మెంట్ పథకం కింద మంచి పురోగతి కనబరుస్తున్న ఎంఫిల్ లేదా పీహెచ్‌డీ డిగ్రీ అధ్యాపకులకు ఇచ్చే ఇంక్రిమెంట్లు వేతనాల్లో భాగంగానే ఉన్నాయి. కాబట్టి ఎంఫిల్ లేదా పీహెచ్‌డీ డిగ్రీలు పొందడానికి అడ్వాన్స్ ఇంక్రిమెంట్ రూపంలో ప్రోత్సాహకాలు ఇవ్వాల్సిన అవసరం లేదు' అని అప్పటి విద్యా శాఖ లేఖ పేర్కొంది. యూజీసీ తాజా నిర్ణయంపై వర్సిటీ ఫ్యాకల్టీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంక్రిమెంట్లను నిరాకరించడంతో పరిశోధన, నైపుణ్యాన్ని అభివృద్ధి చేయాలన్న లక్ష్యానికి విఘాతం ఏర్పడుతుందని వారు తెలిపారు.

మూడు గంటల్లో.. మూడు వేల మందికి ఛలాన్లు

- హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపినందుకు గుజరాత్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు అధికారుల షాక్

గాంధీనగర్ : గుజరాత్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ట్రాఫిక్ విభాగం షాకిచ్చింది. హెల్మెట్లు ధరించకుండా వాహనాలు నడిపినవారికి ఛలాన్లు వేసింది. కేవలం మూడు గంటల్లో మూడు వేల మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులకు ఫైన్లు వేసింది. ఇలా ఫైన్ల రూపంలో మొత్తం రూ.15.96 లక్షలు వసూలు చేసింది. హెల్మెట్ ధరించని ప్రభుత్వ ఉద్యోగుల విషయంలో రాష్ట్ర డీజీపీ వికాస్ సాహే ఆదేశాల మేరకు ట్రాఫిక్ విభాగం పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టారు. తమ కార్యాలయాల బయట హెల్మెట్లు ధరించకుండా వాహనాలు నడుపుతున్న ప్రభుత్వ అధికారుల, ఉద్యోగులకు మోటార్ వెహికిల్స్ యాక్ట్ కింద రూ.500 చొప్పున జరిమానా విధించారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా 39 ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధుల్లో 3192 మంది ప్రభుత్వ ఉద్యోగులకు ఫైన్లు వేసినట్టు సమాచారం. ఇలా మంగళవారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫైన్ల రూపంలో మొత్తం రూ.15.96 లక్షలు వసూలు చేసినట్టు తెలిసింది.రాష్ట్రంలో ప్రధాన నగరాలైన బనాస్‌కాంతా, సురేంద్రనగర్, భరూచ్‌ల నుంచి పెద్ద ఎత్తున ఉల్లంఘనలు నమోదయ్యాయని ట్రాఫిక్ విభాగం ఉన్నతాధికారి ఎం.ఎల్ నినామా తెలిపారు. అహ్మదాబాద్ నుంచి ఐదో వంతు(473 కేసులు), అహ్మదాబాద్ రూరల్ నుంచి 220 ఉల్లంఘనలు నమోదయ్యాయి. మంగళవారం కొనసాగిన ఈ డ్రైవ్‌లో అహ్మదాబాద్‌లో మొత్తం 660 ఉల్లంఘనలు నమోదు కాగా, మొత్తం ఫైన్లు రూ.3.3 లక్షలు అని ట్రాఫిక్ విభాగం అధికారి ఎన్.ఎన్ చౌదరీ తెలిపారు. ఇందులో 72 మంది పోలీసు సిబ్బంది కూడా ఉన్నారని చెప్పారు. రాజ్‌కోట్‌లో సోమవారం డ్రైవ్‌ను చేపట్టారు. ఇందులో 395 ఉల్లంఘనలు జరిగాయి. ఫైన్ల రూపంలో రూ.1,97,500 వసూలైనట్టు ట్రాఫిక్ డీసీపీ పూజా యాదవ్ తెలిపారు.

గాజా.. పాలస్తీనీయులదే:

- ట్రంప్ 'స్వాధీనం' వ్యాఖ్యకు చైనా కౌంటర్

బీజింగ్ : గాజాను స్వాధీనం చేసుకోవాలని భావిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనను చైనా ఖండించింది. "గాజా ప్రాంతం పాలస్తీనీయులదే. అక్కడినుంచి వారిని బలవంతంగా తరలించేందుకు మేం వ్యతిరేకం" అని స్పష్టం చేసింది. అలాగే అరబ్ లీగ్ నుంచి కూడా ఇదే అభిప్రాయం వ్యక్తమైంది. వారిని తరలించడం ఆమోదయోగ్యం కాదని వ్యాఖ్యానించింది.

గాజాలో ఉన్న పాలస్తీనా వాసులంతా పశ్చిమాసియాలోని వేరే ఏదైనా ప్రాంతానికి వెళ్లి శాశ్వతంగా స్థిరపడితే అమెరికా బాధ్యత తీసుకుని గాజాను పునర్నిర్మించాలని భావిస్తున్నట్లు ట్రంప్ చెప్పారు. "పాలస్తీనియన్లు వేరేచోట స్థిరపడిన తర్వాత గాజా స్ట్రిప్‌ను అమెరికా స్వాధీనం చేసుకుంటుంది. అక్కడ ఇజ్రాయెల్ అమర్చిన ప్రమాదకరమైన బాంబులను, ఆయుధాలను నిర్వీర్యం చేసే బాధ్యతను తీసుకుంటుంది" అని వెల్లడించారు. "దాడుల వల్ల అక్కడ నామరూపాల్లేకుండా ధ్వంసమైన భవనాలను పునర్నిర్మిస్తుంది. కాంక్రీటు శిథిలాల కింద అక్కడ ప్రజలు ఉంటున్నారు. ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి అక్కడి ప్రజలకు అపరిమిత సంఖ్యలో ఉద్యోగాలు, ఇళ్లు లభించేలా చూడవచ్చు" అని ట్రంప్ పేర్కొన్నారు.

అడవులపై అదాని పడగ!

(మొదటి పేజీ తరువాయి)

మొక్కుతుంటారు. ఈ కొండ అదానీపరం అవుతుందన్న సంగతి వీరికి తెలియదు. ప్రపంచంలో లభ్యమయ్యే బాక్సైట్‌లో 50 శాతం ఒడిశాలోనే నాణ్యమైనది ఉందన్నది బ్రిటిష్ వారు గతంలో చేసిన సర్వే ద్వారా తెలుస్తోంది. ఛత్తీస్‌గఢ్‌లోని మాంగనీసు, ఇతర ఖనిజాలకోసం ఒడిశా కొండలపై బిజెపి కన్ను అందుకే పడింది. ముఖ్యంగా ఒడిశా ప్రభుత్వ జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా చేసిన సర్వే ప్రకారం మాంగనీసు, మెలనైట్, బొగ్గు, డోలమైట్, నికెల్, మెగ్నీషియం, సీసం, గ్రానైట్ వంటివి ఇదే ప్రాంతంలో మిగతా కొండలపైనా లభ్యమవుతున్నాయి. బలంగీర్ కొండపై మాత్రం ఇనుప ఖనిజం, బాక్సైట్ విరివిగా ఉన్నందున అదాని ఎంట్రీ ఇచ్చాడని తెలుస్తోంది. ఈ కొండ ఎక్కాలంటే కాలినడకన 4 నుంచి 5 గంటలు పడుతుంది. కొండపై బిజెపి హయాంలోనే 2017లో హెలిప్యాడ్ నిర్మించి ఉంచారు.

శర వేగంగా రాయపూర్-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ వే

విశాఖపట్నం- రాయపూర్ ఆరు లేన్ల ఎక్స్‌ప్రెస్ వే అదాని వ్యాపార సామ్రాజ్య విస్తరణకు దోహదపడేదే. 2017లోనే మోడీ ప్రభుత్వం ఆమోదించింది. 2025 నాటికి సిద్ధం చేసేశారు. 464 కిలోమీటర్ల పొడవు, ఆరు లేన్ల వెడల్పు ఉంది. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలుపుతూ దేశ కొత్త ఎక్స్‌ప్రెస్ హైవేలలో ఇదొకటి. రాయపూర్-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ వే అనేది భారతమాల పరియోజన ఫేజ్-1 కింద ఆమోదించబడిన ఆర్థిక కారిడార్. ఎక్స్‌ప్రెస్ వే మార్గం ఛత్తీస్‌గఢ్‌లోని 124 కిలోమీటర్లు, ఒడిశాలో 240 కిలోమీటర్లు, మన రాష్ట్రంలో వంద కిలోమీటర్లు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే డిపిఆర్ రూపొందించారు. దీని మొత్తం ఖర్చు రూ.20 వేల కోట్లు. ఈ ఎక్స్‌ప్రెస్ హైవే ప్రారంభం కరుద్, రాయపూర్ నుంచి విశాఖపట్నం పోర్టు, విశాఖపట్నం వరకూ ఉంటుంది. 2014లోనే మోడీ తొలిసారి ప్రధాని మంత్రి అయినప్పుడే (ఎంఒఇఆర్‌టిహెచ్-మోర్త్) అంటే మినిస్ట్రీ ఆఫ్ రోడ్డు ట్రాన్స్‌పోర్టు అండ్ హై వేస్ మధ్య కనెక్టివిటీ, టూరిజం, అభివృద్ధి, ఆర్థిక కారిడార్‌ల అభివృద్ధికి రాయపూర్ నుంచి విశాఖపట్నం వరకూ ఒక ఎక్స్‌ప్రెస్ హైవేను నిర్మించాలని ఆమోదించింది. 2022లో దీని నిర్మాణానికి మోడీ శంకుస్థాపన చేశారు. ఆర్థిక కార్యకలాపాలను మెరుగుపరచడానికి, ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించడానికి ఈ ఎక్స్‌ప్రెస్ హై వేను చేపడుతున్నట్లు కేంద్రం చెబుతోంది. అయితే, బలంగీర్ కొండ చుట్టూ అదాని గ్రూపు కేంద్రీకృతమై సాగిస్తున్న దోపిడి కోసమే ఈ రహదారి చేపడుతోందని స్పష్టమవుతోంది.

మూలపేట పోర్టు 'అదాని' వ్యాపారం కోసమే!

బలంగీర్ జిల్లాలోంచి రాయపూర్‌ను కలుపుకుని మరో హై వే సంబల్‌పూర్ వరకూ కేంద్రం నిర్మిస్తోంది. ఇది కూడా బాక్సైట్ రవాణా కోసమే. రాయపూర్ నుంచి బలంగీర్ జిల్లా మీదుగా రాయగడలో కలుస్తుంది ఈ రోడ్డు. రాయగడ మీదుగా శ్రీకాకుళం జిల్లాలోని మూలపేట పోర్టుకు బాక్సైట్‌ను తరలించాలనేది భవిష్యత్ ప్లాన్. ఈ నేపథ్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జనవరి 8న విశాఖకు, ఆ తర్వాత 9న భువనేశ్వర్‌కు వెళ్లారని తెలుస్తోంది. ప్రస్తుత ఒడిశా గవర్నర్, గతంలో బిజెపి విశాఖ ఎంపీగా ఉన్న కంభంపాటి హరిబాబు 'ప్రవాస్ భారత్ సమ్మేళన్'ను 9న భువనేశ్వర్‌లో నిర్వహించారు. ఖనిజ సంపదల వ్యాపారం ఎగుమతులే ప్రధాన అజెండాగా ఇది సాగింది. శ్రీకాకుళం జిల్లాలో నిర్మాణంలో ఉన్న మూలపేట పోర్టుకు తొలి సరకు రవాణా ఈ అదానీ బాక్సైట్ అని తెలుస్తోంది. 2026-2027 తర్వాత దీన్ని ఎగుమతి చేసేందుకు వీలుగా అన్ని వైపుల నుంచీ సిద్ధం చేస్తున్నారని సమాచారం.





మీకోసం

గోధుమ పిండిలో కొద్దిగా పాలు లేదా నూనె వేసి కలిపితే చపాతీలు మృదువుగా వస్తాయి.

జీవన సౌరభం

చేయాల్సిన పనిని వాయిదా వేసుకుంటూ పోతే సాధించాలనే తపన వెనక్కుపోతుంది.

పాటల రాజు



అనంతవరం అనే పల్లెటూరిలో రాజు అనే పిల్లవాడు ఉన్నాడు. రాజు పశువులను మేపుతూ పాటలు బాగా పాడతాడు. అందరూ అతన్ని పాటల రాజు అని పిలుస్తారు. రాజు పాటలు వినడానికి ఎంతో మధురంగా ఉంటాయి. పొలాల్లో పనిచేస్తున్న రైతులు, కూలీలు రాజు పాటలు విని తమ అలసట మరిచిపోయేవారు.


పాటల రాజు విషయం ఆ ఊరి పెద్ద బడి మాస్టారుకు తెలిసింది. ఒకరోజు రాజును వెతుక్కుంటూ మాస్టారు అడవిలోకి వెళ్ళారు. రాజు పాటలు విని సంతోషించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి కారణంగా రాజు చదువు మధ్యలోనే ఆపేసి పశువుల కాపరిగా మారాడని మాస్టారికి అర్థమైంది. రాజును బడికి రమ్మని చెప్పారు. కానీ అతని తల్లి దండ్రులు పంపలేమని అన్నారు. మాస్టారు చదువు విలువ గురించి ఎంతగా నచ్చచెప్పినా వారు వినిపించుకోలేదు. చేసేదేమీ లేక మాస్టారు వెనుదిరిగారు. వెళుతూ వెళుతూ, రాజుతో మాట్లాడారు.

'రాజూ, నీలో గొప్ప కళ ఉంది. నీ పాట ఈ పొలాలకే పరిమితం కాకూడదు. నువ్వు చదువు కుంటే, నిన్ను గొప్ప గాయకుడిగా ప్రపంచానికి పరిచయం చేస్తాను' అన్నారు.

మాస్టారు మాటలు రాజుకు బాగా నచ్చాయి. బడికి పోవాలనే ఆసక్తి కలిగింది. తల్లిదండ్రులను బతిమాలి ఒప్పించి పెద్దబడిలో చేరాడు. గాయకుడు కావాలనే ఇష్టంతో వచ్చిన రాజుకు, పాఠశాల పరిసరాలు, తోటి విద్యార్థులను చూసి చదువుపై ఇష్టం పెరిగింది. పాటలు పాడుతూనే చదువుపై శ్రద్ధ పెట్టాడు. కొన్ని సంవత్సరాలకి గాయకుడిగా, ఉత్తమ విద్యార్థిగా పేరు సంపాదించాడు. పాటల రాజు చదువుల రాజు కూడా అయ్యాడు.




– పి.అవినాష్,
7వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
అనంత సాగర్, సిద్దిపేట జిల్లా,
99590 07914.



లెక్క తేల్చండి

పిల్లలూ, ఇక్కడున్న బొమ్మలని అంకెలుగా గణించి లెక్కచేశాం. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.

జవాబు : 186



నేను గీసిన బొమ్మ



గాలం వెంకట సాయి దీక్షిత్
2వ తరగతి,
ఎంపిపి ప్రైమరీ స్కూలు,
చిల్లకల్లు మెయిన్,
జగ్గయ్యపేట మండలం,
ఎన్టీఆర్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఒలింపిక్స్ పతకమే లక్ష్యం



కృష్ణా జిల్లా నాగాయలంక మండల కేంద్రానికి చెందిన నాగిడి నాగబాబు, వెంకట నాగేశ్వరమ్మల దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రెండో కుమార్తె నాగిడి గాయత్రి జలక్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తోంది. తల్లి గృహిణి. తండ్రికి చేపల వేట జీవనాధారం. చిన్నతనం నుంచే తండ్రి వెంట చేపల వేటకు వెళ్లేది. ఆ క్రమంలో ఈతకొట్టడం నేర్చుకుంది. ఆ తర్వాత తండ్రి నుంచి చేపల వేటలో మెళకువలు నేర్చుకుంది. పడవ నడపటం దగ్గర నుంచి ఒడుపుగా లంగరు వేయటం వరకూ తండ్రినే గురువుగా ఎంచుకుని ఆయన మాదిరిగా ఒడుపు నేర్చుకుంది. చదువుకుంటూనే తండ్రికి చేదోడువాదోడుగా ఉంటోంది.

విద్యాభ్యాసం సాగిందిలా...

గాయత్రి ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ ఎంపియుపి స్కూలు, 6 నుంచి 10వ తరగతి వరకూ నాగాయలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక విద్యను పూర్తిచేసింది. చదువుతో పాటుగా ఆమె కరాటే, అథ్లెటిక్స్‌లో మంచి నైపుణ్యాన్ని ప్రదర్శించేది. ఆమె ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు ఆటల్లోనూ ప్రోత్సహించారు. మండల, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని బంగారు, వెండి పతకాలను సైతం సాధించింది. 2019–21లో స్పోర్ట్స్‌కోటాలో విజయనగరం జిల్లా గరివిడిలోని వెటర్నరీ పాలిటెక్నికల్ కళాశాలలో డిప్లమో కోర్సులో చేరి దానిని పూర్తిచేసింది. ఆమె తల్లిదండ్రులు వెటర్నరీ డాక్టర్ కోర్సు చేయటానికి ఆసక్తి చూపారు. గాయత్రిలోని జల క్రీడా నైపుణ్యాన్ని తెలుసుకున్న టి.సాంబ శివారెడ్డి, ఎపి కెనో స్లాలమ్ (కె–1) అసోసియేషన్ అధ్యక్షులు బలరామనాయుడు ఆమెకు జలక్రీడల్లో ప్రోత్సహిస్తామని ముందుకొచ్చారు. తొలుత స్విమ్మింగ్‌లో టి.నాగబాబు, ఎం.శ్రీను, బాబూరావులు శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం బాపట్ల జిల్లా నగరంలోని శ్రీవెలగపూడి రామకృష్ణ మెమోరియల్ డిగ్రీ కళాశాల బిసిఎ ద్వితీయ సంవత్సరం చదువుతోంది.

గంగమ్మ ఒడిలో పుట్టి పెరిగింది ఆ యువతి. అదే తన జీవితం అని భావించలేదు. తండ్రినే గురువుగా భావించి నదినే శిక్షణా కేంద్రంగా ఎంచుకుంది. ఆడపిల్లనని వెనుకడుగు వేయకుండా కష్టమైన సాహసంతో కూడిన జల క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణిస్తోంది. కెనో స్లాలమ్ (కె–1) క్రీడలో ఏషియన్ గేమ్స్, ఒలింపిక్స్‌లో బంగారు పతకమే లక్ష్యంగా కృషిచేస్తోంది. లక్ష్యసాధనలో భాగంగా ఒడిఒడిగా అడుగులేస్తోంది 20 ఏళ్ల నాగిడి గాయత్రి.



సంక్రాంతి సంబరాల్లో భాగంగా 2018లో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నాగాయలంకలో జరిగిన రాష్ట్రస్థాయిలో బోటింగ్ పోటీలను ఆమె చూసింది. తాను కూడా మరింత నిపుణత సాధిస్తే అంతర్జాతీయ క్రీడాకారిణిగా తయారుకావొచ్చునని భావించి, కృష్ణానదిలో తన సాధనకు మరింత పదును పెట్టింది.

నిరంతర శిక్షణలో...

తండ్రి సంపాదనతోనే కుటుంబం మొత్తం నడవాల్సివుంది. ఈ క్రమంలో తను ఇబ్బందులు పడినా పిల్లలను ప్రయోజకులను చేయాలని నాగబాబు దంపతులు నిర్ణయించుకున్నారు. ప్రముఖుల కోరికమేరకు గాయత్రికి వాటర్‌స్పోర్ట్స్‌లో నైపుణ్య శిక్షణ ఏర్పాటుచేశారు. అనతికాలంలోనే ఆమె తన ప్రతిభతో మంచిగా రాణించింది. ఇతర ప్రాంతాల్లో జరిగే పోటీలకు వెళ్లేందుకు డబ్బులు లేక చాలాసార్లు ఇబ్బందులు తలెత్తాయి. అయినా పిల్లలపై ఉన్న ప్రేమతో తల్లిదండ్రులు అప్పోసొప్పో చేసి పాల్గొనేలా చేసేవారు.

డెహ్రాడూన్‌లో సత్తా

ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో జనవరి 28 నుంచి ఫిబ్రవరి 14 వరకూ జరుగుతున్న 38వ జాతీయస్థాయి క్రీడల్లో ఆంధ్ర కెనో స్లాలమ్ (వాటర్ స్పోర్ట్స్) తరపున ఆమె పాల్గొని మహిళల విభాగంలో బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది.

జాతీయపోటీల్లో మొదటిస్థానంలో నిలిచిన గాయత్రిని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేష్, రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్, కృష్ణాజిల్లా కలెక్టర్ డికె బాలాజీ, జెసి గీతాంజలిశర్మ, డిఆర్‌డిఒ కె.ఝాన్సీలక్ష్మి తదితరులు అభినందించారు. గాయత్రి మరింతగా జలక్రీడల్లో రాణించటానికి అవసరమైన ఏర్పాట్లు, వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఎపి మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కొల్లాటి శ్రీనివాసరావు, పిడి ప్రసాద్ అభినందనలు తెలిపారు.

– యడవల్లి శ్రీనివాసరావు



ఎనిమిదేళ్లుగా ఎన్నో పతకాలు

గత ఎనిమిదేళ్లుగా గాయత్రి కెనో స్లాలమ్ (కె–1) క్రీడల్లో పాల్గొంటూ పతకాలు సాధిస్తున్నారు.

- కరాటేలో రాష్ట్రస్థాయిలో గోల్డ్‌మెడల్–2017
- తైక్వాండో జాతీయస్థాయి పోటీలు (ఢిల్లీ)లో కాంస్యపతకం–2017
- 2019, 2022లో జాతీయస్థాయి పోటీలకు ఎంపిక
- 2022 గుజరాత్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో నాల్గోస్థానం
- 2022లో ఇండోర్ రోయింగ్ స్టేట్ చాంపియన్‌షిప్‌లో గోల్డ్‌మెడల్
- 15వ ఇండోర్ నేషనల్ రోయింగ్ చాంపియన్‌షిప్ (చండీఘడ్) కాంస్యం
- 10వ కెనో స్లాలమ్ ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్ (మధ్యప్రదేశ్) కాంస్యం
- 2022 ఖేలో ఇండియా యూత్‌గేమ్స్(మధ్యప్రదేశ్–భోపాల్)–కాంస్యం
- 2023 రాష్ట్రస్థాయి పోటీల్లో గోల్డ్‌మెడల్–విజయవాడ
- 37వ నేషనల్ గేమ్స్(గోవా)లో కాంస్యం
- 2024లో ఇంటర్నేషనల్ వాటర్ వరల్డ్ ర్యాంకింగ్ చాంపియన్‌షిప్‌లో అత్యుత్తమ ప్రతిభ
- 2025లో జాతీయస్థాయి జల క్రీడల్లో మహిళల విభాగంలో బంగారు పతకం–(డెహ్రాడూన్–ఉత్తరాఖండ్)

భోపాల్‌లో కఠోర శిక్షణ

మన రాష్ట్రంలో జలక్రీడలకు అంత అనుకూలమైన వసతుల్లేవు. అందుకే మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో తర్ఫీదు పొందాను. అక్కడ నాకు జాతీయకోచ్ కులదీప్ సార్ శిక్షణ ఇచ్చారు. సీనియర్లు సిహెచ్ తేజ, చిన్నబాబు, గిరీష్‌బాబు ప్రోత్సహించారు. రాబోయే ఏషియన్ గేమ్స్, ఒలింపిక్స్‌కు బంగారు పతకాలు తేవటమే లక్ష్యంగా కృషిచేస్తున్నా. దానికోసం కఠోర శిక్షణ పొందుతున్నా. శ్రీ వెలగపూడి రామకృష్ణ మెమోరియల్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ వి.బుచ్చియ్య చౌదరి డెహ్రాడూన్‌లో జరిగిన పోటీలకు హాజరయ్యేందుకు సహకరించారు.

– నాగిడి గాయత్రి,
జల క్రీడాకారిణి



15 నుంచి నూతన నటీనటుల ఎంపికలు

శ్రీమతి అనిత సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ఆధ్వర్యంలో విజయ్‌దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న సినిమాకు రాజు–శిరీష్ నిర్మాతలు. రవికిరణ్ కోలా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో నటించేందుకు క్యారెక్టర్ ఆర్టిస్టుల ఎంపిక నిమిత్తం చిత్ర నిర్మాత, దర్శకులు ఆడిషన్స్ ఏర్పాటు చేశారు. 5 నుంచి 14 సంవత్సరాల బాలురు, 5 నుంచి 12 సంవత్సరాల బాలికలు, 25 నుంచి 65 సంవత్సరాల పురుషులు, 25 నుంచి 60 సంవత్సరాల మహిళలను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఈనెల 15న కాకినాడ మెయిన్‌రోడ్డు (చందనబ్రదర్స్)లోని శ్రీవాత్సలో 17న రాజమహేంద్రవరం (రైల్వేస్టేషన్‌కు సమీపం)లోని హోటల్ సూర్యలో, 19న భీమవరం (టౌన్ రైల్వేస్టేషన్) దగ్గరలోని హోటల్ గ్రాండ్ లీలాకృష్ణలో ఉదయం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఆడిషన్స్ జరుగుతాయని ప్రతినిధులు తెలిపారు.



'తల' సినిమాను ఆదరించండి : అమ్మ రాజశేఖర్

'మానవీయ విలువలతో కూడిన సినిమాగా 'తల'ను తెరకెక్కించాం. క్లాస్, మాస్ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని సస్పెన్స్, కామెడీ వంటి అంశాలను సమపాళ్లలో పెట్టాం. ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాం. నా కుమారుడు రాగిన్ రాజ్ కథానాయకుడిగా పరిచయమవుతున్నాడు. ఆదరించాలని ప్రేక్షకులను కోరుతున్నా. ఈ సినిమా హిట్టయిన తర్వాత మిగతా విషయాలు మాట్లాడతా. శ్రీనివాస్‌గౌడ్ మంచి సహకారాన్ని అందించారు. ఈనెల 14న సినిమాను విడుదల చేయబోతున్నాం. అందరూ ఈ సినిమాను చూసి సపోర్ట్‌చేయాలని విన్నవించుకుంటున్నా' అని ప్రముఖ కొరియోగ్రాఫర్, దర్శకులు అమ్మ రాజశేఖర్ కోరారు. రాగిన్‌రాజ్, రాజాగౌతమ్, అంకిత సస్కర్, రోహిత్, ఎస్తర్ నోరోన్హా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'తల'. ఈ చిత్రానికి డ్యాన్స్ మాస్టర్ అమ్మ రాజశేఖర్ దర్శకత్వం వహించగా, పి.శ్రీనివాసగౌడ్ నిర్మించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని దసపల్లాలో జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో అమ్మ రాజశేఖర్ మాట్లాడారు. అనంతరం కథానాయకుడు రాగిన్‌రాజ్ మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం రెండేళ్లుగా బాగా కష్టపడ్డాం. యాక్షన్ సీక్వెన్స్‌లో చాలా దెబ్బలు తగిలాయి. ఎంతో నమ్మకంతో ఈ సినిమా చేశాం. అన్ని తరగతుల ప్రేక్షకులకు బాగా నచ్చుతుందని భావిస్తున్నాం' అని అన్నారు.



'దిల్ రూబా' వాయిదా!

కిరణ్ అబ్బవరం కొత్త సినిమా 'దిల్ రూబా' రిలీజ్ వాయిదా పడినట్లు తెలుస్తోంది. విశ్వ కరుణ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో రుక్సర్ ఢిల్లోన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. సామ్ సి.ఎస్ సంగీతం అందిస్తున్నారు. షూటింగ్ పనులు ముగించుకుని రిలీజ్‌కు రెడీ అయ్యిన ఈ మూవీని ఫిబ్రవరి 14న రిలీజ్ చేస్తున్నట్లు గతంలో చిత్ర యూనిట్ ప్రకటించింది. కానీ, కొన్ని కారణాల వల్ల ఇప్పుడు ఈ సినిమా రిలీజ్‌ను వాయిదా వేశారని వార్తలు వస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా మార్చి 14న రిలీజ్ చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

త్వరలో 'లగ్జరీ లైఫ్' షూటింగ్



'ఎన్ఎంఆర్ క్రియేషన్స్ బ్యానర్‌పై 'లగ్జరీలైఫ్' సినిమాను తెరకెక్కించబోతున్నాం. ఈ సినిమాలో నటించే వారంతా కొత్త నటీనటులే. నేటి యువతీ యువకుల జీవన విధానం ఏ విధంగా ఉంటుందనే ఇతివృత్తంతో ఈ సినిమాను తెరకెక్కించబోతున్నాం. యువత ఆడంబరాలకు పోయి అవసరాలకు మించి దుబారాలు చేయటం, లివింగ్ రిలేషన్ల పేరుతో ప్రేమలు, పెళ్లిళ్లు, ఆ తర్వాత జరిగే పరిణామాలు, తల్లిదండ్రులు పడే ఇబ్బందులు..ఇలా అన్ని అంశాలను మేళవించి ఓ సందేశాత్మక చిత్రంగా తెరకెక్కించబోతున్నాం. ఇందులో సెంటిమెంట్, హార్రర్, మర్డర్‌మిస్టరీ, సస్పెన్స్, కామెడీ ఇలా అన్నీ వైవిధ్యంగా అన్ని ఎలిమెంట్లు మేళవింపుగా ఉంటాయి. సినిమా మొత్తం ఆంధ్రప్రదేశ్‌లోనే చిత్రీకరించేందుకు గాను ఇప్పటికే లొకేషన్లు సైతం ఎంపికచేశాం. ఈనెలాఖరులో సినిమా షూటింగ్‌ను ప్రారంభిస్తాం. 100 థియేటర్లలో సినిమా విడుదల కోసం ప్రణాళిక రూపొందించాం' అని ప్రముఖ దర్శకుడు, నిర్మాత రెడ్రోతు మల్లేష్‌నాయుడు అన్నారు. ఈ సినిమాకు ఆయనే కథ, స్క్రీన్‌ప్లే, నిర్మాత, దర్శకత్వం వహిస్తున్నారు. గత 25 సంవత్సరాలుగా ఇండస్ట్రీలోని పలు విభాగాల్లో పనిచేసిన ఆయన ఇప్పటికే దర్శక, నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. తన సొంతబ్యానర్‌లో 'లగ్జరీ లైఫ్' సినిమాను తెరకెక్కించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లుగా ప్రకటించారు.

సిరీస్ క్లీన్‌స్వీప్

- చివరి వన్డేలో ఇంగ్లండ్‌పై 142పరుగులతో టీమిండియా గెలుపు
- గిల్ సెంచరీ
- కోహ్లి, శ్రేయస్ అర్ధసెంచరీలు



వన్డే సిరీస్ ట్రోఫీతో టీమిండియా ఆటగాళ్లు

అహ్మదాబాద్: ఇంగ్లండ్‌తో జరిగిన మూడో వన్డేలోనూ భారతజట్టు గెలిచి మూడు వన్డేల సిరీస్‌ను 3–0తో క్లీన్‌స్వీప్ చేసింది. నరేంద్ర మోడీ స్టేడియంలో ఇంగ్లండ్‌తో బుధవారం జరిగిన చివరి వన్డేలో ఏకంగా 142పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా 50 ఓవర్లలో 356పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. అనంతరం ఇంగ్లండ్‌ను 34.2ఓవర్లలో 214పరుగులకే ఆలౌట్ చేసి ఘన విజయం సాధించింది. ఈ వన్డేకు తొలి రెండు వన్డేల్లో గెలిచి సిరీస్‌ను సొంతం చేసుకున్న టీమిండియా... మూడో వన్డేనూ గెలిచి క్లీన్‌స్వీప్ చేసింది.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు శుభారంభం దక్కలేదు. కెప్టెన్ రోహిత్ శర్మ(1) నిరాశపర్చినా... మరో ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (112; 102బంతుల్లో 14ఫోర్లు, 3సిక్సర్లు) శతకంతో మెరిసాడు. 95 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. శ్రేయస్ అయ్యర్ (78; 64బంతుల్లో 8ఫోర్లు, 2సిక్సర్లు) మరోసారి అదిరే ప్రదర్శన చేశాడు. ఫామ్‌లేమితో బాధపడుతున్న విరాట్ కోహ్లి (52; 55బంతుల్లో 7ఫోర్లు, సిక్సర్) ఫామ్‌లోకి వచ్చేశాడు. వికెట్ కీపర్ కేఎల్ రాహుల్ (40; 29బంతుల్లో 3ఫోర్లు, సిక్సర్) రాణించాడు. హార్దిక్ పాండ్యా (17; 9బంతుల్లో 2సిక్స్‌లు) రషీద్ బౌలింగ్‌లో వరుసగా రెండు సిక్సర్లు కొట్టి... ఆ తర్వాతి బంతికి బౌల్డ్ అయ్యాడు. వాషింగ్టన్ సుందర్ (14), అక్షర్ పటేల్ (13), హర్షిత్ రాణా (13) పరుగులు చేశారు. ఇంగ్లండ్ బౌలర్లలో ఆదిల్ రషీద్‌కు నాలుగు, మార్క్‌వుడ్‌కు రెండు, సకిబ్, అట్కిన్సన్, జో రూట్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

భారీ లక్ష్యంతో ఛేదించే క్రమంలో ఇంగ్లండ్ ధాటిగానే ఇన్నింగ్స్‌ను ప్రారంభించింది. తొలి 6ఓవర్లలోనే 60 పరుగులు రాబట్టింది. డకెట్(34) పెవీలియన్‌కు చేరినా.. బాంటన్, సాల్ట్ రాణించారు. వీరిద్దరూ క్రీజ్‌లో ఉండగానే ఇంగ్లండ్ 8.4ఓవర్లలోనే 80పరుగులు చేసేసింది. ఆ తర్వాత సాల్ట్(23) ఔటయ్యాక ఇంగ్లండ్ బ్యాటర్లు పెవీలియన్‌కు క్యూ కట్టారు. బాంటన్(38), రూట్(24), అట్కిన్సన్(38) మాత్రమే కాస్త ఫర్వాలేదనిపించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ శుభ్‌మన్ గిల్‌కు దక్కాయి. అంతకుముందు జరిగిన ఐదు టి20ల సిరీస్‌నూ భారత్ 4–1తో చేజిక్కించుకున్న సంగతి తెలిసిందే.

స్కోర్‌బోర్డు...

ఇండియా ఇన్నింగ్స్: రోహిత్ (సి)సాల్ట్ (బి)వుడ్ 1, శుభ్‌మన్ (బి)రషీద్ 112, కోహ్లి (సి)సాల్ట్ (బి)రషీద్ 52, శ్రేయస్ (సి)సాల్ట్ (బి)రషీద్ 78, కెఎల్ రాహుల్ (ఎల్‌బి)మహమూద్ 40, హార్దిక్ (బి)రషీద్ 17, అక్షర్ (సి)బంటన్ (బి)రూట్ 13, సుందర్ (సి)బ్రూక్ (బి)వుడ్ 14, హర్షిత్ రాణా (సి)బట్లర్ (బి)అట్కిన్సన్ 13, అర్ష్‌దీప్ (రనౌట్) సాల్ట్ 2, కుల్దీప్ (నాటౌట్) 1, అదనం 13. (50 ఓవర్లలో ఆలౌట్) 356పరుగులు. **వికెట్ల పతనం:** 1/6, 2/122, 3/226, 4/255, 5/289, 6/307, 7/333, 8/353, 9/353, 10/356. **బౌలింగ్:** మహమూద్ 10–0–68–1, వుడ్ 9–1–45–2, అట్కిన్సన్ 8–0–74–1, రూట్ 5–0–47–1, రషీద్ 10–0–64–4, లివింగ్‌స్టోన్ 8–0–57–0

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: సాల్ట్ (సి)అక్షర్ (బి)అర్ష్‌దీప్ 23, డకెట్ (సి)రూట్ (బి)అర్ష్‌దీప్ 34, బంటన్ (సి)రాహుల్ (బి)కుల్దీప్ 38, రూట్ (బి)అక్షర్ 24, బ్రూక్ (బి)హర్షిత్ రాణా 19, బట్లర్ (బి)హర్షిత్ రాణా 6, లివింగ్‌స్టోన్ (స్టంప్)కుల్దీప్ (బి)సుందర్ 9, అట్కిన్సన్ (బి)అక్షర్ 38, రషీద్ (బి)హార్దిక్ పాండ్యా 0, వుడ్ (సి)శ్రేయస్ (బి)హార్దిక్ 9, మహమూద్ (నాటౌట్) 2, అదనం 12. (34.2ఓవర్లలో ఆలౌట్) 214పరుగులు. వికెట్ల పతనం: 1/60, 2/80, 3/126, 4/134, 5/154, 6/161, 7/174, 8/175, 9/193, 10/214 బౌలింగ్: అర్ష్‌దీప్ 5–0–33–2, హర్షిత్ 5–1–31–2, సుందర్ 5–0–43–1, అక్షర్ 6,2–1–22–2, హార్దిక్ 5–0–38–2, కుల్దీప్ 8–0–38–1.

సెమీస్‌కు కేరళ

జమ్ము–కాశ్మీర్‌తో మ్యాచ్ డ్రా



నాగ్‌పూర్: రంజీట్రోఫీ కేరళ జట్టు సంచలనం సృష్టించింది. చివరిరోజైన బుధవారం కేరళ బ్యాటర్లు జమ్ము–కాశ్మీర్ బౌలర్లను అద్భుతంగా నిలువరించారు. దీంతో క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌ను డ్రా చేసుకున్న కేరళ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత ఒక్క పరుగుతో సెమీస్‌కు చేరింది. జమ్ము జట్టు నిర్దేశించిన 399పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కేరళ జట్టు ఓవర్‌నైట్ స్కోర్ 2వికెట్ల నష్టానికి 100 పరుగులతో బుధవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించింది. చివరిరోజు దాదాపు 90ఓవర్ల ఆటను ఆడి 6వికెట్ల నష్టానికి 295పరుగులు చేసింది. మ్యాచ్ ప్రారంభం నుంచే కేరళ జట్టు బ్యాటర్లు డ్రా కోసం తీవ్ర ప్రయత్నం చేశారు. అక్షయ్(48; 183బంతుల్లో 4ఫోర్లు), కెప్టెన్ సచిన్(48; 162బంతుల్లో 7ఫోర్లు)కి తోడు సాల్మన్(44నాటౌట్; 162బంతుల్లో 8ఫోర్లు), మహ్మద్(67నాటౌట్; 118బంతుల్లో 9ఫోర్లు, 2సిక్సర్లు) అద్భుతంగా పోరాడారు. దీంతో చివరిరోజు కేరళ జట్టు మరో నాలుగు వికెట్లను మాత్రమే కోల్పోయింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యతతో కేరళ జట్టుకు ఒక్క పరుగు ఆధిక్యత ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో జమ్ము–కాశ్మీర్ 280పరుగులు చేయగా.. కేరళ 281పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

సెమీఫైనల్స్(17న)...

గుజరాత్ × కేరళ | విదర్భ × ముంబయి

ఫైనల్స్‌కు కేరళ, కర్ణాటక

- హోరాహోరీగా సౌత్ జోన్ క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి – మంగళగిరి (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఎసిఎ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఇండియన్ ఆడిట్స్, అకౌంట్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఐఎ అండ్ ఎడి సౌత్‌జోన్ క్రికెట్ టోర్నీలో కేరళ, కర్ణాటక జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. మూడోరోజైన బుధవారం సెమీ ఫైనల్లో నాలుగు జట్లు తలపడ్డాయి. తొలి మ్యాచ్‌లో టాస్ గెలిచిన కేరళ ఫీల్డింగ్‌ను ఎంచుకుంది. తమిళనాడు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 172 పరుగులు చేసింది. వేదాంత్ భరద్వాజ్ తన ఫామ్‌ను కొనసాగిస్తూ 56 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 81 రన్స్ చేశారు. కేరళ బౌలర్ అంకిత్ మిశ్రా 3 ఓవర్లలో 32 పరుగులు ఇచ్చి 2 వికెట్లు పడగొట్టారు. 173 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కేరళ జట్టు 17.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. సచిన్ సురేష్ 39 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లతో 62 పరుగులు చేయగా, ఎంఎస్ అఖిల్ 28 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 55 పరుగులు చేసి మ్యాచ్‌ను విజయపథం వైపు నడిపించారు. మధ్యాహ్నం ఆంధ్రా–తెలంగాణ వర్సెస్ కర్ణాటక మ్యాచ్‌లో టాస్ గెలిచిన కర్ణాటక ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ చేపట్టిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జట్టు 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 145 పరుగులు చేయగా... 146 పరుగుల లక్ష్యంతో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన కర్ణాటక 17.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. కేరళ, కర్ణాటక మధ్య గురువారం ఉదయం 9.30 గంటలకు ఫైనల్ మ్యాచ్ జరగనుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68